శుక్రవారం 15-12-2023



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం.
రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది.
ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 264

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL







All Images are Artist's Impression

Discover the epitome of urban living at Sansa County, Hyderabad's largest integrated township in Patancheru. Immerse yourself in lush green surroundings, pristine parks, and a serene lake, creating the perfect backdrop for a modern and vibrant lifestyle. Spanning 313 acres, Sansa County seamlessly blends retail and commercial excellence with premium residential spaces, unveiling the secret to holistic living. Elevate your lifestyle with 50+ amenities for an enriched living experience. Your dream life begins here!

SWIMMING POOL | SQUASH COURT | PARTY LAWN | CO-WORKING SPACE | BILLIARD ROOMS

• AEROBIC DECK • PETS' PARK • LUDO & HOPSCOTCH POCKET • MUTIPURPOSE LAWN • KIDS' PLAY AREA • SENIOR CITIZENS ZONE • BADMINTON COURT • BASKETBALL COURT • PRACTICE CRICKET PITCH • JOGGING TRAIL • OUTDOOR GYM • NATURE TRAIL • YOGA DECK

HYDERABAD'S LARGEST INTEGRATED TOWNSHIP

4 BHK Triplex Villas | Range: 300 Sq. Yd.

₹2.5 CR* ONWARDS


*T&C Apply

DON'T MISS THIS OPPORTUNITY, TO KNOW MORE 87 4893 4893

Visit our site to uncover your personal paradise! | APPROVED BY LEADING BANKS & FINANCIAL INSTITUTIONS

Site Address: Situated at Survey No. 121 (P), Peddakanjarla Village, Patancheru Mandal, Sangareddy District, Sangareddy-502319. | **TS RERA Registration No: P01100007329**

Disclaimer: These images & any other details are purely indicative & representative, meant solely for promotional purpose & has no legal value in any manner. Refer to "TS RERA WEBSITE" for details of the project.


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 264

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

వచ్చే ఐదేళ్ల లక్ష్యంపై

ప్రభుత్వ పనితీరును వివరించేలా గవర్నర్ ప్రసంగం తయారీ..

- అదే సమయంలో గత ప్రభుత్వ తప్పిదాలను ప్రస్తావించేలా రూపకల్పన!
- నేడు అసెంబ్లీ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్
- సంబంధిత ప్రసంగ పాఠానికి ఆమోదం తెలిపిన కేబినెట్
- రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై శ్వేతపత్రాలు విడుదల చేయాలని నిర్ణయం
- నేడు అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం వచ్చే ఐదేళ్లలో ఏమేం చేయనుంది, ఎలాంటి లక్ష్యాలను పెట్టుకుందనే అంశాలతో శుక్రవారం అసెంబ్లీ ఉభయసభల సంయుక్త సమావేశంలో గవర్నర్ ప్రసంగం ఉండనుంది. ఇదే సమయంలో గత ప్రభుత్వ తప్పిదాలు, పథకాల అమల్లో లోపాలను ప్రస్తావించనుంది. ఈ మేరకు గవర్నర్ ప్రసంగ పాఠానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. గురువారం రాష్ట్ర శాసనసభ వాయిదా పడ్డాక అసెంబ్లీ ఆవరణలోనే కేబినెట్ భేటీ జరిగింది. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మిగతా 8వ పేజీలో ▶


స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి, కేటీఆర్, తలసాని, మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు తదితరులు

నేడు అసెంబ్లీకి గవర్నర్ తమిళిసై

- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగం
- రేపు ధన్యవాద తీర్మానంపై వేర్వేరుగా చర్చ - 8లో



భద్రతా వైఫల్యంపై పార్లమెంట్‌లో రగడ

- ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలి
- లోక్‌సభ, రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యుల డిమాండ్
- ఉభయసభల్లో తీవ్ర గందరగోళం
- లోక్‌సభ నుంచి 13 మంది, రాజ్యసభ నుంచి ఒక విపక్ష ఎంపీ సస్పెన్షన్
- శీతాకాల సమావేశాల్లో మిగిలిన సెషన్ మొత్తం సభకు రావొద్దని స్పష్టీకరణ

- వివరాలు 6లో

జూలైలోనే రెక్కీ..

పార్లమెంటులో చొరబడిన ఆగంతకుల ప్రణాళిక

- వివరాలు 6లో

కరాచి బేకరీ పరిశ్రమలో అగ్నిప్రమాదం..

- 15 మంది కార్మికులకు తీవ్ర గాయాలు
- ఐదుగురి పరిస్థితి విషమం..

- వివరాలు 7లో

నెలసరి.. వైకల్యం కాదు

- మహిళలకు పెయిడ్ లీవ్ ఇవ్వాల్సిన అవసరం లేదు: స్మృతి ఇరానీ - 6లో

విద్యుత్ శాఖలో భారీ మార్పులు!

- ఇంధన శాఖ కార్యదర్శిగా సయ్యద్ ముర్తుజా అలీ రిజ్వీ
- టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీగా ముషార్రఫ్ అలీ ఫారూఖీ
- టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీగా వరుణ్‌రెడ్డి
- పలువురు ఐఏఎస్‌ల బదిలీ.. అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సర్కారు నిర్ణయం - 5లో



రాజేంద్రనగర్‌కు హైకోర్టు

- భవన నిర్మాణానికి జనవరిలో శంకుస్థాపన.. ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎం ఆదేశం - 8లో
- సమీక్షలో పాల్గొన్న సీజే, ఉన్నతాధికారులు


అలరించిన నేవీ బ్యాండ్



సాక్షి, హైదరాబాద్: భారత నేవీ వారోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన నేవీ బ్యాండ్ కార్యక్రమం ఆహూతులను అలరించింది. నేవీ అధికారుల బ్యాండ్ బృందాలు తమ సంగీతంతో ఆకట్టుకున్నాయి. అంతర్జాతీయ స్థాయిలోని పలు ప్రముఖ గీతాలతోపాటు తెలుగు, హిందీ చలనచిత్రాల్లో ప్రాచుర్యం పొందిన గీతాలను తమ సంగీత వాయిద్యాలతో పలికిస్తూ శ్రోతలను ఆనందింపజేశారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం

కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఫార్మా సిటీని రద్దు చేయాలనే సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయంతో ప్రజలు సంతోషపడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.కోదండరెడ్డి చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన పార్టీ నేతలు చల్లా నర్సింహారెడ్డి, బెల్లయ్యనాయక్‌తో కలసి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో భాగంగానే ఫార్మాసిటీని తరలిస్తామని రేవంత్ మాటిచ్చారని తెలిపారు. ఈ నిర్ణయంతో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

రైతులు హ్యాపీ: మల్‌రెడ్డి



రైతులకిచ్చిన హామీ మేరకు రంగారెడ్డి జిల్లాలోని ఫార్మా సిటీని రద్దు చేసి అక్కడ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తామని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెప్పారు. ఆయన గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బుల్లెట్ వేగంతో పని చేస్తున్నారని, తమ ప్రభుత్వ పనితీరు చూసి ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు.



మరొకసారి కూటమి పేరు మార్చుదామంటారా..!?

ఈ సంపద మరియు ఈ సంతానం, కేవలం ఐహిక జీవితపు అలంకారాలు మాత్రమే. కాని శాశ్వతంగా నిలిచేవి సత్కార్యాలే! అవే నీ ప్రభువు దృష్టిలో ప్రతిఫలానికి ఉత్తమమైనవి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 15 డిసెంబర్ 2023

జాతికి జవాబు కావాలి!

దేశం మొత్తాన్నీ ఉలిక్కిపడేలా చేసిన ఘటన అది. ప్రధాని సహా పార్లమెంటరీ ప్రజాప్రతినిధులందరూ సమావేశమయ్యే ప్రాంగణంలోని పెను భద్రతా వైఫల్యాలను బుధవారం టీవీల సాక్షిగా కళ్ళకు కట్టిన ఉదంతమది. 2001 నాటి చేదు జ్ఞాపకాలను ఈ దురంతం మళ్ళీ గుర్తుచేసింది. అప్పట్లో పాక్ ప్రేరేపిత తీవ్రవాదులు మన పార్లమెంట్‌పై తుపాకులతో దాడికి తెగబడితే, ఈసారి సందర్శకులుగా వచ్చిన ఇద్దరు భారతీయ సాధారణ యువకులు పదుల అడుగుల ఎత్తులోని లోక్‌సభ ప్రేక్షకుల గ్యాలరీ పై నుంచి సభాంగణంలోకి దూకి, రహస్యంగా తెచ్చిన పొగగొట్టాలతో అలజడి రేపారు. సభ వెలుపల రంగుల పొగతో మరో ఇద్దరు నిరసన పూర్వక నినాదాలు చేశారు. నలుగురినీ అరెస్ట్ చేసి, కఠినమైన 'ఉపా' చట్టం కింద కేసు పెట్టి పోలీస్ కస్టడీకి పంపారు. సూత్రధారుల కోసం గాలింపు సాగుతోంది. ప్రస్తుతానికి 8 మంది భద్రతా సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశారు కానీ, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, నేర్చుకోవాల్సిన పాఠాలు చాలా ఉన్నాయి.

ఇదేదో అప్పటికప్పుడు ఈ యువతీ యువకులు సృష్టించిన హంగామా కాదు. ఇరవై రెండేళ్ళ క్రితం పార్లమెంట్‌పై పాక్ తీవ్రవాదులు దాడి జరిపిన డిసెంబర్ 13నే... తమ దుశ్చర్యకు వారు ఎంచుకున్నారంటే ఎంత ఆలోచన, ప్రణాళిక ఉండివుంటుంది! ఒక్కపక్క అమెరికా గడ్డ మీద నుంచి హూంకరిస్తున్న ఖలిస్తానీ తీవ్రవాది గురుపత్‌వంత్ సింగ్ పన్నూ ఈ నెలాఖరులోగా పార్లమెంట్‌పై దాడి చేస్తామని చాలా రోజుల క్రితమే హెచ్చరించారు. మరోపక్క పార్లమెంట్‌పై మునుపటి దాడిలో పలువురు బలైన ఘటనకు 22వ వార్షిక సంస్మరణ దినం. ఈ నేపథ్యంలో బుధవారం పార్లమెంట్ వద్ద ఎంత పారాహుషార్‌గా ఉండాలి! అంచెలంచెల తనిఖీని దాటుకొని, ఆ నలుగురూ కాలిజోళ్ళలో పొగగొట్టాలు పెట్టుకొని, లోపలికి వచ్చారంటే మన తనిఖీ, నిఘా వ్యవస్థలు నిద్రిస్తున్నట్టేగా!

ప్రాథమిక సమాచారం మేరకు... పార్లమెంట్‌లో అలజడి రేపిన నలుగురిలో ఎవరూ తీవ్రవాదులు కారు. మధ్య, దిగువ తరగతి నిరుద్యోగులు. భగత్ సింగ్ అభిమానులంటున్న వీరంతా దేశంలోని వేర్వేరు భౌగోళిక ప్రాంతాల నుంచి ఫేస్‌బుక్ పేజీ ద్వారా ఎలా ఒక్కటయ్యారు, ఎలా ఈ నిరసన దుశ్చర్యకు దిగారన్నది ఇంకా లోతుగా ఆరా తీయాలి. ఆరు డిగ్రీలు చేసి, లెక్చరర్ ఉద్యోగానికి 'నెట్' సైతం పాసైన నిరుద్యోగ హర్యానా యువతి నీలమ్. కంప్యూటర్ ఇంజనీరైన నిరుద్యోగ మైసూరీ మధ్యవయస్కుడు మనోరంజన్. ఆర్మీలో చేరాలని ఆరాటపడి విఫలమైన కుర్రాడు అమోల్. లక్నోకు చెందిన ఇ–రిక్షా కార్మికుడు సాగర్ శర్మ. ఇలాంటి సామాన్యులు ఏ నిస్పృహలో, ఎవరి ప్రేరేపణతో చెడుదోవ పట్టి ఇంతటి దుస్సాహసానికి దిగినట్టు? వీరిని ఆడించిన అసలు నాయకుడు ఎవరు? ఇంటి దొంగలా, లేక దేశ సార్వభౌమాధికారాన్ని సవాలు చేస్తున్న విదేశీ శక్తులా?

ఏడాదిగా ఈ పథకరచన సాగుతోందట. ఈ మార్చి, జూలైల్లోనూ పార్లమెంట్‌లో భద్రతపై రెక్కీ నిర్వహించారట. ఇది దిగ్భ్రాంతికరం. ప్రజాస్వామ్య దేవాలయంలో జరిగిన దుస్సాహసంపై ప్రజాప్రతినిధులంతా ఏకమై పిడికిలి బిగించాల్సిన వేళ దురదృష్టవశాత్తూ రాజకీయాలు రేగుతున్నాయి. అధికారపార్టీ ఎంపీ నుంచి ఈ నిరసనకారులకు పాసులు జారీ కావడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. పార్లమెంట్ సహా ఢిల్లీ భద్రత మొత్తం చేతిలో ఉండే హోమ్ మంత్రి ఈ మొత్తం ఘటనపై సభలో ప్రకటన చేయాలని కోరుతున్నాయి. జవాబివ్వాల్సిన అధికార పక్షం మొండికేయడం, రచ్చ పెరగడంతో ప్రతిపక్షానికి చెందిన 14 మందిని లోక్‌సభ నుంచి, ఒకరిని రాజ్యసభ నుంచి శీతకాల సమావేశాలు ముగిసేవరకు సస్పెండ్ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడం దీనికి పరాకాష్ఠ.

సభలోనే కాదు ఢిల్లీలోనే లేని ఓ ప్రతిపక్ష ఎంపీ పేరు సైతం సస్పెండైన వారి పేర్లలో పేర్కొనడం విడ్డూరం. ఆ వాస్తవం రచ్చకెక్కేసరికి 'అది క్లరికల్ మిస్టేక్' అని సింపుల్‌గా తేల్చేస్తూ, 13మందే సస్పెండయ్యారని గురువారం పొద్దుపోయాక వివరణ నిచ్చుకోవాల్సి వచ్చింది. భద్రత విషయంలోనే కాదు... చివరకు సభా నిర్వహణలోనూ సర్కారీ నిర్లక్ష్యాన్ని ఇది చెప్పకనే చెబుతోంది. నిరసన తెలిపే ప్రతిపక్షాలను పరోక్షంగా వెక్కిరిస్తూ, వచ్చి అరెస్టయినవారు 'ఆందోళన్ జీవు'లంటూ అధికారపక్షం తేలిగ్గా ముద్ర వేస్తోంది. ఒకవేళ వచ్చింది 'ఆతంకవాదులై' ఉంటేనో? వారు పొగగొట్టాలు కాక గ్రెనేడ్లు, ఐఈడీలు తెగలిగితేనో? ఏమై ఉండేది? భీతిగొలిపే ఆలోచన అది. అందుకే సర్వోన్నత పార్లమెంట్‌లోనే సభ్యుల రక్షణను వెక్కిరిస్తున్న ఘటనను ఆరోపణలపర్వంగా మారిస్తే లాభం లేదు.

తీవ్రమైన ఈ భద్రతా వైఫల్యంపై జాతీయ భద్రతా ఏజెన్సీ సహా అత్యున్నత వ్యవస్థలతో దర్యాప్తు జరిపించాలి. సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ)తోనూ పరిస్థితిని మదుపు చేయిస్తే, భద్రతా ఏర్పాట్లను పునస్సమీక్షిస్తే సభ్యులకు భరోసా కలుగుతుంది. దుర్భేద్యమని పదేపదే చెప్పిన కొత్త పార్లమెంట్ భవనంలోనే ఇంతటి ఘటన జరిగినందున అందరూ ఒకే గేటు నుంచి రాకపోకలు సాగించడం లాంటి పద్ధతులు మార్చాలి. మెటల్ డిటెక్టర్లతో ప్లాస్టిక్‌ను గుర్తించలేనందున తనిఖీ విధానాల్ని ఆధునికీకరించి, పటిష్ఠపరచాలి. పార్లమెంటరీ సెక్యూరిటీలో నేటికీ వందకు పైగా ఉద్యోగ ఖాళీలున్నాయట. అదీ పట్టించుకోక కళ్ళు తెరిచి నిద్రపోతే నష్టం దేశానికి! అలాగే, ప్రభుత్వ గుర్తింపున్న పాత్రికేయుల్ని సైతం పార్లమెంట్‌లోకి రానివ్వని పాలకులు మహిళా రిజర్వేషన్ లాంటి కీలక బిల్లుల వేళ బస్సుల్లో జనాన్ని తరలించుకొచ్చి, గ్యాలరీ నుంచి నినాదాలిప్పిస్తున్న సంస్కృతిని విడనాడాలి. పార్లమెంట్ ప్రాంగణం ప్రజాపాలనకై తప్ప, ప్రచార ఆర్భాటానికి కాదని గుర్తించాలి. మణిపూర్ మొదలు జాతీయ భద్రత దాకా ప్రతిదానిపైనా ప్రభుత్వ జవాబు కోసం, జవాబుదారీతనం కోసం ఇంతగా పట్టుబట్టాల్సి రావడం మాత్రం ప్రజాస్వామ్యానికి వన్నె తీసుకురాదని గ్రహించాలి.

బహిష్కరణకూ ఓ పద్ధతుంది!

విశ్లేషణ



చక్షూ రాయ్

పార్లమెంట్ సభ్యురాలు మహువా మొయిత్రాను సభా సభ్యత్వం నుండి డిసెంబర్ 8న లోక్‌సభ బహిష్కరించింది. ఆమెను లోక్‌సభలో ప్రసంగించడానికి అనుమతించలేదు. ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. అయినా మొయిత్రాను 17వ లోక్‌సభ నుండి బహిష్కరించే తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఉనికిలో లేని నీతి నియమావళితో ఆమెను దోషిగా నిర్ధారించారు. పార్లమెంటు తనను తానే నియంత్రించుకుంటుంది కాబట్టి, ఎంపికైన ప్రజా ప్రతినిధి సభ్యత్వాన్ని రద్దు చేయడం అనే తీవ్రమైన చర్యను నిందకు తావులేని ప్రక్రియ ద్వారా చేయాలి. చట్టసభలకు ఎన్నికైన ప్రతినిధుల దుష్ప్రవర్తన, నైతిక ఉల్లంఘనల ప్రశ్నలను ఎదుర్కోవటానికి రెండు ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా, బ్రిటన్ ఉదాహరణలు మనకు ఉన్నాయి.

మహువా మొయిత్రాను బహిష్కరించే తీర్మానాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ ప్రవేశపెట్టారు. మొయిత్రా ప్రవర్తన (ఆమె తన పార్లమెంటరీ లాగిన్ వివరాలను పంచుకోవడం, వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుండి నగదును, సౌకర్యాలను స్వీకరించడం) పార్లమెంట్ సభ్యురాలికి తగదని ఆ తీర్మానం పేర్కొంది. బహిష్కరణ ప్రక్రియను వెంటాడి వేధించడంగా అభివర్ణించారు మొయిత్రా. తనపై ఆరోపణకు సంబంధించి డబ్బు మార్పిడికి ఎలాంటి రుజువు లేదనీ, నైతిక కమిటీలో తనకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యం ప్రేరేపితమైనదనీ, ఇది వైరుధ్యపూరితంగా ఉందనీ అన్నారు. తనపై నిందమోపిన వారిని ఎదురు ప్రశ్నించడానికి ఆమెను అనుమతించలేదు.

మన పార్లమెంట్ పనితీరుకు సంబంధించినంత వరకు ఈ మొత్తం అధ్యాయం వివాదాస్పదమైంది. రాజకీయాలు, వ్యక్తిత్వం ఈ ప్రక్రియను కప్పివేశాయి. పార్లమెంట్ తన వ్యవహారాల నిర్వహణకు సొంత నిబంధనలను రూపొందించుకునే అధికారాన్ని మన రాజ్యాంగం ఇచ్చింది. దుష్ప్రవర్తన కారణంగా దాని సభ్యులను బహిష్కరించే అధికారం దీని పర్యవసానమే. పార్లమెంటు తనను తానే నియంత్రించుకుంటుంది కాబట్టి, ఎంపికైన ప్రజా ప్రతినిధి సభ్యత్వాన్ని రద్దుచేయడం అనే తీవ్రమైన చర్యను నిందకు తావులేని ప్రక్రియ ద్వారా చేయాలి.

చట్టసభలకు ఎన్నికైన ప్రతినిధుల దుష్ప్రవర్తన, నైతిక ఉల్లంఘనల ప్రశ్నలను ఎదుర్కోవటానికి రెండు ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా, బ్రిటన్‌ల ఉదాహరణలు మనకు ఉన్నాయి. అమెరికన్ కాంగ్రెస్‌తో మొదలుపెడదాం: డిసెంబర్ 1న అమెరికా ప్రతినిధుల సభ, న్యూయార్క్ రిపబ్లికన్ గెరోజ్ శాంటోస్‌ను తన సభ్యత్వం నుండి బహిష్కరించింది. ఎన్నికల ప్రచారంలో వంచన, ఆర్థికపరమైన అవకతవకలు, ఉల్లంఘనలు, లైంగిక దుష్ప్రవర్తన ఆరోపణలపై సుమారు తొమ్మిది నెలల విచారణ తర్వాత ఈ బహిష్కరణ ఆదేశం వచ్చింది.

రిపబ్లికన్ పార్టీ ప్రతినిధిపై వచ్చిన ఫిర్యాదులను రెండు వేర్వేరు కార్యాలయాలు పరిశీలించాయి. ఒకటి... కాంగ్రెషనల్ ఎథిక్స్ కార్యాలయం (ఓసీఈ). నైతిక చట్టంలో నైపుణ్యం కలిగిన న్యాయవాదులు, పరిశోధకులతో కూడిన స్వతంత్ర, పక్షపాతం లేని ఈ సంస్థను 2008లో స్థాపించారు. ఇది హౌస్ సభ్యులపై, కాంగ్రెస్ సిబ్బందిపై ఫిర్యాదులను స్వీకరిస్తుంది, పునఃపరిశీలిస్తుంది. ఒక వివరణాత్మక పరీక్ష తర్వాత, ఇది తన సిఫార్సును ఎథిక్స్ కమిటీకి పంపుతుంది. ఇది స్వీకరించే ఫిర్యాదులు, వాటిపై తీసుకునే చర్యల గురించి వివరణాత్మక గణాంకాలను కూడా ప్రచురిస్తుంది.

శాంటోస్‌పై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన రెండో కార్యాలయం హౌస్ ఎథిక్స్ కమిటీ. ఇది ఇతర సభ్యుల నుండి ఫిర్యాదులను స్వీకరించింది. 'ఓసీఈ' నుండి సూచనను, శాంటోస్ వ్యవహారాన్ని విచారించిన ప్రతినిధుల సభ నుండి తీర్మానాన్ని హౌస్ ఎథిక్స్ కమిటీ పరిశీలించి ఒక పరిశోధనాత్మక సబ్ కమిటీని నియమించింది. ఇది 40 మంది సాక్షులను ఇంటర్వ్యూ చేసింది. 72,000 పేజీల పత్రాలను అందుకుంది. సబ్‌కమిటీకి తన వివరణను ఇవ్వడానికి ఎథిక్స్ కమిటీ శాంటోస్‌నూ అనుమతించింది. కాని దాన్ని ఆయన తిరస్కరించారు.



శాంటోస్ 'తన వ్యక్తిగత ఆర్థిక లాభం కోసం, ప్రతినిధుల సభకు తన అభ్యర్థిత్వంలోని ప్రతి అంశాన్నీ మోసపూరితంగా ఉపయోగించుకోవాలని చూసినట్లు' పరిశోధనాత్మక కమిటీ కనుగొంది. ఎథిక్స్ కమిటీ నివేదికలోని బహిష్కరణ ప్రతిపాదనను ప్రతినిధుల సభ పరిగణనలోకి తీసుకుంది. కాంగ్రెస్ సభ్యుడిని తొలగించడానికి అమెరికా రాజ్యాంగం ఒక భారీ అడ్డంకిని ఉంచింది. అలాంటి తొలగింపు ప్రతిపాదనకు సంబంధిత సభలోని మూడింట రెండొంతుల మంది సభ్యులు అంగీకరించాలి. అతడిని తొలగించడానికి చేసిన మొదటి రెండు ప్రయత్నాలు విఫలమయ్యాయి. మూడవ ప్రయత్నంలో, అతని రిపబ్లికన్ పార్టీకి చెందిన 105 మంది సభ్యులు కూడా 206 మంది డెమోక్రాట్‌లతో కలిసి శాంటోస్‌ని బహిష్కరించారు.

ఎంపీల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండేలా పర్యవేక్షించడానికి బ్రిటన్ పార్లమెంట్ కూడా విస్తృతమైన యంత్రాంగాన్ని కలిగి ఉంది. ఇది ప్రయోజనాలకు సంబంధించిన పబ్లిక్ రిజిస్టర్‌ని నిర్వహిస్తుంది. ఎంపీలు తమ పార్లమెంటరీ విధుల సమయంలో పొందిన ఆదాయాలు, ఆతిథ్యం, బహుమతులను తప్పనిసరిగా ప్రకటించాలి. పార్లమెంటరీ ప్రమాణాల కమిషనర్ అని పిలిచే ఒక స్వతంత్ర అధికారి ఈ రిజిస్టర్‌ను నిర్వహిస్తారు. ఎంపీలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తారు. కమిషనర్ పనిని ఎంపీల స్టాండర్డ్స్ కమిటీ సమీక్షిస్తుంది. ఎంపీలపై ఎలాంటి చర్య తీసుకోవాలో సిఫారసు చేస్తుంది.

2009లో, ఖర్చుల కుంభకోణం (హౌస్ ఆఫ్ కామన్స్ ఎంపీలు పార్లమెంట్ నుండి వ్యక్తిగత ఖర్చులను రీయింబర్స్ చేయడం) తర్వాత, ఎంపీలు, వారి సిబ్బంది వేతనాలు, పింఛన్లను నియంత్రించేందుకు స్వతంత్ర పార్లమెంట్ ప్రమాణాల సంస్థను ఏర్పాటు చేయడానికి బ్రిటన్ ఒక చట్టాన్ని కూడా ఆమోదించింది. ఫిర్యాదులను స్వీకరించడానికి, దర్యాప్తు చేయడానికి స్వతంత్ర యంత్రాంగాలతో పాటు, అమెరికా, బ్రిటన్ పార్లమెంటులు, వారి సభ్యులు అనుసరించడానికి వివరణాత్మక మార్గదర్శకాలను కూడా అందించాయి. ఉదాహరణకు అమెరికాలో ఈ సంవత్సరం ప్రారంభంలో, కాంగ్రెషనల్ ఎథిక్స్ కార్యాలయం ఒక విషయాన్ని హౌస్ ఎథిక్స్ కమిటీకి సూచించింది; ప్రతినిధుల సభకు చెందిన అలెగ్జాండ్రియా ఒకాసియో-కోర్టెజ్, 2021లో ఛారిటీ మెట్ గాలాలో ధరించేందుకు మేకప్ సేవలు, హ్యాండ్‌బ్యాగ్, ఆభరణాలు, దుస్తులను అంగీకరించడం ద్వారా బహుమతి నియమాలను ఉల్లంఘించి ఉండవచ్చంది.

భారతదేశంలో రాజ్యసభ ఎథిక్స్ కమిటీ తన ఎంపీలకు ప్రవర్తనా నియమావళిని నిర్వచించింది. రాజ్యసభ ఎంపీలు తమ పార్లమెంటరీ వ్యవహారాల కోసం ఎలాంటి ప్రయోజనాలనూ అంగీకరించకూడదని కోడ్ నిర్దేశిస్తుంది. వారి వ్యక్తిగత ప్రయోజనాలకూ, ప్రజాప్రతినిధిగా వారి విధినిర్వహణకూ మధ్య వైరుధ్యం ఏర్పడిన సందర్భాల్లో, వారు తమ ప్రభుత్వ కార్యాలయానికి బాధ్యత వహించాలని కూడా ఇది పేర్కొంది. రాజ్యసభ ఎంపీలు తప్పనిసరిగా బ్రిటన్ పార్లమెంట్ పద్ధతిలో వలే సభ్యుల ప్రయోజనాల రిజిస్టర్‌ను కూడా పూరించాలి. ప్రత్యక్షంగా ఎన్నికైన సభ ఇంకా ఈ నిబంధనలను తన నియమాలలో పొందుపరచనందున ఈ కోడ్, రిజిస్టర్ రాజ్యసభ ఎంపీలకు వర్తిస్తుంది తప్ప లోక్‌సభ సభ్యులకు కాదు.

1951లో నాటి మన తాత్కాలిక పార్లమెంటు తన సభ్యులలో ఒకరైన హెచ్‌జి ముద్గల్ సభా గౌరవాన్ని కించపరిచేలా ప్రవర్తించిన మొదటి కేసును ఎదుర్కొంది. ఈ కేసులో ముద్గల్‌ను సమర్థించుకోవడానికి అనుమతించారు. ఆ తర్వాత సభ తనను బహిష్కరించే ముందు ఆయన రాజీనామా చేశారు. ఆయన ప్రవర్తనను పరిశీలించిన కమిటీ, ఎంపీలకు ప్రవర్తనా నియమావళిని విధించాలని కోరింది. ఏ సభ్యుడైనా సంబంధిత పార్టీల నుండి ద్రవ్య లేదా ఇతర పరిగణనలను అంగీకరించడంపై నిర్దిష్ట కారణాలను, ప్రయోజనాలను సమర్థించుకోవడం అనేది ప్రజాస్వామ్యానికి విషం అవుతుంది.

72 ఏళ్ల తరువాత, ఇదే విధమైన ప్రశ్నపై బహిరంగ చర్చ కేంద్రీకృతమై ఉన్నందున, ఎంపీల నైతిక నిబంధనల ఉల్లంఘనలను నిర్ణయించడానికి పార్లమెంటుకు పటిష్ఠమైన విధానం ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. ఇటువంటి ప్రక్రియ పార్లమెంటు గౌరవాన్ని నిలబెట్టి, దాని శాసన సమగ్రతను కాపాడే సాధనంగా మారుతుంది. దాని నిర్ణయాల గురించి ఎలాంటి అనుమానాలనైనా తొలగించివేస్తుంది.

వ్యాసకర్త లెజిస్లేటివ్ అండ్ సివిక్ ఎంగేజ్‌మెంట్ హెడ్, పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పనికేం ఆటంకం?



రుతుస్రావం అనేది ప్రతిబంధకం కాదు. దాని కోసం 'పెయిడ్ లీవ్' విధానం అక్కర్లేదని అన్నారు మంత్రి స్మృతీ ఇరానీ. నూరు శాతం ఏకీభవిస్తున్నా. దాని కోసం పెయిడ్ లీవ్ అక్కర్లేదు.

– నూపుర్ జె. శర్మ, సంపాదకురాలు

నొప్పిని తప్పనొద్దు!



పీరియడ్ (రుతుస్రావ) లీవ్ అనేది మెటర్నిటీ లీవ్ లాంటిది. కాబట్టి, మీ పీరియడ్ బాధాకరంగా లేకపోతే సెలవు తీసుకోవద్దు. కానీ మీకు నొప్పి లేనంత మాత్రాన ఇతరుల నొప్పిని నిరాకరించొద్దు.

– కరుణా నందీ, న్యాయవాది

హింసాత్మక బృందం



36 ఏళ్ల క్రితం, ఈ రోజున (డిసెంబర్ 14, 1987) హమాస్‌ను స్థాపించారు అహ్మద్ యాసీన్. మూడు దశాబ్దాల హింస, వినాశనాలకు తెర పడనుంది. ఈ శతాబ్దపు నరమేధానికి పాల్పడిన రాక్షస బృందంగా మాత్రమే హమాస్ గుర్తుండిపోతుంది.

– మొసాబ్ హసాన్ యూసెఫ్, యాక్టివిస్ట్

కంపు గొట్టిస్తున్నారు!



సాధారణంగా భారతీయ రైల్వేల్లో కంపుగొట్టే టాయ్‌లెట్లకు 'మురికి' భారతీయుల్ని నిందిస్తుంటాం. కానీ ప్రధాని, రైల్వేమంత్రి రైల్వేను నాశనం చేశారు. జైపూర్ నుంచి (మొన్న) 1:10కు బయల్దేరిన 22934 రైల్లో 2 గంటలకే టాయ్‌లెట్లు కంపు కొడుతున్నాయి. పైగా ఒక టాయ్‌లెట్‌లో కిటికీ విరిగింది. చలికాలంలో రాత్రి ఉష్ణోగ్రతలు 9–10 డిగ్రీలకు పడిపోయే రాజస్థాన్‌లో ప్రయాణికుల దుస్థితి ఊహించండి. పైగా ఇదంతా ఏసీ ఫస్ట్ క్లాసులో! మోదీ వందేభారత్ పబ్లిసిటీ స్టంట్ మీదే రైల్వే మంత్రి పూర్తిగా దృష్టి పెట్టారు.

– రాజేంద్ర కుంభట్, ఆగ్రహ భారతీయుడు

కోపం పలువిధాలు



ప్రపంచంలో చాలా ఆగ్రహావేశాలు నెలకొని ఉన్నాయి. ఉదాహరణకు, 'నాకు ఆలూ పరాఠా ఇష్టం' అని మీరు ట్వీట్ చేయొచ్చు. కానీ మూలీ (ముల్లంగి) పరాఠాను అవమానించినందుకు మిమ్మల్ని జనం ట్రోల్ చేస్తారు.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

కమ్యూనిస్టుల పరిస్థితేమిటి?

అభిప్రాయం



డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి

కమ్యూనిస్టు పార్టీలైన సీపీఐ, సీపీఎంలు 'మతతత్వ' బీజేపీని ఓడించాలనే తమ ప్రధాన కోరికను పదే పదే వ్యక్తం చేస్తుంటాయి. అయితే, 1930 నుంచి 1948 సెప్టెంబరు 17 వరకు ఉనికిలో ఉన్న రజాకార్ల నుండి ఉద్భవించిన... పూర్తిగా ముస్లిం పార్టీ అయిన ఏఐఎమ్ఐఎమ్‌ని వీరు ఎప్పుడూ ఖండించరు. హైదరాబాద్‌ను భారత్‌లో చేర్చడాన్ని వ్యతిరేకించిన నాటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ 1951 సెప్టెంబరు వరకు భారత యూనియన్‌కు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధానికి దిగింది. అలాగే వీరు తాము విమర్శించిన పార్టీలతోనూ ఎన్నికల సమయంలో పొత్తులు పెట్టుకుంటారు. అయితే పొత్తులున్నా వీరు డిపాజిట్లు కోల్పోవడం జరుగుతుంది. తాజాగా 2023 నవంబర్ 30న తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు మళ్లీ విడివిడిగా పోరాడాయి. ముందు బీఆర్ఎస్‌తో బేరసారాలు ఆడి తిరస్కరణకు గురై కాంగ్రెస్ దగ్గరకు వెళ్లాయి. చెరొక రెండు సీట్లు ఇవ్వమని కాంగ్రెస్‌ను కోరినా ప్రయోజనం లేకపోయింది. చివరికి సీపీఐకి ఒక్క సీటు ఇచ్చింది కాంగ్రెస్. సీపీఎంకు మాత్రం ఆ పార్టీతో పొత్తు కుదరలేదు.

దీంతో సీపీఎం పలు పార్టీలతో కూడిన కూటమిని ఏర్పాటు చేసి 19 నియోజక వర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. కానీ ప్రతి చోటా డిపాజిట్లను కోల్పోయింది. ఒక్క సీటు గెలిచిన సీపీఐ మాత్రం ప్రజాస్వామ్యం గెలిచేసిందని ప్రకటన చేసింది. ఇకపోతే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో ''బీఆర్ఎస్ నియంతృత్వ పాలన ముగిసింది' అని సీపీఎం ప్రకటన ఇచ్చింది. ఈ పార్టీలన్నింటికీ ఓట్ల శాతం 0.1 శాతం కంటే తక్కువగా ఉంది, అయినప్పటికీ దేశంలోని ప్రతి చోటా 'మతతత్వ బీజేపీ'ని ఓడిస్తామని వారు గొప్పలు చెప్పుకుంటున్నారు. మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా 'లౌకిక, ప్రగతిశీల, ప్రజాతంత్ర' శక్తులను బలోపేతం చేయడానికి అన్ని వామపక్ష పార్టీలు కలిసి రావాలని ఈ రెండు పార్టీలు తరచుగా ప్రకటిస్తున్నాయి. కానీ అవి మాత్రం ఒకదానితో ఒకటి విలీనం కావు!

కమ్యూనిస్టు పార్టీల చరిత్ర దుర్భరమైనది. 1975 జూన్ – 1977 మార్చి వరకు ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీకి సీపీఐ మద్దతు ఇచ్చింది. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైనప్పుడు, ఇందిరా ఎమర్జెన్సీ పాలనకు మద్దతు ఇచ్చినందుకు చింతిస్తూ 1978లో భటిండాలో సీపీఐ తీర్మానం చేసింది. మరోవైపున సీపీఎం, ఇందిర ఎమర్జెన్సీ పాలనను వ్యతిరేకించింది. ఇందిరాగాంధీతో సీపీఐ సహ కారాన్ని కూడా వ్యతిరేకించింది.

గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ వెల్లడించిన ప్రకారం, కేరళలో (బహుశా పశ్చిమ బెంగాల్, త్రిపురల్లో కూడా) కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నప్పుడు, ప్రతి మంత్రి ఇద్దరు ప్రైవేట్ కార్యదర్శులను రెండేళ్ల కాలానికి నియమిస్తారు, తర్వాత రెండేళ్లకు మరో ఇద్దరిని నియమిస్తారు. పదవీ విరమణ అనంతరం వారందరికీ జీవిత కాలపు పెన్షన్ లభిస్తుంది. ఆ విధంగా ప్రభుత్వ ఖర్చులతో జీవితకాల కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను వారు సృష్టిస్తున్నారు. ఇది అవినీతి కాకపోతే మరేమిటి?

వ్యాసకర్త భారతీయ ధర్మరక్షణ సమాఖ్య కన్వీనర్ | 83093 92687

చందమామపై మన అడుగే తరువాయి!

అభిప్రాయం



ఎస్. సోమనాథ్

అందరినీ ఆశ్చర్యానందాలలో ముంచెత్తిన చంద్రయాన్–3 విజయం తర్వాత, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా 2040 నాటికి భారతీయ వ్యోమగాములు చంద్రునిపైకి వెళ్ళే దిశగా పూర్తిగా ప్రయత్నం చేస్తున్నాం. భవిష్యత్తుపై దృష్టితో, 'గగన్‌యాన్' ప్రోగ్రామ్‌లో భాగంగా, ఇద్దరి నుంచి ముగ్గురు వరకూ భారతీయ వ్యోమగాములను 'లో ఎర్త్ ఆర్బిట్' (ఎల్ఈఓ) లోకి పంపించి, మూడు రోజుల వరకు అక్కడ ఉంచి, మన దేశంలోని ఒక నీటి వనరుపై వారిని ల్యాండ్ చేసే (దించే) కార్యక్రమంలో మరొక అడుగు ముందుకు వేయాలని ప్రయత్నిస్తోంది ఇస్రో.

ఈ మిషన్ కోసం భారత వైమానిక దళానికి చెందిన నలుగురు టెస్ట్ పైలట్‌లను ఆస్ట్రోనాట్–డెసిగ్నేట్‌లుగా ఎంపిక చేశాం. ప్రస్తుతం, వారు బెంగళూరులోని ఆస్ట్రోనాట్ ట్రైనింగ్ ఫెసిలిటీ (ఏటీఎఫ్)లో మిషన్–నిర్దిష్ట శిక్షణ పొందుతున్నారు. హ్యూమన్–రేటెడ్ (మానవులను సురక్షితంగా రవాణా చేయగల సామర్థ్యం) లాంచ్ వెహికల్ (హెచ్ఎల్‌వీఎమ్3), క్రూ మాడ్యూల్ (సీఎమ్), సర్వీస్ మాడ్యూల్ (ఎస్ఎమ్)లతో కూడిన ఆర్బిటల్ మాడ్యూల్; లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌లతో సహా క్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌లో ప్రారంభ దశలో ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్, ప్యాడ్ అబార్ట్ టెస్ట్, టెస్ట్ వెహికల్ ఫ్లైట్‌లతో పాటు రెండు ఒకేలా ఉండే అన్–క్రూడ్ మిషన్‌లు (జీ1, జీ2) మనుషులతో కూడిన మిషన్‌కు ముందు ఉంటాయి.

సీఎమ్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. సీఎమ్ అనేది సిబ్బంది కోసం అంతరిక్షంలో భూమి–వంటి వాతావరణంతో నివాసయోగ్యంగా ఉండే స్థలం. వ్యోమగాములు సురక్షితంగా తిరిగి రావడం కోసం ఉద్దేశించింది ఇది. భద్రతా చర్యలలో అత్యవసర పరిస్థితుల కోసం క్రూ ఎస్కేప్ సిస్టమ్ (సీఈఎస్) కూడా ఉంటుంది.

టెస్ట్ వెహికల్ (టీవీ–డీ1) యొక్క మొదటి డెవలప్‌మెంట్ ఫ్లైట్ 2023 అక్టోబరు 21న ప్రారంభించబడింది. ఇది క్రూ ఎస్కేప్ సిస్టమ్ యొక్క ఫ్లైట్ అబార్ట్‌ను విజయవంతంగా పరీక్షించగలిగింది. ఆ తర్వాత క్రూ మాడ్యూల్ వేరుపడటం, బంగాళాఖాతంలో ఇండియన్ నావికదళం దానిని సురక్షితంగా రికవర్ చేయడం కూడా జరిగాయి. మానవ రహిత మిషన్‌లూ, అంతిమంగా మానవ సహిత అంతరిక్ష మిషన్ 2025లో ప్రారంభించబడుతుందనీ అంచనా వేయడానికి ఈ టెస్ట్ ఫ్లైట్ విజయం కీలకమైనది.



ఇస్రో మరొక ముఖ్యమైన ప్రాజెక్ట్, భారతదేశపు తొలి సౌర అన్వేషణ మిషన్ అయిన ఆదిత్య ఎల్1. ఇది 'లాగ్రేంజ్ పాయింట్ 1' యొక్క ప్రత్యేకమైన వాన్టేజ్ పాయింట్ నుండి సూర్యుడిని అధ్యయనం చేస్తుంది. చంద్రునిపైనా సూర్యునిపైనా చేసే పరిశోధనల్లోనూ ఇది ఉపయోగపడుతుంది. వివిధ ఇస్రో కేంద్రాలు, విద్యా సంస్థల సహకారంతో దేశీయంగా అభివృద్ధి చేసిన ఏడు సైంటిఫిక్ పేలోడ్‌లతో నిండిన ఆదిత్య ఎల్1 అంతరిక్ష నౌక సూర్యుని రహస్యాలను ఛేదించడానికి ప్రయోగిస్తున్నాం. 2023 సెప్టెంబర్ 2న ప్రారంభించిన ఆదిత్య ఎల్1 ఐదేళ్ల పాటు పని చేస్తుందని భావిస్తున్నాం. ఇది భూమి నుండి సుమారు 1.5 మిలియన్ కి.మీ. దూరంలో ఉన్న సూర్యుడు–భూమి లాగ్రాంజ్ పాయింట్ 1 (ఎల్1) వైపు ఉద్దేశించిన మార్గంలో ఉంది. ఇక్కడే అది జనవరి 2024లో హాలో కక్ష్యలోకి చేర్చబడుతుంది.

చంద్రయాన్–3 మిషన్ ఒక చరిత్రాత్మక విజయం. ఆ విజయం సిద్ధించిన ఆగస్టు 23ను 'భారతదేశంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా ప్రకటించడం ముదావహం. 14 రోజుల (ఎర్త్ డేస్) మిషన్ జీవిత కాలంలో, ఇది చంద్రుని మట్టిలో అల్యూమినియం, కాల్షియం, ఐరన్, క్రోమియం, టైటానియం, సల్ఫర్, మేంగనీస్, సిలికాన్, ఆక్సిజన్‌లను కనుగొన్న విలువైన డేటాను అందించింది. మనం తలపెట్టిన చిన్న శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్‌వీ), పునర్వినియోగ ప్రయోగ వాహనం (ఆర్ఎల్‌వీ) ప్రోగ్రామ్, ఎక్స్–రే ఆస్ట్రానమీ మిషన్ 'ఎక్స్‌పోశాట్', స్పేస్ డాకింగ్ ప్రయోగం, ఎల్ఓఎక్స్–మీథేన్ ఇంజన్ వంటి పరివర్తనాత్మక కార్యక్రమాలు కలిసి, భారత్ అంతరిక్ష అన్వేషణలో కొత్త శకాన్ని నిర్వచించాయి.

మూడు దశల లాంచ్ వెహికల్ అయిన ఎస్ఎస్ఎల్‌వీ 500 కిలోల బరువున్న ఉపగ్రహాన్ని 500 కి.మీ. ప్లానార్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టగలదు. బహుళ ఉపగ్రహాలను తీసుకెళ్లగలదు. ఉపగ్రహాలను ఎప్పుడు ఎక్కడ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టాలనుకుంటే అప్పుడు ప్రవేశపెట్టగల (లాంచ్–ఆన్–డిమాండ్) సామర్థ్యం దీనికి ఉంది. దీన్ని ప్రయోగించడానికి కనీస మౌలిక సదుపాయాలు ఉంటే చాలు. అలాగే ప్రయోగించడానికి ఖర్చు కూడా తక్కువే!

ఎక్స్‌పోశాట్ అనేది భారత్ మొట్టమొదటి నిర్దిష్ట సైన్స్ మిషన్. ఇది శాస్త్రీయ పేలోడ్‌లను ఉపయోగించి తీవ్ర పరిస్థితుల్లోనూ ప్రకాశవంతమైన ఖగోళ ఎక్స్–రే మూలాలను పరిశోధిస్తుంది. అటువంటి దీనిని 2023–2024లో ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధమయింది. స్పాడెక్స్ (స్పేస్ డాకింగ్ ఎక్స్‌పరిమెంట్)ను 2024 మూడవ త్రైమాసికంలో ప్రారంభించాలనేది ప్రణాళిక. ఇది మానవ అంతరిక్షయానంలో అనువర్తనాల పరిధితో డాకింగ్, ఫార్మేషన్ ఫ్లయింగ్ టెక్నాలజీలను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన జంట అంతరిక్ష నౌక. ఈ మిషన్‌లో రెండు చిన్న–ఉపగ్రహాలు ఉంటాయి. ఒకటి ఛేజర్‌గా, మరొకటి టార్గెట్‌గా, సహ–ప్రయాణికులుగా కలిపి ప్రయోగించబడతాయి. 'భవిష్యత్తులో 'చంద్రయాన్' మిషన్‌లలో చంద్రుని నుంచి శాంపిల్స్ తీసుకువచ్చేందుకు మార్గం సుగమం చేయడంలో డాకింగ్ ప్రయోగ విజయం గణనీయమైన ప్రాముఖ్యతను కలిగి ఉంది.

రానున్న కాలంలో సాంకేతికత పరంగా అత్యంత ప్రాముఖ్యం కలిగిన 'ఎల్ఓఎక్స్ మీథేన్' (లిక్విడ్ ఆక్సిజన్ ఆక్సిడైజర్, మీథేన్ ఇంధనం) ఇంజిన్‌ల అభివృద్ధి కూడా ముఖ్యమైనదే. ఇది అంగారక గ్రహం వంటి ఇతర గ్రహాలపై పర్యావరణాల ఉనికి కోసం మానవుడు చేసే అన్వేషణను సులభతరం చేస్తుంది. అంతరిక్షంలో నీరు, కార్బన్ డై ఆక్సైడ్ లను సంశ్లేషణ చేయడం ద్వారా తయారు చేయగలిగిన మీథేన్ అంతరిక్షంలో సుదూరం ప్రయాణించే నౌకలకు ఇంధనంగా ఉపయోగిస్తారని భావిస్తున్నారు. అందుకే ఎల్ఓఎక్స్ మిథేన్ ఇంజిన్‌ల అభివృద్ధి చాలా ప్రాముఖ్యం కలిగిందని చెప్పాలి.

2035 నాటికి 'భారతీయ అంతరిక్ష స్టేషన్' ప్రారంభించడం, వీనస్ ఆర్బిటర్ మిషన్, మార్స్ ల్యాండర్‌తో కూడిన అంతర్ గ్రహ అన్వేషణను ప్రారంభించడం వంటి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను ప్రధాన మంత్రి నిర్దేశించుకున్నారు. ఇవన్నీ ప్రపంచ అంతరిక్ష పరిశోధనా వేదికపై భారత్ ఉనికిని మరింత పటిష్ఠం చేస్తాయి. 'భారత్ అంతరిక్ష కార్యక్రమం రాబోయే సంవత్సరాల్లో కొత్త శిఖరాలను చేరుకోవడానికి సిద్ధంగా ఉంది. ప్రయోగించబడిన ప్రతి మిషన్, ప్రతి ఆవిష్కరణతో ఇస్రో ప్రపంచ వేదికపై తన స్థానాన్ని సగర్వంగా పునరుద్ఘాటిస్తుంది.

('మలయాళ మనోరమ'కు ఇస్రో చైర్మన్ సోమనాథ్ అందించిన కథనం ఆధారంగా)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.తదియ రా.1.04 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పూర్వాషాఢ ఉ.10.41 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** సా.6.19 నుండి 7.47 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.35 నుండి 9.23 వరకు, తదుపరి ప.12.17 నుండి 1.05 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.03 నుండి 7.34 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.26, **సూర్యాస్తమయం:** 5.24.

సూర్యా నాయక్ లాకప్‌డెత్‌పై విచారణ జరిపించాలి

- సత్యవతి రాథోడ్, బాల్క సుమన్, దాసోజు డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 10న నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన నేనావత్ సూర్యా నాయక్ లాకప్‌డెత్‌పై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్.. డీజీపీ రవిగుప్తాను కలిశారు. ఈ సందర్భంగా తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు రాసిన ఓ లేఖను వారు డీజీపీకి అందించారు. అనంతరం సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, అన్నదమ్ముల పంచాయితీలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి గిరిజనుడి మృతికి కారణం అయ్యారని ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, సీనియర్ అధికారి చేత దర్యాప్తు చేయించాలని కోరారు. ఇందులో అధికారపార్టీ నాయకుడి పాత్రపైనా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాల్క సుమన్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. సూర్య నాయక్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని దాసోజు శ్రవణ్ కోరారు. రాజకీయ కక్షలకు పోలీసులు పావులుగా మారుతున్నారని అన్నారు. కాగా, సూర్యా నాయక్ కేసులో దర్యాప్తు చేస్తామని డీజీపీ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

బంగారుపళ్లెంలో ఆర్థిక వనరులు అప్పగించాం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంచి పాలన అందించాలని మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. బంగారుపళ్లెంలో ఆర్థికవనరులు అప్పగించామని, ఈ విషయమై దేశంలోనే తెలంగాణ రెండోస్థానంలో నిలిచిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ అప్పుల రాష్ట్రం అని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతరమంత్రులు, కాంగ్రెస్ నాయకులు పదేపదే చెప్పడాన్ని తప్పుపడుతున్నామని వెల్లడించారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల ఆర్థిక వనరుల కన్నా తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. దేశంలోని 28 రాష్ట్రాల ఆర్థిక వనరుల వివరాలతో ఆర్‌బీఐ విశ్లేషణను విడుదల చేసిందని బోయినపల్లి గుర్తుచేశారు.

భూకబ్జా ఆరోపణల్లో నిజంలేదు: మల్లారెడ్డి



కంటోన్మెంట్: మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తనపై వచ్చిన భూకబ్జా ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. శామీర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైన నేపథ్యంలో గురువారం ఉదయం బోయిన్‌పల్లిలోని తన ఇంటి ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. కేశవరం పరిధిలోని భూమి క్రయవిక్రయాల్లో తనకు ప్రమేయం లేదన్నారు. మూడేళ్ల క్రితమే తనకు తెలిసిన వ్యక్తులు సంబంధిత భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో తనపై కేసు నమోదైనందున కోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు.

ఉపాధి కూలీలకు తాగునీటి గోస తప్పినట్టే

వారు పనిచేసే ప్రాంతాల్లో నీటి వసతి కల్పించాలంటూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్ : ఉపాధి హామీ కూలీలు పనిచేసే ప్రాంతాల్లో తాగునీటి వసతి కల్పిసూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పనిచేసే ప్రదేశాల్లో తాగునీరు అందించడం తప్పనిసరి కాగా, 2021 వరకు, సాధారణ రోజుల్లో కూలీకి రోజుకు రూ.2.5 చొప్పున, ఎండాకాలంలో రూ.5 చొప్పున మంచినీటి సదుపాయం కింద కూలీలకు వేతనంలో భాగంగా అందించేవారు. అయితే 2022 జనవరి నుంచి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన సాఫ్ట్‌వేర్ మారడంతో తాగునీటికి సంబంధించిన డబ్బులను వేతనంలో కలిపి ఇచ్చే కల్పించే పద్ధతిని నిలిపివేశారు. పనిప్రదేశాల్లో ఉపాధి కూలీలకు సురక్షితమైన తాగునీరు అందించే బాధ్యత గ్రామ పంచాయతీపై ఉంది. కూలీకి రోజుకు కనీసం 2 లీటర్ల నీరు అందించాలి. దీనికి సంబంధించిన చెల్లింపులు గ్రామపంచాయతీ ఎన్ఆర్ఈజీఎస్ ఖాతాలో జమ చేసేలాచూడాల్సిన బాధ్యత ఎంపీడీఓ/ ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీఓ) పై పెట్టారు.

రోడ్డు ప్రమాదంలో చిరుతపులి మృతి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని దగ్గి అటవీ ప్రాంత శివారులో గురువారంరాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో ఓ చిరుతపులి మృత్యువాతపడింది. ఎఫ్ఆర్‌వో రమేశ్, ఎఫ్ఎస్‌వో ముబాషిర్ అలీ, ఎఫ్‌బీవో పద్మ సంఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. 44వ నంబర్ జాతీయరహదారిని చిరుత దాటుతుండగా నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని అటవీ అధికారులు పేర్కొన్నారు.

విద్యుత్ శాఖలో భారీ మార్పులు!

- రిటైర్డ్ అధికారుల స్థానంలో ఐఏఎస్‌లకు సారథ్య బాధ్యతలు
- ఇంధన శాఖ కార్యదర్శిగా సయ్యద్ ముర్తుజా అలీ రిజ్వీ
- టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీగా ముషార్రఫ్ అలీ ఫారూఖీ
- టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీగా కర్నాటి వరుణ్‌రెడ్డి
- ట్రాన్స్‌కో జేఎండీగా సందీప్ కుమార్‌ఝా



ముర్తుజా రిజ్వీ



ఆమ్రపాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త సర్కారు విద్యుత్ శాఖలో భారీగా మార్పులు చేపట్టింది. ఆయా విద్యుత్ సంస్థల సారథ్య బాధ్యతల్లో ఉన్న రిటైర్డ్ విద్యుత్ శాఖ అధికారుల (నాన్ ఐఏఎస్)ను తొలగించి.. ఐఏఎస్ అధికారులకు ఆ బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ, పోస్టింగ్‌తోపాటు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, ఇన్‌చార్జి డైరెక్టర్ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీని ఇంధనశాఖ కార్యదర్శిగా నియమించారు. అంతేగాక రాష్ట్ర విద్యుత్ శాఖలో కీలకమైన తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సీఎండీగా ఆయనకే అదనపు బాధ్యతలు అప్పగించారు. ట్రాన్స్‌కో, జెన్‌కోలకు సీఎండీగా దాదాపు పదేళ్ల కొనసాగిన డి.ప్రభాకర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రాజీనామా చేశారు. దీంతో సర్కారు కొత్త సీఎండీని నియమించింది. ముర్తుజా రిజ్వీ 2013 జూలై 2 నుంచి 2014 జూలై 19 వరకు టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీగా వ్యవహరించారు. యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖల ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌కు వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. మరోవైపు కీలకమైన ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ)గా 2014 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ ఝాను ప్రభుత్వం నియమించింది. గత ఎనిమిదేళ్లుగా ఈ పోస్టులో కొనసాగిన సి.శ్రీనివాసరావుకు ఉద్వాసన పలికింది.

డిస్కంలకు యువ అధికారులు: రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు అధిపతులుగా యువ ఐఏఎస్ అధికారులను సర్కారు నియమించింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) సీఎండీగా వెయిటింగ్‌లో ఉన్న 2014 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ముషార్రఫ్ అలీ ఫారూఖీని.. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) సీఎండీగా వెయిటింగ్‌లో ఉన్న 2019 బ్యాచ్ ఐఏఎస్ అధికారి కర్నాటి వరుణ్‌రెడ్డిని నియమించింది. ఐటీ-ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ సంయుక్త కార్యదర్శిగా ఉన్న సందీప్‌కుమార్ ఝాను ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ)గా బదిలీ చేసింది. టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు తన పదవికి రాజీనామా చేయగా, టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి ఇప్పటివరకు పదవిలో కొనసాగారు. కాంగ్రెస్ ముఖ్య నేతలతో రఘుమారెడ్డికి మంచి సంబంధాలు ఉండటంతో ఆయనను కొనసాగించే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరిగింది. కానీ ఆయనను తప్పించారు. ఇక కేంద్ర డెప్యుటేషన్ నుంచి తిరిగొచ్చి వెయిటింగ్‌లో ఉన్న కాటా ఆమ్రపాలిని హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. వెయిటింగ్‌లో ఉన్న బి.గోపికి వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించింది.

త్వరలో కొత్త డైరెక్టర్లు కూడా..!

రాష్ట్ర విద్యుత్ సంస్థలకు కొత్త సీఎండీలను నియమించిన ప్రభుత్వం.. త్వరలో కొత్త డైరెక్టర్లను సైతం నియమించనున్నట్టు చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ట్రాన్స్‌కోలో నలుగురు, జెన్‌కోలో ఆరుగురు, టీఎస్ఎస్పీడీసీఎల్‌లో ఏడుగురు, టీఎస్ఎన్పీడీసీఎల్‌లో ఆరుగురు డైరెక్టర్లు పనిచేస్తున్నారు. వారిలో కొందరు ఉమ్మడి రాష్ట్రం నాటి నుంచి, మరికొందరు తెలంగాణ ఆవిర్భావం నాటి నుంచి డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. కొన్ని సంస్థల్లో నిర్దేశిత సంఖ్యకు మించి డైరెక్టర్లు ఉన్నారు. ఈ క్రమంలో దీర్ఘకాలం నుంచి పనిచేస్తున్న డైరెక్టర్ల స్థానంలో కొత్తవారిని నియమించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించినట్టు తెలిసింది.

ఐఏఎస్ అధికారులకు కొత్త బాధ్యతలు ఇలా..

అధికారి	ప్రస్తుత పోస్టింగ్	కొత్త పోస్టింగ్
సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ	కమిషనర్ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి	ఇంధన శాఖ కార్యదర్శి
శైలజా రామయ్యర్	యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి	వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
సందీప్‌కుమార్ ఝా	ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ	ట్రాన్స్‌కో జేఎండీ
డి.కృష్ణభాస్కర్	పరిశ్రమల శాఖ డైరెక్టర్	అదనంగా ఆర్థిక, ప్రణాళిక శాఖ జాయింట్ సెక్రటరీ, సీఎం ఓఎస్డీ
ముషార్రఫ్ అలీ ఫారూఖీ	వెయిటింగ్	టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ
కర్నాటి వరుణ్‌రెడ్డి	వెయిటింగ్	టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ
కాటా ఆమ్రపాలి	వెయిటింగ్	హెచ్ఎండీఏ జాయింట్‌మెట్రోపాలిటన్ కమిషనర్, మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ ఎండీగా అదనపు బాధ్యతలు
బి.గోపి	వెయిటింగ్	వ్యవసాయ శాఖ డైరెక్టర్

మంత్రి జూపల్లికి కళాకారుల సత్కారం

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును తెలంగాణ పెర్ఫార్మింగ్ ఆర్టిస్టులు గురువారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జూపల్లికి అభినందనలు తెలిపారు. అనంతరం ఇంటర్నేషనల్ మెజీషియన్, మెజీషియన్స్ అకాడమీ అధ్యక్షుడు సామల వేణు, మిమిక్రీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రముఖి చంద్రశేఖర్, మహేష్ రేగుల మంత్రిని సత్కరించారు.

'మీ గేమ్ ముగిసింది.. మా గేమ్ మొదలైంది'

సాక్షి, హైదరాబాద్: అసలు గేమ్ ఇప్పుడే మొదలైందని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ కౌంటర్ ఇచ్చారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ 'కేటీఆర్.. మీ గేమ్ ముగిసింది. మా గేమ్ మొదలైందని గుర్తుంచుకోండి. మీరు ఇలాగే మాట్లాడితే భవిష్యత్తు మరింత అంధకారమవుతుంది' అని అన్నారు. మెట్రో రైలును పాత బస్తీకి విస్తరించాలన్న సీఎం రేవంత్ నిర్ణయాన్ని కాంగ్రెస్ స్వాగతిస్తోందన్నారు.

రిమ్స్ వైద్య విద్యార్థులపై దాడి

- మెడికోల ఆందోళన... విధులు బహిష్కరించిన జూడాలు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్



అసిస్టెంట్ ప్రొఫెసర్, నిందితుల దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న వైద్య విద్యార్థులు

ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ రిమ్స్ వైద్య విద్యార్థులపై బుధవారం అర్ధరాత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ క్రాంతికుమార్ బయటి వ్యక్తులతో కలిసి దాడికి పాల్పడిన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. ఘటనలో ఇద్దరు వైద్య విద్యార్థులు గాయాలపాలయ్యారు. డైరెక్టర్ చాంబర్ ముందు నుంచి బుధవారం సాయంత్రం కవిరాజ్, మరో ముగ్గురు విద్యార్థులు అతి వేగంగా కారులో వెళ్లారు. దీంతో డైరెక్టర్ జైసింగ్ వారిని మందలించగా, విద్యార్థులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. అనంతరం జైసింగ్ అభిమానులమంటూ కొందరు సదరు విద్యార్థులపై దాడికి పాల్పడ్డారు. దీంతో దాడికి పాల్పడిన వారిని శిక్షించాలంటూ గురువారం మెడికోలు తరగతులకు వెళ్లకుండా, ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. దీంతో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఘటనపై విచారణకు ఆదేశించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఘటనకు బాధ్యుడైన రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్‌ను టర్మినేట్ చేస్తున్నట్లు ప్రకటించారు. మెడికోలకు మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మద్దతు తెలిపారు. వైద్య విద్యార్థులపై దాడికి దిగిన అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్‌తో పాటు బయట వ్యక్తులైన వసీమ్, శివ, వెంకటేశ్, శ్రీకాంత్‌పై కేసు నమోదుచేసి, రిమాండ్‌కు తరలించనున్నట్లు ఆదిలాబాద్ టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. విద్యార్థుల ఫిర్యాదుతో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌పై కూడా కేసు నమోదైంది.

'ఎస్సీ వర్గీకరణ సాధనకు 21న చలో ఢిల్లీ'

ముషీరాబాద్ (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణ సాధనకోసం ఈ నెల 21న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ తెలంగాణ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. బీజేపీ సర్కార్ మెడలు వంచి.. ఎస్సీ వర్గీకరణను సాధించే దిశగా మాదిగలంతా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్దకు లక్షలాదిగా తరలివచ్చి మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ, మాదిగ ఉపకులాలను కోరారు. వర్గీకరణ చేస్తామని మాట తప్పిన మోదీ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. గతంలో లోకూర్ కమిషన్, రామచంద్ర కమిషన్, ఉషామెహ్రా కమిషన్ స్పష్టంగా ఎస్సీ వర్గీకరణ అంశంపై నివేదికలు ఇచ్చినప్పటికి వాటిని పరిగణనలోకి తీసుకోకుండా బీజేపీ సర్కార్ మాదిగలను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి ప్రధాని మోదీ.. తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆయకట్టు ఎకరా పెరగలేదు

- రీఇంజనీరింగ్‌తో ప్రాజెక్టుల వ్యయం మాత్రమే పెరిగింది
- నల్లగొండ, ఖమ్మం జిల్లాల ప్రాజెక్టులపై సమీక్షలో డిప్యూటీ సీఎం, మంత్రులు



సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో రాజగోపాలరెడ్డి, వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని రాష్ట్ర మంత్రులు ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల రీఇంజనీరింగ్ వల్ల ఎకరా ఆయకట్టు అదనంగా పెరగలేదని, కేవలం వ్యయం మాత్రమే పెరిగిందని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాంబర్‌లో గురువారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల సాగునీటి ప్రాజెక్టులపై ఇరిగేషన్ అధికారులతో భట్టి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

సీతారామకు పర్యావరణ అనుమతులు రావాలి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.2,400 కోట్లతో చేపట్టిన ఇందిరా, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టుల అంచనా వ్యయాన్ని రీ డిజైనింగ్ పేరిట రూ.13 వేల కోట్లకు ఎందుకు పెంచాల్సి వచ్చిందని భట్టి విక్రమార్క అధికారులను ప్రశ్నించారు. అదనంగా ఆయకట్టు పెరిగిందా? అని ప్రశ్నించగా, పెరగలేదని అధికారులు బదులిచ్చారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఇందిరా సాగర్ ప్రాజెక్టును రీ డిజైనింగ్ చేశామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణానికి ఇంకా పర్యావరణ అనుమతులు రావాల్సి ఉందని, రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

ప్రాజెక్టులపై నివేదికలు ఇవ్వండి

గత ప్రభుత్వం రూ.వేల కోట్లతో కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడంతో ప్రజలపై భారం పడిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. ఆరు నెలల్లో పూర్తయ్యే ప్రాజెక్టులు, ఏడాదిలోగా పూర్తయ్యేవి, 18 నెలల్లోగా పూర్తయ్యేవి, 24 నెలల్లో పూర్తయ్యే ప్రాజెక్టులు గుర్తించి, వాటి కావాల్సిన బడ్జెట్ అంచనా వ్యయాన్ని రూపొందించి వెంటనే నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఇరిగేషన్ శాఖలో ఎన్నికలకు ముందు పిలిచిన టెండర్లను వెంటనే నిలిపివేయాలని, వర్క్ అలాట్‌మెంట్ చేసిన వాటిని కూడా ఆపి వేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వం రీడిజైనింగ్ చేసిన సీతారామ ప్రాజెక్టు విషయంలో వెనక్కి పోలేము, ముందుకు పోలేమన్నట్టుగా ఉందని ఉత్తమ్ అన్నారు. బ్యారేజీ హెడ్ వర్క్ నుంచి చివరి కెనాల్ వరకు ఫేజ్‌ల వారీగా జరిగిన పనుల గురించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరా తీశారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

గత ప్రభుత్వ హయాంలో నల్లగొండ జిల్లా రైతులకు సాగునీటిని అందించేందుకు కనీస ప్రయత్నం కూడా జరగలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు, ఉదయ సముద్రం ప్రాజెక్టు ఎందుకు పూర్తి కాలేదని ఈఎన్‌సీ మురళీధర్‌ను ప్రశ్నించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, సింగరాజుపల్లి రిజర్వాయర్, పాకాల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, గొట్టిముక్కల రిజర్వాయర్, పిల్లాయిపల్లి కెనాల్, నెల్లికల్ లిఫ్ట్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయని అన్నారు. నల్లగొండ జిల్లా ప్రాజెక్టుల పూర్తికి కావాల్సిన అనుమతులు, నిధులు తీసుకొస్తానని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సస్యశ్యామలం కావాలంటే గత ప్రభుత్వం మొదలుపెట్టిన ప్రాజెక్టుల పనులు ఆపకుండా త్వరగా పూర్తి చేయాలని గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

ఎన్నికల ఫలితాలపై నేడు బీజేపీ సమీక్ష

- హాజరుకానున్న జాతీయ ప్రధానకార్యదర్శి తరుణ్‌చుగ్
- పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారుల ఎంపిక కసరత్తుపైనా చర్చ



సాక్షి, హైదరాబాద్: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షకు బీజేపీ సిద్ధమైంది. ఇందుకోసం శుక్రవారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జీలు, పార్లమెంట్ ప్రభారీల సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ భేటీకి ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జీ తరుణ్ ఛుగ్, పార్టీ పార్లమెంటరీ బోర్డుసభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఇతర నేతలు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఫలితాలపై సమీక్షతోపాటు లోక్‌సభ ఎన్నికలకు దిశానిర్దేశం తదితర అంశాలు చర్చకు రానున్నట్టు సమాచారం. మధ్యాహ్నం విడిగా నిర్వహించే మరో సమావేశంలో పీఎం విశ్వకర్మ యోజనపై ప్రచారం, లబ్ధిదారుల ఎంపిక కార్యాచరణపై చర్చించనున్నారు. ఈ భేటీలో కూడా కిషన్‌రెడ్డి, తరుణ్ ఛుగ్, లక్ష్మణ్ పాల్గొననున్నారు. ఈ నెల 16 నుంచి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' రాష్ట్రంలో ప్రారంభం కానున్నందున కార్యాచరణపైనా పార్టీ నేతలు చర్చించనున్నట్టు తెలిసింది.

రాష్ట్రంలో బీజేఎల్పీనేత ఎవరు?

సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ శాసనసభాపక్షనేత పదవి కోసం ఎమ్మెల్యేల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. బీజేఎల్పీనేత అయ్యేందుకు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన టి.రాజాసింగ్, రెండోసారి గెలిచిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడించి జైంట్ కిల్లర్‌గా నిలిచిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి పోటీపడుతున్నట్టు సమాచారం. అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో గురువారం సభలో బీజేపీ నుంచి గెలుపొందిన ఎనిమిది మంది సభ్యులు ప్రమాణం చేశారు. కాగా, శుక్రవారం అసెంబ్లీ సమావేశాల ఎజెండాపై స్పీకర్ వద్ద నిర్వహించనున్న బీఏసీ సమావేశానికి బీజేపీ ప్రతినిధిగా ఎవరిని పంపిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో బీజేఎల్పీ నేత అంశం చర్చనీయాంశమైంది. బీజేఎల్పీనేత ఎన్నిక విషయంలో ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం కుదరని పక్షంలో జాతీయ నాయకత్వానికి నిర్ణయాధికారాన్ని అప్పగిస్తుంటారు. ఇదిలా ఉండగా ఇటీవల మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచి అధికారంలోకి రావడంతో మూడుచోట్లా కొత్తవారికి సీఎంలుగా అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఇదే పంథాలో తెలంగాణలోనూ కొత్త ఎమ్మెల్యేగా.. అదీగాకుండా జైంట్ కిల్లర్‌గా నిలిచి సంచలనం సృష్టించిన నాయకుడికి అవకాశం ఇస్తారా? లేక మూడుసార్లు గెలిచిన నాయకుడికి బీజేఎల్పీనేతగా అవకాశం కల్పిస్తారా అన్న దానిపై పార్టీలో చర్చ సాగుతోంది.

ఆరు గ్యారంటీలను అమలు చేసేదాకా యుద్ధం

- బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రాజాసింగ్, పాయల్ శంకర్

సాక్షి,హైదరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేవరకు యుద్ధం చేస్తామని, ప్రజల పక్షాన బీజేపీ పోరాడుతుందని ఆ పార్టీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రాజాసింగ్, పాయల్ శంకర్ అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు.

సభలో గందరగోళం..!

భద్రతా వైఫల్యంపై ఆందోళనలు, నినాదాలతో దద్దరిల్లిన ఉభయ సభలు

- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలి
- లోక్‌సభ, రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యుల డిమాండ్
- లోక్‌సభ నుంచి 13 మంది, రాజ్యసభ నుంచి ఒక విపక్ష ఎంపీ సస్పెన్షన్
- శీతాకాల సమావేశాల్లో మిగిలిన సెషన్ మొత్తం సభకు రావొద్దని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై గురువారం ఉభయ సభలు అట్టుడికిపోయాయి. ప్రతిపక్ష సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. బుధవారం జరిగిన అవాంఛనీయ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ, రాజ్యసభలో తీవ్ర అలజడి సృష్టించారు. వెల్‌లోకి దూసుకొచ్చి బిగ్గరగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని పట్టుబట్టారు. అరుపులు, కేకలతో లోక్‌సభ, రాజ్యసభ హోరెత్తిపోయాయి. తీవ్ర గందరగోళం నెలకొంది. ఉభయ సభలను పలుమార్లు వాయిదా వేసినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో లోక్‌సభ నుంచి 13 మంది విపక్ష ఎంపీలపై, రాజ్యసభలో ఒక ప్రతిపక్ష ఎంపీపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో మిగిలిన సెషన్ మొత్తం వారు సభకు హాజరు కాకూడదని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ స్పష్టం చేశారు.

లోక్‌సభలో నినాదాల హోరు

లోక్‌సభ గురువారం ఉదయం ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోకి దూసుకొచ్చారు. వెనక్కి వెళ్లాలని స్పీకర్ పదేపదే కోరినా వారు వినిపించుకోలేదు. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ చెప్పారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా విపక్ష ఎంపీలు శాంతించలేదు. దీంతో సభా కార్యకలాపాలకు అడ్డు తగులుతున్న ఐదుగురు విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. టీఎన్ ప్రతాపన్, హిబీ ఈడెన్, జోతీమణి, రమ్య హరిదాస్, డీన్ కురియాకోస్‌పై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. అనంతరం సభ మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా పడింది. సభ మళ్లీ ప్రారంభమయ్యాక కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. దాంతో ప్రహ్లాద్ జోషీ మరో తీర్మానం ప్రవేశపెట్టారు. 9 మంది విపక్ష సభ్యులను సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరారు. వీకే శ్రీకందన్, బెన్నీ బెహనన్, మొహమ్మద్ జావెద్, పీఆర్ నటరాజన్, కనిమొళి, కె.సుబ్బరాయన్, ఎస్ఆర్ పార్తీబన్, ఎస్.వెంకటేశన్, మాణిక్యం ఠాగూర్‌ను సభ నుంచి స్పీకర్ సస్పెండ్ చేశారు. సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంట్ ప్రాంగణంలో భద్రతను పర్యవేక్షించే బాధ్యత లోక్‌సభ సెక్రెటేరియట్‌దేనని స్పీకర్ ఓంబిర్లా చెప్పారు. సభ వాయిదా పడిన తర్వాత పలువురు విపక్ష సభ్యులు సభలోనే ఉండి ఆందోళన కొనసాగించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


సస్పెండ్ అయ్యాక బయటికొస్తున్న విపక్ష సభ్యులు

ఎగువ సభలో తీవ్ర అలజడి


పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళనకు దిగాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశాయి. ఈ రోజు మిగతా కార్యకలాపాలను పక్కనపెట్టి, కేవలం భద్రతా వైఫల్యంపైనే సభలో చర్చ చేపట్టాలని పలువురు ఎంపీలు గురువారం ఉదయం 28 నోటీసులు ఇచ్చారు. వీటిని తిరస్కరిస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తేల్చిచెప్పారు. సభకు సహకరించాలని కోరారు. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి ప్రవేశించి, నినాదాలు చేస్తుండడంతో సభ పలుమార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితి అదుపులోకి రాలేదు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ చైర్మన్ వేదిక ముందుకు చేరుకొని, గాల్లోకి చేతులు విసురుతూ గట్టిగా అరిచారు. ఆయన తీరుపై చైర్మన్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను ధిక్కరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. డెరెక్ ఓబ్రెయిన్‌ను సభ నుంచి సస్పెండ్ చేయడానికి రూల్ 256 కింద తీర్మానం ప్రవేశపెట్టడానికి బీజేపీ పక్షనేత పీయూష్ గోయల్‌కు అనుమతి ఇచ్చారు. పీయూష్ గోయల్ తీర్మానం ప్రవేశపెట్టడం, మూజువాణి ఓటుతో ఆమోదం పొందడం, డెరెక్ ఓబ్రెయిన్‌పై సస్పెన్షన్ వేటు వేయడం వెంటనే జరిగిపోయాయి. ఆయనను ఈ సెషన్‌లో మిగిలిన కాలమంతా సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ వెల్లడించారు. సస్పెండ్ అయినప్పటికీ బయటకు వెళ్లకుండా సభలోనే కూర్చున్న డెరెక్ ఓబ్రెయిన్‌పై ధన్‌ఖడ్ అసహనం వ్యక్తం చేశారు. నియమ నిబంధనలు పాటించాలని హితవు పలికారు. అయినా ఓబ్రెయిన్ వినిపించుకోలేదు. రాజ్యసభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ధన్‌ఖడ్ చెప్పారు. ఇదిలా ఉండగా, సభ నుంచి సస్పెండ్‌చేసినా బయటకు వెళ్లకుండా నిబంధనలను ఉల్లంఘించిన డెరెక్ ఓబ్రెయిన్ తీరుపై విచారణ జరపాలని సభా హక్కుల కమిటీకి జగదీప్ ధన్‌ఖడ్ సిఫార్సు చేశారు.

నిరసన తెలుపుతున్న డెరెక్ ఓబ్రెయిన్


ప్రజాస్వామ్యాన్ని సస్పెండ్ చేశారు: కాంగ్రెస్

పార్లమెంట్ ఉభయ సభల నుంచి గురువారం మొత్తం 14 మంది ఎంపీలను సస్పెండ్‌చేయడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విపక్ష ఎంపీలను కాదు, దేశ ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై ప్రభుత్వం నుంచి సమాధానం కోరినందుకు ప్రతిపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్‌చేయడం అప్రజాస్వామికం, భయానక చర్య అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం హత్య చేసిందని, పార్లమెంట్‌ను రబ్బర్ స్టాంప్ స్థాయికి దిగజార్చిందని దుయ్యబట్టారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆగంతకులు పార్లమెంట్‌లోకి ప్రవేశించేందుకు కారణమైన బీజేపీ ఎంపీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు.

సభలో లేకున్నా సస్పెన్షన్



లోక్‌సభలో రెండో విడతలో సస్పెండైన విపక్ష ఎంపీల్లో తమిళనాడుకు చెందిన ఎస్ఆర్ పార్తీబన్ పేరు కూడా ఉంది. వాస్తవానికి ఆయన గురువారం సభకు రాలేదని, చెన్నైలో ఉన్నారని ప్రతిపక్ష సభ్యులు చెప్పారు. సభలో లేని ఎంపీని సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ స్పందించారు. పొరపాటు జరిగిందని అంగీకరించారు. ఆయన పేరును తొలగిస్తున్నట్లు చెప్పారు. పార్తీబన్‌పై సస్పెన్షన్ వేటును స్పీకర్ ఉపసంహరించినట్లు తెలిపారు. గురువారం లోక్‌సభ నుంచి మొత్తం 13 మందిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. బుధవారం నాటి ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తామన్నారు.



కాఫీకి చైనా జై

అమెరికా కంటే చైనాలోనే అత్యధిక కాఫీ ఔట్‌లెట్లు | 'వరల్డ్ కాఫీ పోర్టల్' సర్వేలో వెల్లడి

తేనీరు... ప్రపంచంలో ఈ పానీయం గురించి తెలియనివారు ఉండరు. తేనీరు డ్రాగన్ దేశం చైనాలో పుట్టిందన్న వాదన కూడా ఉంది. ఈ ఉష్ణోదకం సేవించడంలో చైనీయులు ముందంజలో ఉంటారు. కానీ, ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. చైనా ప్రజలు ఇప్పుడు కాఫీపై మక్కువ పెంచుకుంటున్నారు. సాక్షాత్తూ 'వరల్డ్ కాఫీ పోర్టల్' నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం బహిర్గతమైంది. బ్రాండెడ్ కాఫీ షాప్ మార్కెట్ విషయంలో అమెరికాను చైనా మించిపోయిందని 'వరల్డ్ కాఫీ పోర్టల్' వెల్లడించింది. అమెరికాలో కంటే చైనాలోనే అత్యధిక కాఫీ ఔట్‌లెట్లు ఉన్నాయని తెలియజేసింది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తున్న చైనాలో కాఫీ ప్రేమికుల పెరిగిపోతోందని, కేవలం గత 12 నెలల వ్యవధిలోనే కాఫీ ఔట్‌లెట్ల సంఖ్య 58 శాతం పెరిగిందని పేర్కొంది. ప్రసుతం చైనాలో 49,691 బ్రాండెడ్ కాఫీ దుకాణాలు ఉన్నాయని వివరించింది.

- ప్రఖ్యాత స్టార్‌బక్స్ సంస్థ గత ఏడాది వ్యవధిలో చైనాలో కొత్తగా 785 కాఫీ దుకాణాలు తెరిచింది. చైనాలో రూ.1,660 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టింది. అమెరికా బయట స్టార్‌బక్స్ ఈ స్థాయిలో పెట్టుబడులు పెట్టడం ఇదే మొదటిసారి. ప్రపంచవ్యాప్తంగా తమకు రెండో అతిపెద్ద మార్కెట్ చైనాయేనని స్టార్‌బక్స్ స్పష్టం చేసింది.
- చైనాలో కాఫీలను విక్రయించడంలో స్టార్టప్ కంపెనీ 'లకిన్ కాఫీ'దే పైచేయి. ఈ సంస్థకు దేశంలో 13,000కుపైగా ఔట్‌లెట్లు ఉన్నాయి.
- సర్వేలో భాగంగా 4,000 మంది కాఫీ ప్రియులను ప్రశ్నించారు. వీరిలో 90 శాతం మంది వారానికోసారి హాట్ కాఫీ తాగుతామని చెప్పారు. వారానికి ఒక్కసారైనా ఐస్డ్ కాఫీ తీసుకుంటామని 64 శాతం మంది తెలిపారు.
- ప్రతివారం కాఫీ షాప్‌నకు వెళ్తాం లేదా ఆర్డర్ చేసి తెప్పించుకుంటామని 90 శాతం మంది వెల్లడించారు.
- చైనాలో ఇటీవలికాలంలో ఆర్థిక ప్రగతి కొంత నెమ్మదించింది. అయినప్పటికీ ప్రపంచ కాఫీ పరిశ్రమగా చైనా ఎదుగుతుండడం విశేషం.
- చైనాలో తమ కంపెనీ ప్రస్థానం ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని స్టార్‌బక్స్ సీఈఓ లక్ష్మణ్ నరసింహన్ చెప్పారు. 2025 నాటికి చైనాలో 9,000 కాఫీ దుకాణాలు ప్రారంభించాలని స్టార్‌బక్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

నెలసరి లీవ్ అవసరం లేదు

అది వైకల్యం కాదు • స్మృతి ఇరానీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు నెలసరి రోజుకు వేతనంతో కూడిన సెలవుదినంగా కొన్ని దేశాల్లో పాటిస్తున్నారు. భారత్‌లోనూ మహిళా ఉద్యోగులకు నెలసరికి పెయిడ్ లీవ్ ఇవ్వాలన్న డిమాండ్ పెరిగిన నేపథ్యంలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మహిళా మంత్రి స్మృతి ఇరానీ ఒక స్పష్టతనిచ్చారు. జనతాదళ్(యూ) సభ్యుడు మనోజ్ కుమార్ ఝా రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా స్మృతి వివరణ ఇచ్చారు. ''నెలసరి అనేది మహిళల జీవితంలో ఒక సహజ ప్రక్రియ. అదేం వైకల్యం కాదు. దీనికి ప్రత్యేకంగా వేతనంతో కూడిన సెలవు దినం ప్రకటించాల్సిన అవసరం లేదు. నెలసరిని ప్రత్యేక సెలవు ఇవ్వాల్సిన సందర్భంగా పరిగణించకూడదు. నెలసరిని ఒక ఆటంకంగా కూడా భావించకూడదు. ఒకవేళ ఉద్యోగినులకు ఒక పెయిడ్ లీవ్ ఇస్తే తోటి పురుషులు తమకు ఒక సెలవు లభించలేదే అని భావించి పని ప్రదేశాల్లో వివక్షపూరిత వాతావరణం నెలకొనే ప్రమాదం ఉంది'' అని ఇరానీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా నెలసరి శుభ్రత విధాన ముసాయిదాను కేంద్రం తీసుకొచ్చిందని ఆమె గుర్తుచేశారు. 10–19 ఏళ్ల టీనేజర్లలో నెలసరి శుభ్రతపై అవగాహన పెంచేందుకు కేంద్రం ఇప్పటికే ప్రత్యేక పథకాన్ని అమలుచేస్తోందని ఆమె వెల్లడించారు. మరోవైపు, ''నెలసరి రోజుల్లో చాలా మంది ఉద్యోగినులు ఇబ్బందులు పడుతూ అది పని ప్రదేశాల్లో ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. వీరికి నెలసరి సెలవు లేదా సిక్ లీవ్ లేదా నెలకో సంవత్సరానికో సగం వేతనంతో కూడిన సెలవు ఇవ్వొచ్చు'' అని సిబ్బంది, శిక్షణ వ్యవహారాలు, న్యాయ, సాధికారత వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఒక నివేదికలో పేర్కొనడం గమనార్హం.

బోయిమ్, అవ్వాద్‌లకు ఇందిరా గాంధీ శాంతి బహుమతి

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్–పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం కనుగొనడంలో కృషి సాగిస్తున్న డేనియల్ బరెన్‌బోయిమ్, అలీ అబు అవ్వాద్‌లకు 2023 సంవత్సరం ఇందిరా గాంధీ శాంతి బహుమతిని ప్రకటించారు. అర్జెంటీనాలో జన్మించిన సంగీత కళాకారుడు బరెన్‌బోయిమ్, పాలస్తీనాకు చెందిన ప్రముఖ ఉద్యమకారుడు. వీరిద్దరికీ కలిపి సంయుక్తంగా ఇందిరాగాంధీ శాంతి, నిరాయుధీకరణ, సామాజికాభివృద్ధి బహుమతిని ప్రదానం చేసినట్లు కమిటీ జ్యూరీ చైర్మన్ మాజీ ప్రధాన న్యాయమూర్తి టీఎస్ ఠాకూర్ చెప్పారు. వీరిద్దరూ మధ్యప్రాచ్యంలో దశాబ్దాలుగా నలుగుతున్న సమస్యకు శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు కృషి సాగిస్తున్నారని ఇందిరా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ ప్రశంసించింది.

మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోయిస్టులు మృతి

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్ మావోయిస్టు సీనియర్ నేత సహా ఇద్దరు నక్సల్స్ చనిపోయారు. ఛత్తీస్‌గఢ్– మహారాష్ట్ర సరిహద్దుల్లోని బోధింటోలా ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ సమయంలో మావోయిస్టులు వారిపైకి కాల్పులకు దిగారు. ఎదురుకాల్పుల్లో కసన్‌సూర్ దళం డిప్యూటీ కమాండర్ దుర్గేశ్ వట్టి, మరో గుర్తు తెలియని మావోయిస్టు చనిపోయారు.

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన మందు పాతర.. నేలకొరిగిన బీఎస్ఎఫ్ జవాన్

కాంకేర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి ఒక బీఎస్ఎఫ్ జవాను వీర మరణం పొందారు. పర్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సడక్‌టోలా గ్రామ సమీపంలో కూంబింగ్ జరుపుతుండగా గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. పేలుడులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అఖిలేశ్ రాయ్(45) చనిపోయారని అధికారులు తెలిపారు. ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతంలో గాలింపు ముమ్మరం చేశారు.

వెనెజులాలో ట్రక్కు బీభత్సం.. 16 మంది మృతి

కారకాస్: వెనెజులా రాజధాని కారకాస్‌ను కలిపే జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ట్రక్కు పలు కార్లను ఢీకొట్టుకుంటూ ముందుకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో 17 వాహనాలు ఒకదానొకటి ఢీకొట్టి కుప్పగా రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. మంటల్లో చిక్కుకున్న వాహనాలు, ఉవ్వెత్తున ఎగసిన పొగతో కూడిన ఫొటోలు బుధవారం ఉదయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఘటనలో 16 మంది చనిపోగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా మారడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

జూలైలోనే పక్కాగా రెక్కీ

- పార్లమెంట్‌లో చొరబడిన ఆగంతకుల పకడ్బందీ ప్రణాళిక
- షూలను తనిఖీ చేయట్లేదని రెక్కీలో కనుగొన్న వైనం
- పొగ గొట్టాలు దాచేలా లక్నోలో ప్రత్యేక షూ తయారీ


నిందితులు నీలం, సాగర్, షిండేలను గురువారం కోర్టుకు తీసుకొస్తున్న దృశ్యం

న్యూఢిల్లీ: అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే పార్లమెంటులో పొగగొట్టాలతో కలకలం రేపిన నిందితులు ఇందుకు కొద్ది నెలల క్రితమే పక్కా ప్రణాళిక రచించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పార్లమెంట్‌లోకి పొగగొట్టాలను ఎలా దాచి తీసుకెళ్లాలన్న దానిపై రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్‌కు వచ్చిన వారి షూలను తనిఖీ చేయట్లేరనే విషయాన్ని 'రెక్కీ' సందర్భంగా వీరు కనుగొన్నారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. నిందితుల్లో ఒకరైన మనోరంజన్ జులైలోనే ఈ మేరకు ఒకసారి సందర్శకుల పాస్‌తో లోపలికి వచ్చి రెక్కీ నిర్వహించాడని తెల్సింది. షూలు విప్పి తనిఖీలు చేయట్లేరనే విషయం గమనించి పొగ గొట్టాలను షూలో దాచి తెచ్చారు. ఇందుకోసం ప్రత్యేకంగా లక్నోలో షూలను తయారుచేయించారట. మరోవైపు పార్లమెంట్‌లో 'పొగ' ఘటనకు కీలక సూత్రధారిగా భావిస్తున్న లలిత్ ఝాను గురువారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనలో పాల్గొన్న మరో నలుగురిపాటు వారికి ఆశ్రయం కల్పించిన మరో వ్యక్తినీ అరెస్ట్‌చేశారు. లోక్‌సభ లోపల, వెలుపల పొగ గొట్టాలను విసిరిన నలుగురిపై కఠినమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)సహా పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ నలుగురికీ ప్రత్యేక కోర్టు ఏడు రోజుల రిమాండ్‌కు పంపించింది. ఘటనకు కీలక సూత్రధారిగా భావిస్తున్న లలిత్ ఝా వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. కోల్‌కతాకు చెందిన ఇతడు విప్లవ యోధుడు భగత్ సింగ్ వీరాభిమాని. లలిత్, సాగర్, మనోరంజన్ ఏడాది క్రితం మైసూర్‌లో కలిశారు. అప్పుడే పార్లమెంట్ లోపలికి చొరబడేందుకు ప్రణాళిక రచించారు. వీరికి తర్వాత నీలమ్ దేవి, అమోల్ షిండే తోడయ్యారు. ఫేస్‌బుక్‌లో భగత్‌సింగ్ ఫ్యాన్స్ క్లబ్ పేరుతో సృష్టించిన పేజీలో వీరంతా ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపేవారు. లలిత్ వీరిని ముందుండి నడిపాడు. ప్రణాళిక ప్రకారమే వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ అన్ని ప్రవేశ ద్వారాల వద్ద మనోరంజన్ రెక్కీ నిర్వహించాడు. జూలైలో సందర్శకుల పాస్‌తో పార్లమెంట్ ప్రాంగణంలోకి వచ్చాడు. భద్రతా సిబ్బంది సందర్శకుల షూలను విప్పి తనిఖీ చేయడం లేదని విషయం గమనించాడు. ఆ మేరకు ప్రణాళిక సిద్ధమైంది. మంగళవారం రాత్రి గురుగ్రామ్‌లోని విశాల్ శర్మ అలియాస్ వికీ ఇంట్లో సాగర్, మనోరంజన్, అమోల్, నీలం, లలిత్‌లు బస చేశారు. ఉదయం అందరూ కలిసి పార్లమెంట్ వద్దకు చేరుకున్నారు. వీరి సెల్‌ఫోన్లను లలిత్ తన వద్దే ఉంచుకున్నాడు. పాస్‌లు ఇద్దరికి మాత్రమే రావడంతో మిగతా ముగ్గురు బయటే ఉండిపోయారు. అమోల్, నీలమ్‌లు పార్లమెంట్ ఆవరణలో పొగ గొట్టాలు విసురుతుండగా లలిత్ వీడియో చిత్రీకరించాడు. అనంతరం ఈ వీడియోను అతడు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. నిందితులిచ్చిన సమాచారం ఆధారంగా కోల్‌కతాకు చెందిన ఒక ఎన్జీవో నిర్వాహకుడు నీలాక్ష్ అయిష్‌తో స్పెషల్ సెల్ పోలీసులు మాట్లాడారు. ఈ ఎన్జీవోతోనే లలిత్ ఝాకు సంబంధాలున్నట్లు భావిస్తున్నారు. దర్యాప్తు వేగవంతం చేసిన అధికారులు గురువారం రాత్రి లలిత్ ఝాను అదుపులోకి తీసుకున్నారు. ఇతడి ద్వారానే పార్లమెంట్ ఘటన వెనుక నిజాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

వారం రోజుల రిమాండ్

పార్లమెంట్ భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన కేసులో పట్టుబడిన నలుగురిపై ఉపా చట్టంతోపాటు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. గురువారం మనోరంజన్, సాగర్, అమోల్, నీలమ్‌లను 'పటియాలా' కోర్టుకు తీసుకొచ్చి ఎన్ఐఏ కేసులను విచారించే జడ్జి ఎదుట హాజరుపరిచారు. జడ్జి ఏడు రోజుల రిమాండ్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఒకే రకమైన సమాధానాలు

సాగర్ శర్మ(26), మనోరంజన్(34), అమోల్ షిండే(25), నీలమ్ దేవి(37)లకు రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో వైద్యుల బృందంతో పోలీసులు మెడికల్ పరీక్షలు చేయించారు. అనంతరం వీరిని చాణక్యపురిలోని డిప్లొమాటిక్ సెక్యూరిటీ ఫోర్స్(డీఎస్ఎఫ్) కార్యాలయానికి తీసుకొచ్చి విచారణ జరిపారు. ముందుగా, నీలమ్, అమోల్‌లను పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్‌కు, తర్వాత డీఎస్ఎఫ్ కార్యాలయానికి తరలించారు. విచారణలో వీరు రెండు సంస్థల పేరు వెల్లడించారు. నిందితులు చెబుతున్న సమాధానాలన్నీ ఒకే రకంగా ఉండటాన్ని బట్టి చూస్తే, ముందుగానే ప్రిపేర్ అయినట్లుగా తెలుస్తోందని అధికారులు చెబుతున్నారు. 'దేశంలో రైతుల ఆందోళనలు, మణిపూర్‌లో హింస, నిరుద్యోగం వంటి సమస్యలను చూసి నిరాశకులోనై ఈ చర్యకు పాల్పడ్డాం. ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేయడం కోసం, ఎంపీలు పై అంశాలపై చర్చ జరపాలనే ఉద్దేశంతో రంగుల పొగను వినియోగించాం. బ్రిటిష్ పాలనలో విప్లవయోధుడు భగత్ సింగ్ చేసినట్లుగా పార్లమెంట్‌లో అలజడి సృష్టించడం ద్వారా దేశ ప్రజల్లో ఇది చర్చనీయాంశంగా మారాలని భావించాం' అని నలుగురు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు చెప్పారు. ఆధారాలు దొరక్కుండా చేసేందుకే లలిత్ ఝా వీరి ఫోన్లను వెంటతీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. బహుశా అతడు వీటిని ధ్వంసం చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.


కన్నబిడ్డల మృతి కేసులో ఆస్ట్రేలియా మహిళ..

20 ఏళ్లకు విముక్తి

సిడ్నీ: కన్నబిడ్డల మృతి కేసులో 20 ఏళ్లపాటు కారాగారంలో మగ్గిన ఆస్ట్రేలియా మహిళకు ఎట్టకేలకు విముక్తి లభించింది.న్యూ సౌత్ వేల్స్ లోని క్రిమినల్ కోర్టు ఆదేశాలతో గురువారం ఆమె విడుదలయ్యారు. కాత్లీన్ ఫాల్బిగ్‌కు జన్మించిన నలుగురు సంతానం 1989–1999 సంవత్సరాల మధ్య వివిధ కారణాలతో చనిపోయారు. అయితే, వారి మరణాలకు తల్లి కాత్లీనే కారణమంటూ పోలీసులు 2003లో హత్య కేసు నమోదు చేసి, జైలు శిక్ష విధించారు. తాను అమాయకురాలినని, తన బిడ్డల మరణాలు సహజంగానే జరిగినవని ఆమె ఎంతగా చెప్పినా ఎవరూ వినలేదు. మీడియా ఆమెను వరస్ట్ ఫిమేల్ సీరియల్ కిల్లర్‌గా అభివర్ణించింది. 2019లో మరోసారి జరిగిన దర్యాప్తులోనూ ఆమెనే దోషిగా తేలింది. 2022లో మాజీ న్యాయాధికారి జరిపిన విచారణలో మాత్రం..చనిపోయిన నలుగురు బిడ్డల్లో ఇద్దరు జన్యు సంబంధ వ్యాధులతోనే చనిపోయి ఉండొచ్చంటూ తెలిపింది. దీంతో, ఈ ఏడాది జూన్‌లో ఆమెకు కోర్టు క్షమాభిక్ష ప్రకటించింది. ఆమెపై వచ్చిన ఆరోపణలను న్యూ సౌత్ వేల్స్ కోర్టు కొట్టివేస్తూ జైలు నుంచి విడుదల చేసింది. జైలు నుంచి విడుదలైన కాత్లీన్ ఫాల్బిగ్ హర్షం వ్యక్తం చేశారు. 1999లోనే తనపై మోపిన ఆరోపణలకు జవాబులు దొరికినా, నిరపరాధినని నిరూపించుకోలేకపోయాను. పిల్లలు ఆకస్మికంగా, గుర్తు తెలియని కారణాలతో చనిపోయే అవకాశం ఉందని భావించని యంత్రాంగం నన్ను దోషిగా చూసింది'అని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలపాటు తనను నిర్బంధించిన యంత్రాంగం నుంచి భారీగా పరిహారం కోరుతూ దావా వేస్తానన్నారు. ఫాల్బిగ్‌ను విడుదల చేయాలంటూ పలువురు వైద్య నిపుణులు, వైద్యులు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను సైతం చేపట్టారు.

షాహీ ఈద్గాలో సర్వే చేయండి

- అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వు
- మథుర ఆలయం-మసీదు కేసులో మలుపు

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని మథుర నగరంలో శ్రీకృష్ణుడు జన్మించిన ప్రదేశంలో షాహీ ఈద్గాను నిర్మించారంటూ దాఖలైన కేసు గురువారం కీలక మలుపు తీసుకుంది. కోర్టు పర్యవేక్షణలో షాహీ ఈద్గాలో శాస్త్రీయ సర్వే చేపట్టాలని అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి ఆలయాన్ని ఆనుకుని ఉన్న మసీదు ప్రాంగణంలో ఒకప్పటి హిందూ ఆలయ ఆనవాళ్లు ఉన్నాయంటూ కోర్టులో పిటిషన్లు దాఖలైన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో సర్వే కోసం కమిషనర్‌ను నియమించేందుకు కోర్టు అంగీకారం తెలిపింది. 'త్రిసభ్య కమిషన్ ఈ సర్వేను పర్యవేక్షిస్తుంది. సర్వే సందర్భంగా అక్కడి కట్టడాలు దెబ్బ తినకుండా చూడాలి. డిసెంబర్ 18న జరిగే ఈ కేసు తదుపరి విచారణలో సర్వే విధివిధానాలపై నిర్ణయం తీసుకుంటాం. శాస్త్రీయ సర్వేను ఇరు పక్షాల తరఫు ప్రతినిధులు ప్రత్యక్షంగా గమనించవచ్చు. పూర్తి పారదర్శకమైన నివేదికను కోర్టును కమిషన్ అందించాలి. ఈ నివేదికపై అభ్యంతరాలుంటే ఈద్గా తరఫు లాయర్లు తమ అభ్యంతరాలు తెలుపుతూ కోర్టును ఆశ్రయించవచ్చు' అని జస్టిస్ మయాంక్ కుమార్ జైన్ తన ఉత్వర్వులో పేర్కొన్నారు. కాగా, కోర్టు ఉత్తర్వును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని షాహీ ఈద్గా మేనేజ్‌మెంట్ కమిటీ తెలిపింది. ఇటీవలి కాలంలో ఆలయం-మసీదు వివాదాల్లో అలహాబాద్ హైకోర్టు ఇలా సర్వేకు ఆదేశాలివ్వడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇటీవలే వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ఆలయం పక్కనే ఉన్న జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో సర్వేకు అలహాబాద్ హైకోర్టు ఆదేశాలివ్వడం, సర్వే పూర్తయి భారత పురావస్తు శాఖ నుంచి తుది నివేదిక కోసం వేచి ఉన్న సంగతి తెల్సిందే. ''మసీదు ప్రాంగణంలో కమలం ఆకృతిలో ఉన్న పునాదులతో ఒక నిర్మాణం ఉంది. అది హిందువులు పూజించే శేషనాగును పోలి ఉంది. పునాదిపై హిందూ మత సంబంధ గుర్తులు, నగిషీలు స్పష్టంగా కనిపిస్తున్నాయి'' అని ఇటీవల పిటిషనర్ తరఫు న్యాయవాది విష్ణు శంకర్ జైన్ కోర్టులో వాదించారు.

క్లుప్తంగా...

కూర్మావతారంలో రామయ్య



భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు గురువారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రామయ్యను కూర్మావతారంలో అలంకరించారు. స్వామివారిని ఆలయ ప్రాంగణంలోని బేడా మండపంలో ఆళ్వార్లతో కొలువుదీర్చి అర్చకులు పూజలు జరిపారు. అనంతరం భక్తుల దర్శనార్థం ఊరేగింపుగా స్వామి వారిని మిథిలా స్టేడియంలో వేదికపై ఆశీనులను చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్న అనంతరం ఘనంగా తిరువీధి సేవ నిర్వహించారు.

ఇంజనీరింగ్ సీట్ల ర్యాటిఫికేషన్‌పై దర్యాప్తునకు డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల ర్యాటిఫికేషన్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఉన్నత విద్యామండలి ఈ ప్రక్రియను హడావిడిగా ముగించడం అనేక అనుమానాలకు తావిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా సీట్లు బ్లాక్ చేసినట్టు ఫిర్యాదులున్నాయని తెలిపారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగే వీలుందని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గృహనిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్‌గా ఈశ్వరయ్య

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గృహనిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్‌గా ఈశ్వరయ్యను ప్రభుత్వం నియమించింది. గృహనిర్మాణ శాఖ మంత్రిగా గురువారం బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈమేరకు ఫైలుపై సంతకం చేశారు. ఈశ్వరయ్య ఉమ్మడి రాష్ట్రంలో 34 ఏళ్ల పాటు గృహనిర్మాణ సంస్థలో వివిధ హోదాల్లో పనిచేశారు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా అత్యంత వేగంగా లక్షల సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించటంలో చీఫ్ ఇంజినీర్‌గా కీలకపాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగాయంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ సంస్థపై చర్యలు తీసుకున్నారు. ఈక్రమంలో ఈశ్వరయ్య సెలవులో వెళ్లారు. తిరిగి 2021లో ప్రభుత్వం ఆయనను ఈపీటీఆర్ఐ చీఫ్ ఇంజినీర్‌గా, ఆ తర్వాత రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఇన్‌చార్జిగా నియమించింది. ఆ రెండుచోట్ల ఆయన మూడేళ్లు కొనసాగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు భారీ ఎత్తున ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని నిర్ణయించిన నేపథ్యంలో, వాటి నిర్మాణంలో విశేషానుభవం ఉన్న ఈశ్వరయ్యను మళ్లీ గృహనిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్‌గా నియమించింది. ప్రస్తుతం రోడ్లు భవనాల శాఖలో అంతర్భాగంగా ఉన్న గృహనిర్మాణ సంస్థను.. త్వరలో మాతృశాఖను పునరుద్ధరించాక అందులోకి మార్చనున్నట్టు తెలిసింది.

పోలీస్ అకాడమీకి మూడు ఐఎస్ఓ సర్టిఫికెట్లు

సాక్షి, హైదరాబాద్: అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందుకుగాను రాజాబహదూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీకి మూడు విభాగాల్లో ఐఎస్ఓ సర్టిఫికెట్లు దక్కాయి. గురువారం అకాడమీ డైరెక్టర్ ఏఆర్.శ్రీనివాస్‌కు హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ మేనేజింగ్ డైరెక్టర్ శివయ్య ఆలపాటి మూడు విభాగాల్లో ఐఎస్ఓ సరిఫికెట్స్ అందజేశారు. అకాడమీలో శిక్షణ, వాతావరణం, ఆహారభద్రత ప్రమాణాలపై తనిఖీ నిర్వహించారు. ఈ మూడు విభాగాలకే సర్టిఫికెట్లు దక్కాయి. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఒక పోలీస్ శిక్షణసంస్థ ఈ అవార్డులను కైవసం చేసుకోవటం ఎంతో స్ఫూర్తిదాయకమని అకాడమీ డైరెక్టర్ ఏఆర్.శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో పోలీస్ అకాడమీ జేడీ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో ఐటీ దాడులు

మిర్యాలగూడలో ఇది రెండోసారి

మిర్యాలగూడ: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని రైస్ మిల్లుల్లో ఐటీ అధికారులు వరుసగా దాడులు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నవంబర్ 16వ తేదీన శెట్టిపాలెం, సాగర్‌రోడ్డులోని మిల్లులతోపాటు ముగ్గురు మిల్లర్ల ఇళ్లలో తనిఖీలు చేపట్టి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన నెలరోజులకే మళ్లీ ఐటీ అధికారులు దాడులకు దిగారు. గురువారం మిర్యాలగూడలోని నాలుగు రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టారు. ఆరు బృందాలుగా వచ్చిన ఐటీ అధికారులు మిల్లుల్లోని రికార్డులు తనిఖీ చేయడంతోపాటు బ్యాంకు లావాదేవీలు, కొనుగోలు రికార్డులను పరిశీలిస్తున్నారు.

రియల్ ఎస్టేట్ కార్యాలయంపై కూడా...

ఉప్పల్: ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయంపై కూడా ఐటీ దాడులు జరిగాయి. బుధవారం సాయంత్రం నుంచి గురువారం వరకు ఉప్పల్ బగాయత్‌లోని శ్రీ సిద్ధి వినాయక ప్రాపర్టీస్ కార్యాలయంలో సోదాలు నిర్వహించి కొన్ని కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. సంస్థలోని ఓ పార్టనర్‌ను ఏకంగా 10 గంటల పాటు విచారించినట్టు తెలిసింది. ఎల్బీనగర్, నాగోల్‌లలో ఉన్న కార్యాలయాలపై కూడా ఏకకాలంలో దాడి చేసినట్టు తెలిసింది.

కరాచి బేకరీ పరిశ్రమలో.. అగ్నిప్రమాదం

- గ్యాస్ పైప్ లీకేజీతో వ్యాపించిన మంటలు
- 15 మంది కార్మికులకు తీవ్ర గాయాలు
- ఐదుగురి పరిస్థితి విషమం.. ఆస్పత్రిలో చికిత్స
- కేసు నమోదు చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలోని కరాచి బేకరీ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే గ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు వ్యాప్తిచెంది 15 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదానికి పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని భావిస్తున్నారు. ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో కరాచి బేకరీకి సంబంధించిన ఆహార తయారీ పరిశ్రమలో ఉదయం 9.40 గంటల సమయంలో ప్రధాన వంటశాలగా ఉన్న ప్రాంతంలో 20 మంది కార్మికులు కేక్‌లు, బిస్కెట్లు తయారు చేస్తున్నారు. పరిశ్రమలో భారీ స్టవ్‌లకు గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తుంటారు. స్టవ్‌ల వద్దకు వచ్చే పైప్‌లైన్‌లో ఓ చోట లీకేజీ ఏర్పడటంతో మంటలు ఒక్కసారిగా బయటికి వ్యాపించి అక్కడ పనిచేస్తున్న 15 మంది కార్మికులకు అంటుకున్నాయి. దీంతో వెంటనే గ్యాస్ సరఫరాను నిలిపివేసిన పరిశ్రమ యాజమాన్యం, గాయపడిన కార్మికులను పరిశ్రమకు చెందిన ఆటోల్లోనే శంషాబాద్ ట్రైడెంట్ ఆస్పత్రికి తరలించింది. అనంతరం



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు తదితరులు

ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు.

నిర్లక్ష్యంతోనే ప్రమాదం..

కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదంలో కార్మికులకు మంటలంటుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 15 మంది కార్మికుల్లో తీవ్రంగా గాయాలైన పదమూడు మందిని డీఆర్‌డీఎల్ అపోలో ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. మిగతా వారు ట్రైడెంట్ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. కాగా, అగ్నిప్రమాదంలో గాయపడిన పదిహేను మంది కూడా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారే. బలరాం (25), శుభం ప్రజాపతి (19), అదితి కుమార్ (19), సందీప్ ప్రజాపతి (27), దీపక్ శుక్లా (18), అన్వేష్‌కుమార్ (20), ముఖేష్ కుమార్ (28), దారే సింగ్ (37), సోను (30), కోమల్ కిషోర్ (24), ప్రమోద్‌కుమార్ (23), సుజిత్ (19), సందీప్‌కుమార్ (25), సన్నీ (20), ప్రదీప్ (20)లలో ఐదుగురికి యాభై శాతం నుంచి ఎనభై శాతం వరకు కాలిన గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

గతంలోనూ ఇదే పరిశ్రమలో...

గతేడాది అక్టోబర్‌లో కూడా ఈ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఘటన రాత్రి సమయంలో జరగడం, కార్మికులెవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. దేశీయంగా, అంతర్జాతీయ బ్రాండెడ్‌గా ఉన్న పరిశ్రమలో తరచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం కార్మిక శాఖతో పాటు పరిశ్రమ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి

కరాచి పరిశ్రమలో అగ్నిప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శికి సీఎం ఆదేశాలు జారీచేశారు.

ఒక్కసారిగా మంటలంటుకున్నాయి..



మేము ఇరవై మంది అప్పుడే కేకులు, బిస్కెట్లు తయారీ ప్రారంభించాం. స్టవ్‌లకు సరఫరా అయ్యే గ్యాస్‌పైప్ లైన్ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో 15 మందికి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. – ప్రమోద్‌కుమార్, బాధితుడు



అయ్యప్ప షాపింగ్ మాల్‌లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

షాపింగ్ మాల్ బుగ్గి

కామారెడ్డిలో భారీ అగ్ని ప్రమాదం

రూ.6 కోట్లకు పైగా నష్టం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. నాజ్ టాకీస్ రోడ్‌లోని అయ్యప్ప షాపింగ్ మాల్‌లో రాత్రి 11.20 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. దీనిని గమనించిన నైట్ వాచ్‌మన్ మాల్ యజమానికి, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. అయితే ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పడానికి ప్రయత్నించేలోపే భారీగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. దీంతో ఎల్లారెడ్డి, గాంధారి, ఇందల్వాయి, రామాయంపేట, నిజామాబాద్‌ల నుంచి ఆరు ఫైర్ ఇంజన్లను, 50 మంది సిబ్బందిని రప్పించారు. భవనం నాలుగు అంతస్తుల్లో ఉండటంతో హైదరాబాద్ నుంచి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసెస్ విభాగం నుంచి భారీ స్కై లిఫ్ట్‌ను తెప్పించారు. ఆరు ఫైర్ ఇంజన్‌లతో పాటు స్కైలిఫ్ట్ ద్వారా మంటలను ఆర్పేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. సుమారు 50 ట్యాంకర్‌ల నీటిని తీసుకు వచ్చి మంటలను ఆర్పారు. గురువారం ఉదయం 11 గంటల సమయానికి మంటలను అదుపులోకి తెచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు మంటలు పూర్తిగా ఆరిపోయాయి. అయితే మాల్‌లోని దుకాణాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ. 6 కోట్లకు పైగా ఆస్తినష్టం జరిగిందని భావిస్తున్నారు.

నేటినుంచి జీరో టికెట్

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జారీ
- ఎండీ సజ్జనార్ వెల్లడి



మిధాని డిపో బస్సులో జారీ చేసిన జీరో టికెట్

సాక్షి, హైదరాబాద్: మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ జారీ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమవుతోంది. మహిళలకు ఈ నెల 9 మధ్యాహ్నం నుంచి ఉచిత ప్రయాణ వసతి అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మహిళలు బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నా, వారికి ఎలాంటి టికెట్ జారీ చేయటం లేదు. అయితే ఈ పథకం వల్ల ఆర్టీసీ నష్టపోయే ఆదాయాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేయటం ద్వారా సమకూర్చనుంది. అందువల్ల ప్రతినెలా ఎంతమంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు, అందువల్ల ఆర్టీసీ ఎంత ఆదాయాన్ని కోల్పోయింది.. అన్న లెక్కలను ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. టికెట్‌పై చార్జీ సున్నా అని చూపించినా, ఆ మహిళ ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ప్రయాణించిందో టికెట్‌లో నమోదవుతుంది. అంతదూరం ప్రయాణానికి వాస్తవంగా వసూలు చేయాల్సిన టికెట్ మొత్తం కూడా అందులో ఉంటుంది. వాటి ఆధారంగానే ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. ఈ జీరో టికెట్ విధానాన్ని సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆ ప్రక్రియ ఇప్పుడు పూర్తి కావటంతో ప్రయోగాత్మకంగా గురువారం కొన్ని డిపోల్లో వీటిని జారీ చేసి పరిశీలించారు. శుక్రవారం నుంచి అన్ని డిపోల పరిధిలో జీరో టికెట్ జారీ చేయనున్నట్టు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

తెలంగాణలో నివసించే మహిళలకు మాత్రమే మహాలక్ష్మి పథకం వర్తిస్తుంది. దీంతో శుక్రవారం నుంచి కండక్టర్‌కు మహిళలు కచ్చితంగా తెలంగాణ ప్రాంత నివాసితులుగా ధ్రువపరిచే ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డు లేదా నివాస ప్రాంతాన్ని తెలిపే గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. జిరాక్స్ కాపీ చూపించినా సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. అయితే శుక్రవారం ఎవరైనా గుర్తింపు కార్డు మరిచిపోతే, మళ్లీ మరిచిపోవద్దని హెచ్చరించి జీరో టికెట్ జారీ చేయనున్నారు. ఆ తర్వాత మాత్రం అనుమతించరని అధికారులు చెబుతున్నారు.

నిధుల విడుదలపై హర్షం

మహాలక్ష్మి పథకానికి ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆర్టీసీకి రూ.374 కోట్లు విడుదల చేయటంపై కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే బకాయి ఉన్న ఇతర మొత్తాలను కూడా అందించి ఆర్టీసీని ఆదుకోవాలని ఎస్ఎంయూ నేతలు నరేందర్, కమాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, ఖదీర్ తదితరులు కోరారు. ఇక ప్రజావాణి మాదిరి ఆర్టీసీ కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు 15 రోజులకోసారి కార్మిక వాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు కోరారు.



టీఎస్ రెడ్కోకు జాతీయ ఇంధన పొదుపు అవార్డు

సాక్షి, హైదరాబాద్: ఇంధన పరిరక్షణ చర్యలను ప్రోత్సహించడం, అమలు చేయడంలో మంచి పనితీరు కనబరిచినందుకు తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్కో) జాతీయ ఇంధన పొదుపు అవార్డు రెండో బహుమతిని గెలుచుకుంది. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నుంచి ఈ అవార్డును సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నీలం జానయ్య, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.శ్రీనివాసులు అందుకున్నారు. ఇంధన సామర్థ్యం కోసం తెలంగాణ ప్రభుత్వ నిరంతర సహాయ, మార్గదర్శకత్వం, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, వినియోగదారులు, భాగస్వాములు.. జాతీయ అవార్డును సాధించడంలో కీలకపాత్ర పోషించాయని రెడ్కో ఎండీ జానయ్య తెలిపారు.

ఆ 181 ఎకరాలు హెచ్‌ఎండీఏవే..

- శంషాబాద్ భూములపై తీర్పు వెలువరించిన హైకోర్టు
- 50 ఎకరాలపై తమకు హక్కులు ఉన్నాయంటూ గతంలో కొందరి పిటిషన్లు
- అవి ప్రభుత్వ భూములేనని గట్టిగా వాదనలు వినిపించిన ఏజీ
- పిటిషనర్లవి తప్పుడు నివేదికలని ధ్రువీకరించిన రిజిస్ట్రార్
- వాదనలు ముగించి తీర్పు రిజర్వు చేసిన ఉన్నత న్యాయస్థానం
- రెండు పిటిషన్లను కొట్టివేస్తూ తాజాగా ఆదేశాలు



సర్వేనంబరు 725 బై నంబర్లలో కూల్చిన చోటే మళ్లీ నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణదారులు

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్‌లోని 181 ఎకరాల వివాదాస్పద భూములు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)కే చెందుతాయని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. అందులోని 50 ఎకరాలపై తమకు హక్కులు ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. 2007 నుంచి శంషాబాద్ గ్రామ పంచాయతీ జారీ చేసిన ఆస్తి పన్ను నోటీసులు, మున్సిపల్ అనుమతి, రెవెన్యూ రికార్డులు, విద్యుత్ బిల్లులు, ఫొటోలు, 2023 ఏప్రిల్ 20 నాటి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్, ఇంటి పన్ను రశీదులు, ఇంటి నిర్మాణ అనుమతి.. ఇలా అన్నీ నకిలీవేనని జ్యుడీషియల్ రిజిస్ట్రార్ నివేదిక బయటపెట్టిందని స్పష్టం చేసింది. 2007లోనే తెలంగాణ రాష్ట్రం ఉన్నట్టు కల్పిత రసీదులు సృష్టించారని పేర్కొంది. 1990 సెప్టెంబర్ 4 నాటి ఉత్తర్వుగా పేర్కొంటూ.. 1992లో టైప్ చేసిన కాపీని పిటిషనర్ ఇచ్చారని, అది కూడా నకిలీదేనని తేలిందని వెల్లడించింది. అన్ని అంశాలను పరిశీలించాక పిటిషనర్‌కు ఉపశమనం పొందడానికి ఎలాంటి హక్కు లేదని స్పష్టం చేసింది.

'పైగా'భూములని పేర్కొంటూ..

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని సర్వే నంబర్ 725/21లోని 7.31 ఎకరాలు, సర్వే నంబర్ 725/23లోని 10.07 ఎకరాలు, సర్వే నంబర్ 725/25లోని 12.34 ఎకరాలు సహా దాదాపు 50 ఎకరాల భూమిని తన పూర్వీకులు పైగా (సైన్యం నిర్వహణకు పరిహారంగా నిజాం నవాబ్ మంజూరు చేసిన భూమి) యజమానుల నుంచి కొనుగోలు చేశారని హైదరాబాద్ వట్టేపల్లికి చెందిన యహియా ఖురేషి హైకోర్టులో రెండు రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. తమ వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నా కూడా హెచ్‌ఎండీఏ అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని ఇబ్బందులు కల్పిస్తున్నారని కోర్టుకు ఫిర్యాదు చేశారు. ఈ పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్‌ల ధర్మాసనం విచారణ జరిపింది.

రసీదులన్నీ నకిలీవే..

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేజీ రాఘవన్, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. తప్పుడు పత్రాలు, రసీదులు సృష్టించి కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని.. అత్యంత విలువైన ప్రాంతంలో దాదాపు 50 ఎకరాలకు పైగా భూమిని స్వాహా చేసేందుకు యత్నిస్తున్నారని ఏజీ కోర్టుకు వివరించారు. 2007, 2012లో జారీ చేసిన రసీదులు పూర్తిగా నకిలీవని స్పష్టం చేశారు. తప్పుడు రసీదులను, కోర్టు తీర్పు ఉత్తర్వుల పత్రాలను ఆయన ఈ సందర్భంగా ధర్మాసనానికి అందించారు. 2007 నాటికి తెలంగాణ రాష్ట్రమే లేదని, రసీదుల్లో మాత్రం తెలంగాణ అని పేర్కొన్నారని.. అలాగే శంషాబాద్ గ్రామం రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉండగా, హైదరాబాద్ అని మరో రసీదులో ఉందని వివరించారు. దాంతో ఈ అంశంపై పూర్తి విచారణ జరిపి సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని ధర్మాసనం గతంలోనే జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. రిజిస్ట్రార్ విచారణ జరిపి కోర్టుకు నివేదిక ఇచ్చారు. పిటిషనర్ పేర్కొన్నట్టుగా 1997లో అసలు పిటిషన్‌లే నమోదు కాలేదని వివరించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.


రానున్న మూడ్రోజులు గజ గజే..



మరింత తగ్గనున్న ఉష్ణోగ్రతలు

సాధారణం కంటే 1 నుంచి 2 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం.. రాష్ట్రానికి ఆగ్నేయదిశగా బలంగా వీస్తున్న గాలులు

సాక్షి, హైదరాబాద్: చలి తీవ్రత రాష్ట్రంలో క్రమక్రమంగా పెరుగుతోంది. చాలాచోట్ల సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 డిగ్రీల మేర తక్కువగా నమోదవుతున్నట్టు వాతావరణశాఖ వెల్లడించింది. చలికాలం మధ్యస్థానికి చేరడంతో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశముంది. రాష్ట్రానికి ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. గురువారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 31 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 12.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. నల్లగొండ, హైదరాబాద్, వరంగల్, మెదక్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల మేర తక్కువగా నమోదయ్యాయి.



లింగంపల్లి నుంచి 'దేవగిరి' కాచిగూడ నుంచి 'అజంతా'

ఎక్స్‌ప్రెస్ రైళ్ల టర్మినళ్ల మార్పు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ నుంచి ముంబైకి రాకపోకలు సాగించే దేవగిరి ఎక్స్‌ప్రెస్ 17058/17057 ఇక నుంచి సికింద్రాబాద్‌కు బదులు లింగంపల్లి నుంచి దేవగిరికి రాకపోకలు సాగించనుందని దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ నుంచి అజంతాకు వెళ్లే అజంతా ఎక్స్‌ప్రెస్(17064/17063) ఇక నుంచి మల్కాజిగిరి స్టేషన్‌లో అదనపు హాల్ట్‌తో కాచిగూడ స్టేషన్ నుంచి అజంతాకు రాకపోకలు సాగించనుంది. ఈ నెల 20వ తేదీ నుంచి ఈ మార్పులు అమలులోకి రానున్నాయి. సికింద్రాబాద్ స్టేషన్‌లో రైళ్ల ఒత్తిడిని తగ్గించేందుకు ఈ రెండు రైళ్ల టర్మినళ్లను మార్చినట్లు సీపీఆర్వో తెలిపారు. నగరంలోని పశ్చిమ ప్రాంతంలో వేగంగా జరుగుతున్న అభివృద్ధి, ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల విస్తరణ, ప్రముఖ వ్యాపారసంస్థల ఏర్పాటు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని లింగంపల్లి నుంచి దేవగిరి ఎక్స్‌ప్రెస్ రాకపోకలు సాగించేవిధంగా మార్పు చేసినట్లు పేర్కొన్నారు. లింగంపల్లి స్టేషన్‌కు పొడిగించడం వల్ల ముంబైకి మాత్రమే కాకుండా నిజామాబాద్, బాసర, నాందేడ్, మన్మాడ్, నాసిక్ వంటి ముఖ్యమైన పట్టణాలకు వెళ్లే ప్రయాణికులకు సదుపాయంగా ఉంటుంది. అజంతా ఎక్స్‌ప్రెస్‌ను కాచిగూడ స్టేషన్‌కు మార్చడం వల్ల కాచిగూడ నుంచి షిర్డీ(నాగర్‌సోల్ స్టేషన్) మధ్య రోజువారీ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ రైలుకు అదనంగా ఒక 2 టైర్ ఏసీని జతచేయనున్నారు.



హెచ్‌ఐవీ నియంత్రణకు కొత్త ఔషధాలు

బాధితులకు ఖర్చు కూడా తగ్గిపోయే వెసులుబాటు

సంక్రమిక వ్యాధుల నిపుణులు మోనాలిసా సాహు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఐవీని నియంత్రించేందుకు కొత్త ఔషధాలు అందుబాటులోకి వచ్చాయని, వ్యాధి బారినపడిన వారికి వీటితో మంచి ఫలితం ఉంటుందని ప్రముఖ సంక్రమిక వ్యాధుల నిపుణులు డాక్టర్ మోనాలిసా సాహు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఇంటిగ్రేస్ స్ట్రాండ్ ట్రాన్స్‌ఫర్ ఇన్‌హిబిటర్స్ (ఐఎన్ఎస్‌టీఐ)' ఔషధాలు బాధితుల శరీరంలో హెచ్‌ఐవీ వైరస్ స్థాయిలను గణనీయంగా తగ్గించాయని వివరించారు. ఈ ఐఎన్ఎస్‌టీఐ, డోలుటెగ్రావిర్ వంటివి వైరస్‌ను అణచివేస్తాయని తెలిపారు. మన దేశంలో 24 లక్షల మంది హెచ్‌ఐవీతో బాధపడుతున్నారని, బాధితుల సంఖ్యలో భారత్ ప్రపంచంలో 3వ స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

గుర్తింపు, చికిత్సలో సవాళ్లు..

2021లో విడుదలైన నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నివేదిక ప్రకారం.. దేశంలో హెచ్‌ఐవీ ఏటా 62 వేల మందికి సోకుతోందని డాక్టర్ మోనాలిసా సాహు తెలిపారు. ఎయిడ్స్ సంబంధిత మరణాల సంఖ్యను 2021లో 41,000గా అంచనా వేశారన్నారు. డోలుటెగ్రావిర్‌ను కలిగిన కొత్త అధునాతన ఐఎన్ఎస్‌టీఐ ఆధారిత ఔషధాలు హెచ్‌ఐవీ చికిత్సలో మంచి ఫలితాలను చూపుతున్నాయని తెలిపారు. కొత్త చికిత్స అవకాశాలు రోగులకు సౌకర్యవంతంగా ఉంటాయని, ఖర్చు కూడా తగ్గుతుందని వైరాలజిస్ట్ మేకా సత్యనారాయణ తెలిపారు.

ఏడాదంతా.. ఇడ్లీలు, బిర్యానీలే!



టిఫిన్ కోసం రూ. 6,00,000 ఖర్చు	ఏడాదిలో 1,633 బిర్యానీల ఆర్డర్	స్విగ్గీలో ఇద్దరు హైదరాబాదీల ఆర్డర్లివి..

నవరాత్రుల్లో మాత్రం మసాలా దోశనే ఫేవరేట్

స్విగ్గీ వార్షిక నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఇడ్లీతో టిఫిన్.. బిర్యానీతో భోజనం... ఏడాదంతా ఇదే మెనూ! ఇద్దరు హైదరాబాదీ స్విగ్గీ కస్టమర్ల తీరిది. 2023లో ఓ ఇడ్లీ ప్రియుడు ఇడ్లీల కోసం వెచ్చించిన సొమ్ము అక్షరాల రూ. 6 లక్షలు. మరో బిర్యానీ ప్రియుడైతే ఏకంగా ఏడాదిలో 1,633 బిర్యానీలు ఆర్డర్ చేశాడు. అంటే రోజుకు నాలుగు బిర్యానీల కంటే ఎక్కువే ఆరగించాడు. దేశవ్యాప్తంగా ప్రతి ఆరు బిర్యానీ ఆర్డర్లలో ఒకటి హైదరాబాద్ నుంచే ఉందని ఫుడ్ డెలివరీ సంస్థ 'స్విగ్గీ'వార్షిక నివేదిక వెల్లడించింది. అందులోని పలు ఆసక్తికర ఆర్డర్లివే..

బిర్యానీ తింటూ ఇండియా–పాకిస్తాన్ మ్యాచ్..

దేశవ్యాప్తంగా ప్రతి సెకనుకు 2.5 బిర్యానీల కోసం ఆర్డర్లు వచ్చాయి. ప్రతి 5.5 బిర్యానీ ఆర్డర్లలో ఒక వెజ్ బిర్యానీ ఉంది. కొత్తగా 20.49 లక్షల మంది యూజర్లు స్విగ్గీలో బిర్యానీలు ఆర్డర్ చేశారు. చండీగఢ్‌లోని ఓ బిర్యానీ ప్రియుల కుటుంబం అక్టోబర్‌లో జరిగిన భారత్–పాక్ ప్రపంచ క్రికెట్ కప్ మ్యాచ్ రోజున ఏకంగా 70 బిర్యానీలు ఆర్డర్ చేసింది. దేశవ్యాప్తంగా ఆ రోజు ప్రతి నిమిషానికి 250 బిర్యానీలను స్విగ్గీ డెలివరీ చేసింది. స్విగ్గీ డెలివరీ పార్ట్‌నర్స్ గతేడాది 16.64 కోట్ల కిలోమీటర్ల మేర విద్యుత్ వాహనాలు, సైకిళ్లపై ప్రయాణించి డెలివరీ చేశారు. గతేడాది అత్యధికంగా చెన్నైకి చెందిన వెంకటేశన్ 10,360, కొచ్చికి చెందిన సంధిని 6,253 ఆర్డర్లను డెలివరీ చేశారు.

చిప్స్, బిస్కెట్ల కోసం రూ.31,748 ఖర్చు..

నిత్యావసరాలను విక్రయించే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో కస్టమర్లు అత్యధికంగా పాలు, పెరుగు, ఉల్లిగడ్డల కోసం వెతికారు. జైపూర్‌కు చెందిన ఓ కస్టమర్ ఒక్క రోజులో 67 ఉత్పత్తులను ఆర్డర్ చేశాడు. చెన్నైకి చెందిన ఓ వ్యక్తి కాఫీ, జ్యూస్, బిస్కెట్లు, చిప్స్ కోసం ఒక్క ఆర్డర్‌లో అత్యధికంగా రూ. 31,748 ఖర్చు చేశాడు. అత్యంత వేగంగా ఢిల్లీలో ఒక కస్టమర్‌కు 65 సెకన్లలో నూడుల్స్ ప్యాకెట్లను డెలివరీ చేశారు. హైదరాబాద్, ముంబై కంటే బెంగళూరు నుంచి మామిడి పండ్ల కోసం ఎక్కువ ఆర్డర్లు వచ్చాయి.

ఒక్క రోజులో 207 పిజ్జాలు..



చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ఒక్కో కస్టమర్ నుంచి గరిష్టంగా 10 వేల కంటే ఎక్కువే ఆర్డర్లు వచ్చాయి. భువనేశ్వర్‌లోని ఒక కస్టమర్ ఒక్క రోజులో 207 పిజ్జాలు ఆర్డర్ చేశారు. ముంబైకి చెందిన ఓ కస్టమర్ ఏడాదిలో రూ. 42.3 లక్షల విలువైన ఫుడ్ ఆర్డర్లు చేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ ప్రాంతంలో జరిగిన ఓ పెద్ద పార్టీలో 269 ఐటెమ్స్ ఆర్డర్ చేశారు. దుర్గా పూజ సందర్భంగా దేశవ్యాప్తంగా 77 లక్షల రసగుల్లాల ఆర్డర్స్ వచ్చాయి. నవరాత్రి రోజుల్లో చాలా మంది ఫేవరేట్ ఆర్డర్ మసాలా దోశ.

కేక్‌లే కేక్‌లు..

గార్డెన్ సిటీగా పేరొందిన బెంగళూరు కేక్ సిటీగా మారింది! 2023లో ఈ నగరంలో 85 లక్షల చాక్లెట్ కేక్స్ ఆర్డర్లు వచ్చాయి. ప్రేమికుల దినోత్సవం నాడు దేశవ్యాప్తంగా నిమిషానికి 271 కేక్స్ ఆర్డర్ చేశారు. నాగ్‌పూర్‌కు చెందిన ఓ కస్టమర్ ఒక్క రోజులో 92 కేకులు ఆర్డర్ చేశాడు. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ సమయాల్లోనూ కేకులు ఆర్డర్ చేయడం గమనార్హం. 2023లో వేగాన్ ఆర్డర్లు 146 శాతం మేర పెరిగాయి. అలాగే మిల్లెట్స్ ఆధారిత ఆహార ఉత్పత్తుల ఆర్డర్లు 124 శాతం మేర పెరిగాయి. బుక్‌ఫీట్, ఫాక్స్‌టేల్, జొవార్, బాజ్రా, రాగి, రాజ్‌గిరి వంటి డిషెస్ కోసం ఎక్కువ ఆర్డర్లు వచ్చాయి.


క్లుప్తంగా...

నేడు కేసీఆర్ డిశ్చార్జ్!



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం మెరుగుపడుతోంది. శుక్రవారం ఉదయం ఆయనను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసే అవకాశం ఉంది. ఇటీవల ఆయన బాత్‌రూమ్‌లో కాలుజారిపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఆయన తుంటి ఎముక విరిగింది. సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చేర్పించగా, వైద్యులు ఆయనకు తుంటికీలు మార్పిడి చికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. ఆరోగ్యం మెరుగుపడటంతో కేసీఆర్‌ను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి ఇంటికి తరలించాలని వైద్యులు నిర్ణయించారు.

17న హైదరాబాద్‌కు రాజ్‌నాథ్‌సింగ్



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించనున్న ఫ్లయింగ్ కేడెట్ల కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. శిక్షణ పూర్తి చేసిన ఎయిర్‌ఫోర్స్, నేవీ, కోస్ట్‌గార్డ్స్, స్నేహపూర్వక దేశాల శిక్షణ అధికారుల నుంచి రక్షణమంత్రి గౌరవవందనం స్వీకరిస్తారు. పరేడ్ రివ్యూయింగ్ ఆఫీసర్ హోదాలో.. శిక్షణలో ప్రతిభ చూపిన కేడెట్లను ట్రోఫీలతో అభినందించనున్నారు. ఈ బ్యాచ్‌లో 212 మంది కేడె ట్లు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసినట్టు ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారులు తెలిపారు.

రోజూ 52.6 వేల మిలియన్ లీటర్ల మురుగునీరు శుద్ధి

కేంద్ర సహాయ మంత్రి కౌశల్ కిశోర్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రోజూ 52.6 వేల మిలియన్ లీటర్ల మురుగునీరు శుద్ధి జరుగుతోందని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోర్ తెలిపారు. 2022 జూలై నుంచి 2023 మే మధ్య ఏపీలో 1503.2 ఎంఎల్‌డీ, తెలంగాణలో 2750 ఎంఎల్‌డీ మురుగునీరు ఉత్పత్తి అయిందని బీఆర్‌ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు బదులుగా చెప్పారు.

మాజీ ప్రజాప్రతినిధులకు భద్రత తొలగింపు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేల్లో ప్రాణహాని లేనివారికి భద్రత ఉపసంహరించారు. ప్రజాప్రతినిధుల భద్రతపై ఇంటెలిజెన్స్ శాఖ నిర్వహించిన సమీక్షలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులకు ప్రాణహానిగానీ, ముప్పుగానీ లేవనే అంచనాకు వచ్చిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ గన్‌మెన్లను వెనక్కి రప్పించినట్టు సమాచారం. నూతన మంత్రులు, ఎమ్మెల్యేలకు భద్రత కల్పించాల్సిన నేపథ్యంలో ప్రాణహాని, ముప్పులేని మాజీ ప్రజాప్రతినిధులకు భద్రత ఉపసంహరించినట్టు ఓ అధికారి తెలిపారు.



సచివాలయంలో ఐటీ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్‌బాబు

కార్నింగ్ పెట్టుబడులు తరలడం అవాస్తవం

పెట్టుబడులపై ఆ సంస్థ ఇంకా నిర్ణయం తీసుకోలేదు: మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలకు కవర్ గ్లాస్(గొరిల్లా గ్లాస్) సరఫరా చేసే న్యూయార్క్‌కు చెందిన మెటీరియల్ సైన్స్ కంపెనీ 'కార్నింగ్' పెట్టుబడులు తమిళనాడుకు తరలిపోతున్నాయంటూ వస్తున్న ఆరోపణలపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పందించారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి తెలంగాణను అంతర్జాతీయస్థాయి గమ్యస్థానంగా మార్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని 'ఎక్స్'లో ప్రకటించారు. రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ రంగ పురోగతిలో కార్నింగ్‌ను కీలకమైన భాగస్వామిగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్‌జీడీ ఫార్మా భాగస్వామ్యంతో మహబూబ్‌నగర్ జిల్లాలో కార్నింగ్ ఇప్పటికే గ్లాస్ ట్యూబింగ్ తయారీ పరిశ్రమను నిర్వహిస్తోందన్నారు. తెలంగాణలో కార్నింగ్ గొరిల్లా కవర్ గ్లాస్ తయారీ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం చర్చలు జరుపుతోందన్నారు. గొరిల్లా గ్లాస్ తయారీ ప్రాజెక్టును ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై కార్నింగ్ ఇప్పటివరకు తెలంగాణసహా ఏ ఇతర రాష్ట్రంతోనూ స్పష్టమైన ఒప్పందం కుదుర్చుకోలేదని శ్రీధర్‌బాబు వెల్లడించారు. కాగా, ఈ ఏడాది సెప్టెంబర్‌లో అమెరికా పర్యటనకు వెళ్లిన అప్పటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీరామారావు కార్నింగ్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. తెలంగాణలో రూ.934 కోట్లతో గొరిల్లా గ్లాస్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని ఆయనకు హామీ ఇచ్చింది. అయితే కార్నింగ్ తమిళనాడులో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని శ్రీధర్‌బాబు ఖండించారు.

రాజేంద్రనగర్‌కు హైకోర్టు

భవన నిర్మాణానికి జనవరిలో శంకుస్థాపన
- ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎం ఆదేశం
- సమీక్షలో పాల్గొన్న సీజే, ఉన్నతాధికారులు



హైకోర్టు తరలింపు అంశంపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాజేంద్రనగర్‌లో హైకోర్టు నూతన భవన నిర్మాణానికి గాను వచ్చే జనవరిలో శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉన్నత న్యాయస్థానం తరలింపు అంశంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, ప్రభుత్వ ముఖ్య అధికారులతో హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో గురువారం సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత హైకోర్టు భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవనాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతను ప్రధాన న్యాయమూర్తి, న్యాయవాదులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రాజేంద్రనగర్ పరిధిలో 100 ఎకరాల్లో నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం.. సంబంధిత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హైకోర్టును ఇక్కడి నుంచి తరలించినా.. ఇప్పుడున్న భవనాన్ని హెరిటేజ్ బిల్డింగ్‌గా పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ భవనాన్ని ఆధునీకరించి సిటీ కోర్టుకు లేదా ఇతర కోర్టు భవనాలకు వినియోగించుకునేలా చూస్తామన్నారు. కాగా కొత్త జిల్లాల్లో కోర్టు భవనాల నిర్మాణానికి కూడా చొరవ చూపాలని సీజే విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీఎస్ శాంతి కుమారి, సీఎం కార్యదర్శి శేషాద్రి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్

- ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ
- గడ్డంను తోడ్కొని వెళ్లి స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టిన సీఎం, డిప్యూటీ సీఎం, ప్రతిపక్ష సభ్యులు
- బీఆర్‌ఎస్, ఎంఐఎం, సీపీఐ సభ్యులకు సీఎం ధన్యవాదాలు
- అసెంబ్లీ ఒక కుటుంబం అని, మనం ఆ కుటుంబ సభ్యులం అన్న రేవంత్



ప్రసాద్‌కుమార్‌ను స్పీకర్ స్థానం వద్దకు తీసుకెళ్తున్న సీఎం రేవంత్. చిత్రంలో కేటీఆర్, శ్రీధర్‌బాబు, భట్టి తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఉదయం శాసనసభ సమావేశం కాగానే ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ఈ మేరకు అధికారికంగా ప్రకటించారు. ప్రసాద్‌కుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తదితరులు స్పీకర్‌ను గౌరవ పూర్వకంగా తోడ్కొని వెళ్లి ఆయన కుర్చీలో కూర్చోబెట్టారు. ఆ తర్వాత వరుసగా మంత్రులు, ఎమ్మెల్యేలు స్పీకర్ చైర్ వద్దకు వచ్చి ప్రసాద్‌కుమార్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు.

మంచి సాంప్రదాయానికి అందరి మద్దతు: సీఎం

స్పీకర్ ఏకగ్రీవ ఎన్నికకు మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్, ఎంఐఎం, సీపీఐ సభ్యులకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మంచి సాంప్రదాయానికి అందరూ మద్దతు తెలిపారని, భవిష్యత్‌లో కూడా ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. గొప్ప వ్యక్తి స్పీకర్ అయ్యారని కొనియాడారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారన్నారు. ప్రసాద్‌కుమార్ తన సొంత జిల్లా నేత అని గుర్తు చేశారు. వికారాబాద్ అభివృద్ధిలో ప్రసాద్‌కుమార్‌ది చెరగని ముద్ర అని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబ బాధ్యతలు ఆయనకు బాగా తెలుసన్నారు. ఆయనకు 8 మంది సోదరీమణులు ఉన్నారని, చిన్న వయస్సులోనే తండ్రి చనిపోవడంతో వారందరి బాధ్యత తానే తీసుకున్నారన్నారు. ఈ అసెంబ్లీ కూడా ఒక కుటుంబమేనని, ఆ కుటుంబంలో మనమంతా సభ్యులమని పేర్కొన్నారు. ప్రతిపక్ష, పాలకపక్షం అందరూ కుటుంబ సభ్యులేనన్నారు. మనందరినీ సమన్వయం చేసే బాధ్యతను ఆయన సమర్థవంతంగా నిర్వహించగలరని, సభలో అందరి హక్కులను కాపాడగలరని, ఆదర్శవంతమైన అసెంబ్లీగా దీన్ని తీర్చిదిద్దుతారనే పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. సమాజంలో ఎన్నో రుగ్మతలకు ప్రసాద్‌కుమార్ పరిష్కారం చూపుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ప్రసాద్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఆయన పేదల సమస్యలు తెలిసిన వ్యక్తి అని అన్నారు. రాష్ట్రంలోని సమస్యలను పెద్ద ఎత్తున చర్చించేందుకు సభ్యులకు ఎక్కువ సమయం ఇస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

సంపూర్ణ మద్దతుకు కేసీఆర్ ఆదేశం: కేటీఆర్

స్పీకర్ ఎన్నిక విషయంలో మద్దతు ఇవ్వాలని మంత్రి శ్రీధర్ బాబు అడగగానే సంపూర్ణ మద్దతు ఇవ్వాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశించారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. స్పీకర్ ఎన్నికకు ధన్యవాద తీర్మానంపై మాట్లాడుతూ.. మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్‌రెడ్డిలాగే సభా హక్కులను కాపాడాలని కోరుతున్నానన్నారు. సామాన్య ప్రజల సమస్యలు చర్చకు వచ్చేలా చూడాలన్నారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..ప్రసాద్‌కుమార్ అంచెలంచెలుగా ఎదిగి ఈ రోజు స్పీకర్‌గా ఎన్నికయ్యారంటూ అభినందనలు తెలిపారు. తన తండ్రి శ్రీపాదరావు ఇదే శాసనసభలో చైర్‌కు ఔన్నత్యాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. స్పీకర్‌కు మద్దతు తెలిపినందుకు విపక్ష పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రసాద్‌కుమార్ ఇక కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కాదని మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. పిల్లలకు తండ్రి లాంటి పాత్ర ఆయన సభలో పోషించాలని ఆకాంక్షించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ఎమ్మెల్యేలు పద్మావతి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కాలే యాదయ్య, దానం నాగేందర్, కడియం శ్రీహరి, యెన్నం శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడారు.

బీజేపీ సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు మొదటి రోజు అసెంబ్లీకి గైర్హాజరైన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారానికి సైతం దూరంగా ఉన్న వారు గురువారం అసెంబ్లీకి హాజరయ్యారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్, పవార్ రామారావు పాటిల్, టి.రాజాసింగ్ వీరిలో ఉన్నారు.

పార్టీల బలాలను బట్టి సమయం: స్పీకర్

తనను స్పీకర్‌గా ఎంపిక చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రసాద్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అన్ని పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. 57 మంది కొత్త సభ్యులు ఉన్నారంటూ..పార్టీల బలాలను బట్టి సమయం కేటాయిస్తానని చెప్పారు. స్పీకర్ స్థానం ఉన్నతమైనదే కాదు సంక్లిష్టమైనదని పేర్కొన్నారు. అంతకుముందు సభ మొదలైన వెంటనే గతంలో ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయని వారి చేత ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కడియం శ్రీహరి, కొత్త ప్రభాకర్ రెడ్డి, పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి వీరిలో ఉన్నారు.

నేడు అసెంబ్లీకి గవర్నర్

ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్న తమిళిసై

రేపు ధన్యవాద తీర్మానంపై వేర్వేరుగా చర్చ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశం శుక్రవారం ఉదయం 11.30కు శాసనసభ సమావేశ మందిరంలో జరుగుతుంది. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సమావేశం ప్రారంభానికి ఐదు నిమిషాల ముందే గవర్నర్ అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకుంటారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు స్వాగతం పలుకుతారు. జాతీయ గీతాలాపన అనంతరం గవర్నర్ ప్రసంగిస్తారు. తమిళిసై ప్రసంగం సుమారు గంటకుపైగా ఉండే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత ఉభయ సభలు శనివారానికి వాయిదా పడనున్నాయి. శనివారం శాసనసభ, శాసనమండలి వేర్వేరుగా సమావేశమై గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించి ఆమోదిస్తాయి. కాగా అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు కొనసాగే అవకాశముందనే అంశంపై శుక్రవారం స్పీకర్ అధ్యక్షతన జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) భేటీలో నిర్ణయిస్తారు. అయితే బీఏసీ ఏర్పాటు కాకపోవడంతో దీనిపై కూడా శుక్రవారమే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వచ్చే ఐదేళ్ల లక్ష్యంపై

▶ మొదటి పేజీ తరువాయి

భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. గంటన్నరకుపైగా సమావేశం సాగింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక గవర్నర్ తొలిసారిగా ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడనుండటంతో.. ప్రసంగ పాఠంలో ఏ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలనేదానిపై మంత్రివర్గం కసరత్తు చేసింది. పాలన, ఆర్థిక అంశాల్లో రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి, వచ్చే ఐదేళ్లపాటు కొత్త ప్రభుత్వం అనుసరించే విధానాలను గవర్నర్ ప్రసంగం ద్వారా వివరించాలని నిర్ణయించింది.

గత ప్రభుత్వ విధానాలపై సమీక్ష..

గత ప్రభుత్వ హయాంలో వివిధ విభాగాల పనితీరు, పథకాల అమలులో లోపాలను గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించాలని కేబినెట్ నిర్ణయించింది. మరోవైపు విద్యుత్, వ్యవసాయం, సాగునీటిపారుదల, విద్య, వైద్యారోగ్యం, సంక్షేమ రంగాల్లో తాము అనుసరించే విధానాలను ప్రకటించాలని తీర్మానించింది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటి అమలును పాక్షికంగా ప్రారంభించిన అంశాన్ని వివరిస్తూ.. ఇతర గ్యారంటీల అమలు ఎప్పటి నుంచి ప్రారంభిస్తామనే దానిపై స్పష్టత ఇవ్వాలని నిర్ణయించింది. బీఆర్‌ఎస్ సర్కారు రాష్ట్రాన్ని అవినీతి, అప్పుల్లో ముంచిందని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేసిన నేపథ్యంలో.. గవర్నర్ ప్రసంగంలో, తర్వాత ధన్యవాద తీర్మానంపై జరిగే చర్చలో ఆయా అంశాలను ప్రస్తావించాలని కేబినెట్ భేటీలో నిర్ణయానికి వచ్చారు. ఇక రైతుబంధు, ధరణి పోర్టల్, సామాజిక పింఛన్ల పెంపు వంటి అంశాలపై త్వరలో మరోమారు సమావేశం అవుతామని మంత్రులకు సీఎం రేవంత్ చెప్పినట్టు సమాచారం.

విభాగాల వారీగా శ్వేతపత్రాలు

వివిధ ప్రభుత్వ శాఖల వారీగా అప్పులు, పనులు, పథకాల తీరుతెన్నులను వివరిస్తూ శ్వేతపత్రాలు విడుదల చేయాలని కేబినెట్ భేటీలో నిర్ణయించారు. ఇది మొక్కుబడిగా కాకుండా పూర్తి వివరాలు, ఆధారాలతో ఉండాలని.. ఆ దిశగా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కసరత్తు చేయాలని సీఎం ఆదేశించారు. మంత్రులు లోతుగా సమీక్షించి, తమ శాఖలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. శ్వేతపత్రాల విడుదల తర్వాత బీఆర్‌ఎస్ నుంచి వచ్చే ప్రతిస్పందనకు దీటుగా సమాధానాలు ఇచ్చేలా మంత్రులు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వంపై వచ్చే విమర్శలు, ఆరోపణలపై తొందరపాటుతో స్పందించకుండా.. లోతుగా అవగాహన చేసుకున్నాకే ప్రతిస్పందించాలని సీఎం సూచించినట్టు తెలిసింది. ఉభయ సభల భేటీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగే చర్చలో.. అధికార పక్షం నుంచి మాట్లాడే మంత్రులు, ఎమ్మెల్యేల జాబితా సిద్ధమైనందున వారు పూర్తి సన్నద్ధతతో రావాలని పేర్కొన్నట్టు సమాచారం.

మంత్రి దామోదర బాధ్యతల స్వీకారం



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న దామోదర

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా దామోదర రాజనరసింహ గురువారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. స్టాఫ్ నర్సుల నియామకాలు పెండింగ్‌లో ఉన్నందున వాటి ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. ఆరోగ్యశ్రీ కవరేజీ పెంపు ఫైలుపై సంతకం చేశారు. సయోధ్య స్వచ్ఛంద సంస్థ దానం చేసిన రెండు వాటర్ ప్లాంట్లను ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ (ఐఎంహెచ్)కు అందజేసే ఫైలుపైనా మంత్రి సంతకం చేశారు.

అనవసర ఖర్చులు చేయం

- కొత్త భవనాలు నిర్మించం.. వాహనాలు కొనం
- ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలోనే క్యాంపు కార్యాలయం
- రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రో రైలు ఉపయోగకరం కాదు
- మీడియాతో సీఎం రేవంత్ ఇష్టాగోష్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించుకుంటామే తప్ప అనవసరపు ఖర్చులకు వెళ్లబోమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. కొత్తగా భవనాలు నిర్మించబోమని, వాహనాలు కొనుగోలు చేసేది లేదని స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు వాయిదా పడిన తర్వాత లాబీల్లోని తన చాంబర్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబిచ్చారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రాన్ని (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) సీఎం క్యాంపు కార్యాలయంగా ఉపయోగిస్తామని, అందులో ఖాళీగా ఉన్న స్థలాన్ని ఇతర ప్రజావసరాల కోసం వినియోగిస్తామని చెప్పారు. ప్రగతిభవన్‌లో ఖాళీగా ఉండే భవనాలను, శాసనసభ భవనాలను కూడా సమర్థంగా వినియోగించుకుంటామని అన్నారు. రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మెట్రో రైలు ఉపయోగకరం కాదని, మరో రూట్‌లో దీనిని ప్లాన్ చేస్తామని వెల్లడించారు. పోలీస్ కమిషనర్ పోస్టుల కోసం ఎవరూ పైరవీలు చేయలేదన్నారు. అధికారులపై ఎలాంటి హంటింగ్ చర్యలకు పాల్పడబోమని అన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులు, శాఖల స్థితిగతులు, అన్ని అంశాలపై చర్చించి సమయం వచ్చినప్పుడు శ్వేతపత్రాలు విడుదల చేస్తామని తెలిపారు. వ్యవసాయానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోజుకు 12, 13 గంటలకు మించి కరెంటు ఇవ్వలేదని పేర్కొన్నారు.

నేడు బీఏసీ

పాత అసెంబ్లీ భవనంలో కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని, ప్రస్తుత భవనంలోనే శాసనసభ కొనసాగుతుందని రేవంత్ చెప్పారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల నిర్వహణ కోసం శుక్రవారం బీఏసీ నిర్వహిస్తామని, అందులో సమావేశాల ఎజెండాను ఖరారు చేస్తామని తెలిపారు.

'రెండు గ్యారంటీల అమలు'పై సైన్

- ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రిగా భట్టి బాధ్యతల స్వీకారం
- మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ సబ్సిడీ కోసం రూ.374 కోట్లు విడుదల
- రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధి రూ.10లక్షలకు పెంచేందుకు రూ.298 కోట్లు
- ముందుగా ప్రజాభవన్‌లో కుటుంబసమేతంగా గృహప్రవేశం



సచివాలయంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న భట్టి విక్రమార్క


సాక్షి, హైదరాబాద్: మహాలక్ష్మి పథకంలోని రెండు గ్యారంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రిగా గురువారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన మల్లు భట్టి విక్రమార్క రెండు గ్యారంటీల అమలు ఫైళ్లపై సంతకం చేశారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి ఆర్టీసీకి సబ్సిడీ కింద రూ.374 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ.10లక్షలకు పెంచేలా వైద్యారోగ్య శాఖకు రూ.298 కోట్ల నిధులు విడుదల చేశారు. వీటితో పాటు రాష్ట్రంలోని వివిధ వర్గాలకు అందిస్తున్న సబ్సిడీల కింద చెల్లింపులకు విద్యుత్‌శాఖకు రూ.996 కోట్లు, సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణ ఏర్పాట్లకు రూ.75 కోట్లు విడుదల చేసేందుకు గిరిజన సంక్షేమశాఖ ప్రతిపాదనలను ఆమోదిస్తూ సంతకాలు చేశారు.

సరిగ్గా 8:21 నిమిషాలకు...

ఉదయమే తన అధికారిక నివాసమైన ప్రజాభవన్‌లోకి కుటుంబసమేతంగా గృహ ప్రవేశం చేశారు భట్టి. ఆ తర్వాత సచివాలయంలోని రెండో అంతస్తులో ఉన్న ఆర్థిక మంత్రి చాంబర్‌కు మల్లు భట్టి విక్రమార్క గురువారం ఉదయం కుటుంబ సమేతంగా వచ్చారు. ఈ సందర్భంగా తన చాంబర్‌లో కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భట్టి సతీమణి నందిని, కుమారులు సూర్య విక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్య, ఇతర బంధు మిత్రులు పాల్గొన్నారు. భట్టి ఆ తర్వాత సరిగ్గా 8:21 నిమిషాలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, విద్యుత్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఆర్థిక శాఖ కార్యదర్శులు శ్రీదేవి, కృష్ణభాస్కర్, హరిత తదితర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, డాక్టర్ రాగమయి, కేఆర్.నాగరాజు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

రాయగిరి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు పదెకరాలు

భూమి కేటాయిస్తూ పొంగులేటి తొలి సంతకం.. మంత్రిగా బాధ్యతల స్వీకరణ



సచివాలయంలో ఫైల్‌పై సంతకం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం సచివాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భువనగిరి జిల్లా రాయగిరిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి పది ఎకరాల భూమిని కేటాయిస్తూ మొదటి ఫైలుపై సంతకం చేశారు. రూ.9.50 కోట్ల విలువగల ఈ స్థలంలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు యువజన, క్రీడల శాఖకు భూమిని కేటాయించారు. అనంతరం 33 జిల్లాల డీపీఆర్‌వోలకు అధునాతన కెమెరాలు సమకూర్చడానికి సంబంధించిన రెండో ఫైలుపై సంతకం చేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వేముల వీరేశం, ఆదినారాయణ, బాలు నాయక్, ఆది శ్రీనివాస్, యశస్వినీరెడ్డితో పాటు సీనియర్ నాయకులు రేణుకా చౌదరి, రామసహాయం సురేందర్ రెడ్డి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి శ్రీనివాస రాజు, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కె. అశోక్‌రెడ్డి, సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళి, అదనపు డైరెక్టర్ నాగయ్య, జేడీలు జగన్, శ్రీనివాస్, వెంకట రమణ, డీడీలు మధుసూదన్, హష్మి, రాజా రెడ్డి, సీఐఈ రాధా కిషన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

మొదటిరోజే మంత్రి సీతక్క మార్క్

బాధ్యతల స్వీకరణ అనంతరం మూడు దీర్ఘకాలిక ప్రతిపాదనలకు ఆమోదం



బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఫైళ్లపై సంతకాలు చేస్తున్న మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రిగా సీతక్క గురువారం సచివాలయంలో బాధ్యతలు చేపట్టిన వెంటనే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను ఆమోదిస్తూ శాఖపై తన ముద్ర వేశారు.

- ప్రతిజిల్లాకు ఒక శిశుసంరక్షణ కేంద్రం (క్రెచ్ సెంటర్) ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేంద్రాల్లో ఆరునెలల నుంచి ఆరేళ్ల పిల్లల వరకు సంరక్షిస్తారు. ప్రతి కేంద్రానికి ఇద్దరు సంరక్షకులు ఉంటారు. కేంద్రాల నిర్వహణ, వేతనాల చెల్లింపులకు రూ.1.27 కోట్లు కేటాయించారు. ఈ ఫైల్‌పై మంత్రి సంతకం చేశారు.
- రాష్ట్రంలోని 3,989 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయించినా, ఎన్నికలకోడ్ నేపథ్యంలో వాటి మార్పు జరగలేదు. తాజాగా ఇందుకు సంబంధించిన ఫైల్‌పైనా మంత్రి సంతకం చేయడంతోపాటు అప్‌గ్రేడ్ చేసిన కేంద్రాలకు కొత్తగా 3,989 హెల్పర్లను నియమించుకునే ప్రతిపాదనను ఆమోదించారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,700 అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లల ఎదుగుదల, పోషణస్థితిని అంచనా వేసేందుకు, ఎత్తు, బరువు కొలిచేందుకు పోషన్ అభియాన్ 2.0 పథకం కింద పరికరాల కొనుగోలుకు రూ.28.56 కోట్లు మంజూరు చేస్తూ ఇందుకు సంబంధించిన ఫైల్‌ను క్లియర్ చేశారు. ఈ నిధుల్లో కేంద్ర ప్రభుత్వ వాటా 60శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం . వీటినంత త్వరగా చర్యలు చేపట్టాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇతర శాఖల బాధ్యతలు కూడా..

ధనసరి సీతక్క గురువారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల బాధ్యతలు కూడా స్వీకరించారు. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆమెకు రాజన్న ప్రసాదం అందజేశారు. మంత్రికి ఎమ్మెల్యేలు నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డిలు కూడా అభినందనలు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పీఆర్‌శాఖ డైరెక్టర్ హన్మంతరావు, మిషన్‌భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డిలతో ఇతర అధికారులు మంత్రిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 200 వ్యవసాయ యంత్రాల అద్దె కేంద్రాలను మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసేందుకు మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం, 15, డిసెంబర్, 2023



అధ్యక్షా.. అభినందనలు

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి



స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను అభినందిస్తున్న తలసాని



ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్న రాజాసింగ్

గ్రాండ్‌గా.. నేవీ బ్యాండ్



భారత నౌకాదళం విశాఖపట్నం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హుస్సేన్ సాగర్ తీరంలోని 125 అడుగుల డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పెషల్ బ్యాండ్(సంగీత విభావరి) ఎంతగానో ఆకట్టుకుంది. 1971లో జరిగిన యుద్ధంలో భారత నౌకా దళం పోషించిన వీరోచిత పాత్రను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా నవంబర్ 4 నుంచి ఇండియన్ నేవీ వీక్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే డీఎండీఈ సికింద్రాబాద్ సహకారంతో నిర్వహించిన స్పెషల్ బ్యాండ్‌లో దేశభక్తి, వెస్ట్రన్, భారత నౌకా దళానికి సంబంధించిన సంగీతాన్ని ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ స్పెషల్ సెక్రటరీ శృతి ఓజా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గతంలో ఆలపించిన ఓ గేయాన్ని సైతం ప్రదర్శించారు. – ఖైరతాబాద్



మహా మార్పు!

హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా ఆమ్రపాలి

- ఎంఆర్‌డీసీఎల్ ఎండీగానూ అదనపు బాధ్యతలు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) జాయింట్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఆమ్రపాలిని గురువారం ప్రభుత్వం నియమించింది. అలాగే.. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం పురపాలక శాఖప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ఆమ్రపాలికి జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. మరోవైపు ఐదేళ్లుగా హెచ్‌ఎండీఏకు పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించకపోవడం గమనార్హం.

నాటినుంచి నేటి వరకు..

2018 ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు జనార్దన్‌రెడ్డి హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత 2019 జనవరి నుంచి ఇప్పటి వరకు అర్వింద్‌కుమార్ హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి హెచ్‌ఎండీఏలో పూర్తిస్థాయి కమిషనర్‌లు చాలా తక్కువ కాలమే కొనసాగారు. రాష్ట్ర విభజన అనంతరం ఐఏఎస్‌ల కేటాయింపుల్లో భాగంగా నీరబ్‌కుమార్ ప్రసాద్ హెచ్‌ఎండీఏ తొలి కమిషనర్‌గా 2014 సెప్టెంబర్ వరకు ఉన్నారు. అనంతరం ప్రదీప్‌చంద్రకు అదనపు బాధ్యతలను అప్పగించారు. 2015 ఏప్రిల్ వరకు ఆయన ఆ పదవిలో ఉన్నారు. అదే ఏడాది అక్టోబర్ వరకు శాలినీ మిశ్రా హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత 2015 అక్టోబర్ నుంచి 2018 ఆగస్టు వరకు చిరంజీవులు అత్యధిక కాలం కమిషనర్‌గా పని చేశారు. ఆగస్టులో బాధ్యతలు చేపట్టిన జనార్దన్‌రెడ్డి 2018 డిసెంబర్ వరకు కొనసాగారు.

కార్యకలాపాల్లో భారీ విస్తరణ...

హైదరాబాద్ చుట్టుపక్కల ఏడు జిల్లాల పరిధిలో సుమారు 7,200 చదరపు కి.మీ వరకు హెచ్‌ఎండీఏ కార్యకలాపాలు విస్తరించాయి. ఉప్పల్ భగాయత్‌తో పాటు అనేక చోట్ల ప్రభుత్వ భూముల్లో భారీ లేఅవుట్‌లను అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా హెచ్‌ఎండీఏ ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం తెచ్చిపెట్టింది. రైతుల నుంచి భూములను సేకరించి విక్రయించింది. రాజీవ్ స్వగృహ ప్లాట్‌లు, ఫ్లాట్‌ల విక్రయాల ద్వారా కూడా సర్కార్ ఖజానాకు ఆదాయం లభించింది. రియల్ రంగం పరుగులు పెట్టింది. మరోవైపు హెచ్‌ఎండీఏ అనుమతులతో పెద్ద ఎత్తున హైరైజ్ భవనాల నిర్మాణం జరుగుతోంది. రహదారుల విస్తరణ, లింక్‌రోడ్ల అభివృద్ధి, ఔటర్ మార్గంలో, చుట్టుపక్కల పచ్చదనం పెంపు, అర్బన్ ఫారెస్ట్‌ల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను ఇటీవల కాలంలో హెచ్‌ఎండీఏ చేపట్టింది. మూసీపై మొత్తం 14 చోట్ల వంతెనల నిర్మాణం చేపట్టగా, ఐదు చోట్ల హెచ్‌ఎండీఏకు నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. నార్సింగి నుంచి కొల్లూరు వరకు అధునాతన సైకిల్‌ట్రాక్, ట్యాంక్‌బండ్‌తో పాటు పలు చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను గత మూడేళ్లుగా చేపట్టారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా ఆమ్రపాలిని నియమించారు. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏ భవిష్యత్ కార్యకలాపాలు ఎలా ఉండనున్నాయనే అంశం ఆసక్తికరంగా మారింది.

న్యూస్‌రీల్

నిమ్స్‌కు హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ టెక్నాలజీ అవార్డు

పంజాగుట్ట: నగరంలోని నిమ్స్ ఆస్పత్రి సేవలకు సరైన గుర్తింపు దక్కింది. హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ టెక్నాలజీ అవార్డుకు ఎంపికైంది. ఈ పురస్కారానికి కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఎంపిక చేసింది. తెలంగాణ ప్రభుత్వం, నేషనల్ హెల్త్ మిషన్ సహకారంతో కొన్నేళ్లుగా ది ఈఐసీయూ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదం, పాము కాటుకు గురి కావడం వంటి అత్యవసర సమయాల్లో రోగులకు ఎలాంటి వైద్యం అందించాలి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాలు దక్కుతాయనే అంశాలను నిమ్స్ నుంచి వైద్య బృందం ఆయా కేంద్రాల్లో ఉన్న వారికి వర్చువల్ పద్ధతిలో వివరిస్తోంది. దీంతో ఎంతో మంది ప్రాణాలు దక్కాయి. మూడేళ్ల వ్యవధిలో సుమారు 7,000 మంది అత్యవసర రోగులకు సేవలందించారు. నాణ్యమైన వైద్య సేవల్ని అందిస్తున్నందుకు సీఐఐ గుర్తించింది. 2023 సంవత్సరానికి గాను హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ టెక్నాలజీ అవార్డుకు ఫస్ట్ రన్నరప్‌గా నిమ్స్‌ను ఎంపిక చేసింది. అవార్డు రావడం పట్ల నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప వైద్యులతో పాటు ది ఈఐసీయూ ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ పద్మజను ప్రత్యేకంగా అభినందించారు.

భలే.. పిల్లల ప్రపంచం

సమష్టిగా పని చేద్దాం: మంత్రి సీతక్క



శిశువిహార్ చిన్నారులతో ముచ్చటిస్తున్న మంత్రి సీతక్క

వెంగళరావునగర్: ఏదైనా శాఖ అభివృద్ధి చెందాలంటే అక్కడ పని చేసి ఆయాల నుంచి అధికారుల వరకు సమష్టిగా తమ పనులు తాము చేయాలని అప్పుడే ఆశించి ఫలితాలు లభ్యమవుతాయని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఇందులో భాగంగా మంత్రి శిశువిహార్, సర్వీస్ హోంను సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న పిల్లలను ఆత్మీయంగా పలకరించి బిస్కెట్లు అందజేశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అదే ప్రాంగణంలో ఆశ్రయం పొందుతున్న అవిభక్త కవలలు వీణావాణీలను కలుసుకుని వారి చదువు ఇతర వివరాలపై ఆరా తీశారు. అనంతరం స్టేట్‌హోంలోని ఆయాలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క... మాట్లాడుతూ.. స్టేట్‌హోం చాలా ఆహ్లాదకరంగా ఉందన్నారు. తాను చిన్న కుటుంబం నుంచి వచ్చానని, కిందిస్థాయి ఉద్యోగుల కష్ట నష్టాలు తెలుసునన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్లు సునంద, లక్ష్మి, ఆర్‌జేడీ మోతీ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు మెట్రోపై కసరత్తు

రెండు రూట్‌లలో త్వరలో క్షేత్రస్థాయి పరిశీలన

- భూసేకరణ, ప్రాజెక్టు అంచనాలు, వ్యయంపై నివేదిక
- దృష్టి సారించిన హెచ్‌ఎంఆర్‌ఎల్
- 'రాయదుర్గం- శంషాబాద్' నిలిపివేతపై ఐటీ, రియల్ వర్గాల్లో అసంతృప్తి

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన మెట్రో అలైన్‌మెంట్‌లపై అధికారులు దృష్టి సారించారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన రాయదుర్గం- శంషాబాద్ ఎయిర్‌పోర్టును నిలిపివేస్తూ కొత్తగా ఎల్‌బీనగర్ నుంచి చాంద్రాయణగుట్ట.., ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మీదుగా ఎయిర్‌పోర్టు వరకు రెండు రూట్‌లను పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కొత్త మార్గాలపై కసరత్తుకు సన్నద్ధమైంది. ఈ రెండు రూట్‌లలో మెట్రో నిర్మాణంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు మెట్రో రైల్ అధికారులు త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. అవసరమైన భూసేకరణ, అలైన్‌మెంట్ మార్గం, అంచనా వ్యయం తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పించేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు.

తక్కువ భూసేకరణతో..

- ఎల్‌బీనగర్ నుంచి చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, పి-7 రోడ్ రూట్‌లో, ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా, బార్కాస్, పహాడీషరీఫ్ రూట్‌లో మెట్రో నిర్మాణాన్ని పరిశీలించాలని సీఎం చెప్పారు. ఎల్‌బీనగర్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 20 కిలోమీటర్‌లకు పైగా దూరం ఉంటుంది. ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టు వరకు సుమారు 12 కి.మీ ఉంటుందని అంచనా. గత ప్రభుత్వం ప్రతిపాదించిన రాయదుర్గం- శంషాబాద్ రూట్ 31 కి.మీ ఉంటుంది. ఈ క్రమంలో ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన రూట్‌లలో ఎయిర్‌పోర్టు వరకు మెట్రో నిర్మాణానికి రాయదుర్గం రూట్ కంటే తక్కువ ఖర్చవుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దూరం తక్కువగా ఉండడంతో పాటు పెద్దగా భూసేకరణ చేయాల్సిన అవసరం లేదు. రోడ్డు మార్గంలోనే మెట్రో నిర్మాణం చేపట్టవచ్చు. అలాగే ఎయిర్‌పోర్టు రూట్‌ను పొడిగించి ఫార్మాసిటీ స్థానంలో ప్రతిపాదించిన మెగా టౌన్‌షిప్ వరకు భవిష్యత్‌లో పెద్దగా భూసేకరణ జరపాల్సిన అవసరం లేకుండా మెట్రో నిర్మాణం చేపట్టేందుకు అవకాశాలు ఉన్నాయి.

నిర్మాణంపై ముందుకు సాగేదెలా..



- రాయదుర్గం- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గాన్ని గత ప్రభుత్వం ఎక్స్‌ప్రెస్ మెట్రోగా నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించింది. ప్రస్తుతం ఉన్న మెట్రో రైల్ రూట్‌లను ఎల్‌అండ్‌టీ సంస్థ పీపీపీ మోడల్‌లో నిర్మించగా ఎయిర్‌పోర్టు మెట్రోను సుమారు రూ.6,250 కోట్లతో సొంతంగా చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రస్తుత ప్రభుత్వం పాత అలైన్‌మెంట్‌ను నిలిపివేసి కొత్త అలైన్‌మెంట్‌లను ప్రతిపాదించిన నేపథ్యంలో సొంతంగా నిర్మిస్తుందా? లేక ఏదైనా నిర్మాణ సంస్థకు పీపీపీ తరహాలోనే అప్పగిస్తుందా? అనే అంశం స్పష్టం కావాల్సి ఉంది. 31 కి.మీ రాయదుర్గం- శంషాబాద్ రూట్‌ను రూ.5,888 కోట్లతో నిర్మించేందుకు ఎల్‌అండ్‌టీ, ఎన్‌సీసీ సంస్థలు ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అంతకంటే తక్కువ నిధులతోనే ఎల్‌బీనగర్- ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.
- ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో నిర్మించాల్సిన బాధ్యత ఎల్‌అండ్‌టీపై ఉంది. ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టు వరకు కేవలం 12 కి.మీ కొత్తగా నిర్మించాల్సి ఉంటుంది. ఎల్‌బీనగర్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు విస్తరించినా రాయదుర్గం రూట్ కంటే తక్కువ ఖర్చే అవుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన రూట్‌లలోనే ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణం చేపడితే నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు వెంటనే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఓల్డ్‌సిటీ మెట్రో నిర్మాణం కూడా వెంటనే చేపట్టాలి. ఈ రెండు రూట్‌లు పూర్తయితే గానీ ఎయిర్‌పోర్టు వరకు విస్తరణ సాధ్యం కాదు. ప్రతిపాదించిన ప్రాజెక్టులను సకాలంలో చేపట్టినా ప్రయాణికులకు అందుబాటులోకి రావడానికి కనీసం ఐదేళ్లు పట్టవచ్చని అంచనా.

రియల్ ఎస్టేట్ డీలా పడే ప్రమాదం?

- రాయదుర్గం- శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రూట్‌ను నిలిపివేయడం పట్ల ఐటీ, రియల్ ఎస్టేట్ వర్గాల్లో నిరసన వ్యక్తమవుతోంది. హైటెక్ సిటీ నుంచి రాయదుర్గం వరకు చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 500 జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయి. ఐటీ నిపుణులు, వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు ప్రతిరోజూ ఎయిర్‌పోర్టు నుంచి ఐటీ కారిడార్‌లకు రాకపోకలు సాగిస్తారు. ఈ రూట్‌లో ఎయిర్‌పోర్టు వరకు మెట్రో అందుబాటులోకి రానుండడంతోనే ఔటర్‌రింగ్‌రోడ్డు చుట్టూ భూముల ధరలు పెరిగాయి. కోకాపేట్, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో అనూహ్యమైన రియల్ భూమ్ కనిపించింది. తాజాగా ఈ రూట్‌ను నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రియల్ ఎస్టేట్ డీలా పడుతుందని ఆయా వర్గాలు పేర్కొంటున్నాయి.

పతంగి.. చేతికొచ్చేనా!



ఎంఐఎం-కాంగ్రెస్ మధ్య సయోధ్య కుదిరేనా!!

- కొత్త పొత్తుపై జీహెచ్‌ఎంసీలో ఊహాగానాలు
- ప్రస్తుతం బీఆర్‌ఎస్-ఎంఐఎం పరస్పర సహకారం
- గతంలో మేయర్ పదవిని పంచుకున్న హస్తం- మజ్లిస్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం బీఆర్‌ఎస్‌తో అంటకాగుతున్న ఎంఐఎం తన పొత్తు సహకారాన్ని కొనసాగిస్తుందా? లేక దాన్ని కాంగ్రెస్ వైపు మళ్లిస్తుందా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. బీఆర్‌ఎస్ స్థానే రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు ఇటీవలి కొన్ని పరిణామాలతో ఇది హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్‌లో కొందరు సీనియర్లు ఉన్నా.. వారిని కాదని ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం పార్టీకి చెందిన అక్బరుద్దీన్ ఒవైసీని నియమించడం ఇందులో ఒకటి. నగరానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారిగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులతో పాటు ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పాల్గొనడం రెండోది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి నిర్వహించిన ఈ సమావేశంలో ఎంఐఎం ప్రజాప్రతినిధులు తప్ప ఇతర పార్టీల వారు పాల్గొనలేదు. గ్రేటర్ పరిధిలో 16 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో పాటు బీజేపీ నుంచి ఒక ఎమ్మెల్యే ఉన్నారు. మూసీ పరిధి కేవలం ఎంఐఎం ఎమ్మెల్యేల పరిధిలోనే కాకుండా ఇతర ఎమ్మెల్యేల పరిధిలోనూ ఉంది. అయినప్పటికీ కేవలం ఆ పార్టీ వారు మాత్రమే హాజరు కావడంతో కాంగ్రెస్-ఎంఐఎం మధ్య కొత్త పొత్తు కుదరనుందా? అనే చర్చలు ఊపందుకున్నాయి.

కొనసాగుతున్న బీఆర్‌ఎస్- ఎంఐఎం పొత్తు

కొత్త పాలకమండలి ఏర్పాటైన నాటి నుంచి ఎంఐఎం-బీఆర్‌ఎస్‌ల మధ్య పొత్తు నడుస్తోంది. ఆ మాట కొస్తే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఏర్పాటైన జీహెచ్‌ఎంసీ పాలకమండళ్లలో ఈ పొత్తు బంధం కొనసాగుతోంది. రెండు పార్టీలూ సర్వసభ్య సమావేశాల్లోనే కాకుండా వివిధ సందర్భాల్లో సమన్వయంతో పని చేస్తున్నాయి. అధికారికంగా రెండింటి మధ్య లిఖితపూర్వక ఒప్పందం లేకున్నా.. వ్యవహారాలు మాత్రం ఐక్యంగా కొనసాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీలో ఎంతో కీలకమైన స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సైతం పోటీ లేకుండా ఉండేందుకు రెండు పార్టీలూ పరస్పర ఒప్పందంతో తమ పార్టీ కార్పొరేటర్లను నిలుపుతున్నాయి. దీంతో ఎన్నిక జరగకుండానే స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తోంది.

కొత్తగా కాంగ్రెస్‌తో దోస్తీ?

హస్తం పార్టీ అధికారంలోకి రావడంతో ఎంఐఎం ఇప్పటివరకూ బీఆర్‌ఎస్‌తో కొనసాగించిన పొత్తును కాంగ్రెస్ వైపు మళ్లించనుందా? లేక దోస్తీ కొనసాగించనుందా? అనే ఊహాగానాలు కొనసాగుతున్నాయి. వాస్తవానికి జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్ బలం నామమాత్రమే. అయినప్పటికీ ప్రభుత్వపరంగా పనులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటే పరస్పర అవగాహనతో ఈ రెండు పార్టీలూ వ్యవహరించవచ్చేమో!

గతంలో మేయర్ పోస్టుపై పొత్తు

గతంలో మేయర్ పోస్టును సైతం పొత్తులో భాగంగా కాంగ్రెస్-ఎంఐఎంలు పంచుకోవడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ 2009–14 పాలకమండలిలో కాంగ్రెస్-ఎంఐఎం మేయర్ పోస్టుపై ఒప్పందం కుదుర్చుకున్నాయి. తొలుత కాంగ్రెస్ మూడేళ్లు, ఎంఐఎం రెండేళ్లు మేయర్ పోస్టును పంచుకోవాలని భావించాయి. తర్వాత తొలి రెండేళ్లు కాంగ్రెస్, మలి రెండేళ్లు బీఆర్‌ఎస్.. తర్వాత మిగిలే ఒక సంవత్సరం తిరిగి కాంగ్రెస్ మేయర్ ఉండేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ అమల్లోకి వచ్చేప్పటికి తొలి రెండేళ్లు పూర్తికాగానే కొద్దిమాసాల వ్యవధితో మేయర్‌గా ఉన్న బండ కార్తీకరెడ్డి దిగిపోగా, తర్వాత రెండేళ్లు పూర్తయ్యాక దిగిపోవాల్సిన మేయర్ మాజిద్‌హుస్సేన్ దిగిపోలేదు. తిరిగి ఎన్నికలు జరిగేంత వరకు దాదాపు మూడేళ్లు ఎంఐఎం మేయర్ అధికారంలో ఉన్నారు. ఈ అంశాల్ని ప్రస్తావిస్తూ రాజకీయాల్లో ఏదీ అసాధారణం కాదని, ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమని పలువురు భావిస్తున్నారు.

గగన్‌పహాడ్‌లో హాహాకారాలు



శంషాబాద్: పరిశ్రమల్లో కార్మికుల బతుకులు అగ్నికి ఆహుతవుతున్నాయి. రక్షణ చర్యలు తీసుకోవడంలో యజమానులు విఫలమవుతుండటంతో అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. సంబంధిత అధికారులు సైతం పరిశ్రమల వైపు తొంగి చూడకపోవడంతో దుర్ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. తాజాగా కరాచీ బేకరీ పరిశ్రమలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో పదిహేను మంది వలస కార్మికులు కాలిన గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. గగన్‌పహాడ్‌లోని కరాచీ పరిశ్రమలో గతేడాది అక్టోబరులో సైతం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. ఘటన జరిగింది రాత్రి వేళ కావడం.. పరిశ్రమలో ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. తాజాగా జరిగిన ఘటనను పరిశీలిస్తే పరిశ్రమలో ప్రమాదాలు చోటు చేసుకుంటే అత్యవసరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఒక్కటి కూడా లేకపోవడంతో కంపెనీని పరిశీలించిన పోలీసులు ఇతర అధికారులు అవాక్కయ్యారు. మంటలను ఆర్పివేసే చర్యలతో పాటు అత్యవసర ద్వారాలు కూడా లేవని గుర్తించారు. పరిశ్రమ బయటి నుంచి లోపలికి సరఫరా జరిగే గ్యాస్ పైపులైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. గ్యాస్ లీకేజీని ముందే గుర్తించి ఉంటే భారీ అగ్ని ప్రమాదం తప్పేదని కార్మిక సంక్షేమ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదాల కారణంగా వలస కార్మికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిశ్రమల్లో చోటు చేసుకుంటున్న ప్రమాదాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గ్యాస్ లీకేజీతో కరాచీ బేకరీలో మంటలు

- 15 మంది కార్మికులకు తీవ్ర గాయాలు
- విషమంగా ఐదుగురి పరిస్థితి
- కార్మికుల రక్షణ పట్టని పరిశ్రమలు
- తరచూ జరుగుతున్న అగ్ని ప్రమాదాలు

డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రికి తరలింపు

సంతోష్‌నగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి గగన్‌పహాడ్‌లోని కరాచీ బేకరీలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదం ఘటనలో గాయపడిన క్షతగాత్రులను కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రికి తరలించారు. శుభం, బలరాం, కమల్ కిషోర్, ధారాసింగ్, సుజిత్, సోను, ఆదిత్య కుమార్, ముకేశ్ కుమార్, సందీప్ కుమార్, ప్రమోద్ కుమార్, దీపక్ శుక్లా, ప్రదీప్ కుమార్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వైద్యులు తెలిపారు.

మరో టౌన్‌షిప్?

హెచ్‌ఎండీఏ చేతికి ఫార్మాసిటీ భూములు?

- పెద్ద సంఖ్యలో వెంచర్లు వెలిసే అవకాశం
- మెట్రో సిటీలు, ఐటీ అనుబంధ కంపెనీలు
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఔటర్ అవతల కొత్తగా మరో నగరం ఆవిష్కృతం కానుంది. ఇటు పల్లెలను.. అటు పట్టణాలను మిళితం చేస్తూ అత్యాధునిక టౌన్‌షిప్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు భూములు పెద్ద సంఖ్యలో ఉండటం కలిసి వచ్చే అంశం. ఐటీ అనుబంధ పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, రియల్ ఎస్టేట్ సంస్థలను ఇక్కడికి తరలించడం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల జీవనశైలి కూడా పూర్తిగా మారిపోయే అవకాశం లేకపోలేదు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం ప్రకటించిన విషయం విదితమే. ఫార్మాసిటీ పేరుతో ఇప్పటికే రైతుల నుంచి బలవంతంగా సేకరించిన భూములను హెచ్‌ఎండీఏ, హౌసింగ్ బోర్డులకు అప్పగించడం ద్వారా కాలుష్యకారక పరిశ్రమల భారీ నుంచి ఆయా గ్రామాల ప్రజలకు విముక్తి కల్పించడంతో పాటు హెచ్‌ఎండీఏ వేలంలో ప్రభుత్వ భూముల అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చవచ్చని యోచిస్తోంది.

రద్దు ప్రకటనతో సంబరాలు..

- ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న కాలుష్య కారక ఫార్మా కంపెనీలను శివారు ప్రాంతాలకు తరలించాలని అప్పటి ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటును ప్రతిపాదించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత భూ సేకరణ ప్రారంభించింది. యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని 10 గ్రామాల పరిధిలో మొత్తం 19,333 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఫార్మాకు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఇక్కడ 412 ఫార్మా కంపెనీలు, 173 బల్క్ డ్రగ్ యూనిట్లు నెలకొల్పాలని సంకల్పించింది. భూసేకరణ సమయంలో స్థానిక ప్రజల నుంచి పెద్దెత్తున్న నిరసన వ్యక్తమైంది. కొంత మంది స్వచ్ఛందంగా భూములు ఇస్తే.. మరికొంత మంది నిరాకరించారు. అసైన్డ్ భూములకు నష్ట పరిహారంగా రూ.12.5 లక్షలు, పట్టా భూములకు రూ.16 లక్షల చొప్పున మొత్తం రూ.600 కోట్ల వరకు ఖర్చు చేశారు.
- నష్ట పరిహారం తీసుకునేందుకు నిరాకరించి, కోర్టును ఆశ్రయించిన వారి డబ్బులను అథారిటీలో జమ చేశారు. ఇప్పటికే 90 శాతం భూసేకరణ పూర్తైంది. మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధమైంది. దరఖాస్తు చేసుకున్న కంపెనీలకు భూకేటాయింపు ప్రక్రియ కూడా ప్రారంభమైంది. అయితే.. తాము అధికారంలోకి వస్తే..ఫార్మాసిటీని రద్దు చేస్తామని, రైతుల నుంచి బలవంతంగా లాక్కొన్న భూములను తిరిగి వారికే అప్పగిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు హామీ ఇచ్చింది. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఫార్మాసిటీ స్థానంలో కొత్తగా అత్యాధునిక టౌన్‌షిప్‌లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కందుకూరు, యాచారం మండలాలకు చెందిన రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

మారనున్న రూపురేఖలు..

ఇప్పటికే నగరానికి పశ్చిమాన పెద్ద ఎత్తున ఐటీ అనుబంధ కంపెనీలు వచ్చి చేరాయి. భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక్కడ జనాభా కూడా విపరీతంగా పెరిగిపోయింది. సాధారణ, మధ్య తరగతి ప్రజలు సొంత ఇళ్లు కొనుక్కోలేని పరిస్థితి. శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట, మొయినాబాద్, శంకర్‌పల్లి, కొత్తూరు, షాబాద్ మండలాల్లో భారీగా భూములున్నప్పటికీ.. జంట జలాశయాల పరిరక్షణ పేరుతో ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలకు 111 జీఓ అడ్డంకిగా మారింది. ఈ జీఓ పరిధిలోని విలువైన భూములు కూడా ఇప్పటికే పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. నగరానికి తూర్పున (శ్రీశైలం, నాగార్జున సాగర్ జాతీయ రహదారుల మధ్యలో) వేలాది ఎకరాల అనువైన ప్రభుత్వ భూములున్నాయి. పట్టా భూముల ధరలు కూడా చాలా తక్కువ. కొత్తగా వచ్చే ఐటీ అనుబంధ పరిశ్రమలతో పాటు వ్యాపార, వాణిజ్య సంస్థలు, ఇంజినీరింగ్ ఇతర వృత్తివిద్యా కోర్సులకు సంబంధించిన కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులను ఇక్కడికి తరలించడం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల జీవనశైలిని మెరుగుపర్చడంతో పాటు గ్రేటర్‌పై ప్రస్తుతం ఉన్న రవాణా భారాన్ని కూడా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. హెచ్‌ఎండీఏ చేతికి ఫార్మా భూములు అప్పగిస్తే.. ఇప్పటికే ఈ ప్రాంతంలో పట్టా భూములు కొనుగోలు చేసి, వెంచర్లు ప్లాట్లు చేసిన వ్యాపారులు భూముల ధరలు తగ్గి, వ్యాపారులు నష్టపోయే ప్రమాదం లేకపోలేదు.

విద్యార్థినిపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసి విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.30వేలు జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... సరూర్‌నగర్‌కు చెందిన నాగరాజుకు అదే ప్రాంతానికి చెందిన 9వ తరగతి విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. పరిచయాన్ని అసరాగా తీసుకున్న అతను ప్రేమ, పెళ్లి పేరుతో బాలికను నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఈ విషయం తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె తల్లి సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన న్యాయ స్థానం గురువారం నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 30వేలు జరిమానా విధిస్తూ, బాధితురాలికి 10లక్షల పరిహారం ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన ఏపీపీ సునీత, ఎల్బీనగర్ ఏసీపీ జానకి రెడ్డి ఘనంగా సత్కరించారు.

'కొత్తకోట' స్టైలే వేరు!

నిబంధనల అమలు విషయంలో నో కాంప్రమైజ్

- అతిక్రమించిన వారిపై తనదైన 'పంథా' వినియోగం
- పని చేసిన కింది స్థాయి వారికీ అండగా నిలిచే నైజం
- 2003లో చోటు చేసుకున్న ఉదంతమే ఉదాహరణ



సాక్షి, సిటీబ్యూరో: పోలీసు ఉన్నతాధికారులకు... అందులోనూ ఐపీఎస్‌లకు ప్రధానంగా కొన్ని అంశాలు నచ్చవు. అవి వారికి తారసపడినప్పుడు తమదైన శైలిలో స్పందిస్తుంటారు. దీనికోసం కొన్ని సార్లు కింది స్థాయి వారి 'సేవలు' వినియోగించుకుంటారు. వీటికి సంబంధించి ఎలాంటి లిఖితపూర్వక ఆదేశాలు ఉండవు. ఆ చర్యతో ఏదైనా ఇబ్బంది కలిగితే మాత్రం 'సేవ' చేసిన వారికి వెన్నుదన్నుగా నిలిచి, వారిపై ఎలాంటి ప్రభావం లేకుండా చూసుకునే వాళ్లు పోలీసు విభాగంలో అత్యంత అరుదనే చెప్పాలి. అలాంటి వారిలో ఒకరు కొత్త కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి. ఆయన ఎస్పీ హోదాలో హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా పని చేస్తుండగా 2003లో జరిగిన ఓ సంఘటన దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

తల ఎగరేస్తే తాట తీస్తారు..

సర్వీసులో అడుగుపెట్టిన నాటి నుంచి ముక్కుసూటి వ్యక్తిగా పేరున్న కొత్తకోట శ్రీనివాసరెడ్డి కొన్ని అంశాలను ఏమాత్రం ఉపేక్షించరు. వాటిలో విధులు నిర్వర్తించే అధికారి ఎదుట తల ఎగరేయడం ప్రధానమైంది. ఎస్పీ హోదాలో ఆయన 2002–04 మధ్య రెండున్నరేళ్ళు ట్రాఫిక్ డీసీపీగా పని చేశారు. అదనపు డీసీపీ ఆపై స్థాయి అధికారులకు నైట్ డ్యూటీలు ఉంటాయి. ఈ డ్యూటీలో ఉన్న వారిని నైట్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్స్ (ఎన్ఎస్ఓ) అంటారు. ట్రాఫిక్ డీసీపీగా ఉన్న కొత్తకోట సైతం ఈ డ్యూటీలు చేసే వారు. ఎన్ఎస్ఓగా ఓ రోజు నగరంలోని సున్నిత ప్రాంతాల్లో సంచరిస్తుండగా.. ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో ఓ హోటల్ సమయం మించిపోయినా కార్యకలాపాలు సాగిస్తుండటం కంట పడింది.రాత్రి విధుల్లో ఉన్న స్థానిక ఠాణా ఎస్సైని పిలవాలని భావించారు.

గన్‌మెన్ తప్పుగా చెప్పడంతో...

ఆ హోటల్ ఏ ఠాణా పరిధిలోని వస్తుందంటూ తన గన్‌మెన్‌ను అడిగారు. అతడు పొరపాటుగా పొరుగున ఉన్న మరో ఠాణా పేరు చెప్పారు. వాకీటాకీ ద్వారా సమాచారం ఇచ్చిన కొత్తకోట సదరు ఠాణాలో రాత్రి విధులు నిర్వర్తిస్తున్న ఎస్సైని హోటల్ వద్దకు పిలిచారు. ఇలాంటి వాటిని పట్టించుకోవాలని, హోటల్ యజమానితో మాట్లాడి హోటల్ మూసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ ఎస్సై వెళ్లి హోటల్ యజమానితో మాట్లాడి మూయించే ప్రయత్నం చేశారు. ఆ యజమాని ఓ ఎమ్మెల్యేకి సన్నిహితుడు కావడంతో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సైకి దురుసుగా సమాధానం ఇచ్చారు. ఇది గమనించిన 'కొత్తకోట' విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. పోలీసు అధికారినీ పట్టించుకోని ఆ హోటల్ యజమానికి సదరు ఎస్సై ద్వారానే 'హితబోధ' చేయించారు.

అసెంబ్లీ వరకూ వ్యవహారం..

దీంతో హోటల్ యజమాని మరుసటి రోజు విషయాన్ని తనకు సన్నిహితుడైన ఎమ్మెల్యేకు చెప్పారు. అప్పట్లో అసెంబ్లీ సమావేశాలు నడుస్తుండటంతో ఆ ఎమ్మెల్యేతో పాటు అదే పార్టీకి చెందిన మరో ఆరుగురు శాసనసభలో లేవనెత్తారు. 'హితబోధ' చేసిన ఎస్సై పేరుతో పాటు కొత్తకోట పేరునూ ప్రస్తావిస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం కాస్త ఆలస్యంగా తెలిసిన ఎస్సై తీవ్ర ఆందోళనకు గురై శ్రీనివాసరెడ్డిని సంప్రదించారు. 'నీ డ్యూటీ నువ్వు చేశావు. ఎలాంటి ఆందోళన చెందకు నేనున్నా' అంటూ కొత్తకోట హామీ ఇచ్చారు. అసెంబ్లీ నుంచి ఈ విషయం అప్పటి పోలీసు కమిషనర్ ఎంవీ కృష్ణారావు వద్దకు చేరింది. ఏడుగురు ఎమ్మెల్యేలు ఆయన వద్దే ఉండగా.. వెళ్లిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి జరిగిన విషయం వారికి వివరించారు. సదరు ఎస్సై ఎక్కడకు రావాల్సిన పని లేకుండా, సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేకుండా సమస్యను పరిష్కరించారు. ఇలాంటి ఉదాహరణలు ఆయన వృత్తి జీవితంలో ఎన్నో ఉన్నాయని సన్నిహితులు చెబుతుంటారు.

రూ.కోటి విలువైన గంజాయి పట్టివేత

- హైదరాబాద్ మీదుగా ఒరిస్సా సరిహద్దు నుంచి యూపీకి సరఫరా
- పోలీసుల తనిఖీలకు చిక్కకుండా కొత్త ఎత్తుగడలు
- ఇతర వాహనం ఫాస్ట్‌ట్యాగ్ వినియోగిస్తూ పరారీ
- ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఉత్తర్ ప్రదేశ్‌లోని మీరట్‌కు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.కోటి విలువ చేసే 360 కిలోల గంజాయితో పాటు కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) డీసీపీ కే మురళీధర్‌తో కలిసి రాచకొండ కమిషనర్ జీ సుధీర్ బాబు గురువారం వివరాలు వెల్లడించారు. యూపీకి చెందిన వికాస్ త్యాగీ, అక్బర్, ఎండీ అమీరుద్దీన్ స్నేహితులు. వీరికి యూపీలోని ఘజియాబాద్‌కు చెందిన ఓ గంజాయి పెడ్లర్‌తో పరిచయం ఏర్పడింది. ఏజెన్సీ ప్రాంతం నుంచి యూపీకి గంజాయిని సరఫరా చేస్తే కమీషన్ ఇస్తానని పెడ్లర్ ఆశ చూపించాడు. దీంతో ముగ్గురు కలిసి మహీంద్రా ఎక్స్‌యూవీ కారులో రాజమండ్రికి వెళ్లారు. అక్కడ గంజాయి విక్రయదారుడి నుంచి 360 కిలోల సరుకు కొనుగోలు చేసి ఒక్కో ప్యాకెట్ 5 కిలోల చొప్పున ప్యాకింగ్ చేసి వాహనంలో భద్రపరిచారు. హైదరాబాద్ మీదుగా యూపీకి తిరుగు ప్రయాణమయ్యారు. దీనిపై సమాచారం అందడంతో ఎల్బీనగర్ ఎస్ఓటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అబ్దుల్లాపూర్‌మెట్ ఔటర్ రింగ్ రోడ్‌లోని సంపూర్ణ హోటల్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

ఫాస్ట్ ట్యాగ్ మార్చి..

చెక్‌పోస్టులు, టోల్‌గేట్ల వద్ద పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు నిందితులు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. టోల్‌ప్లాజా వద్దకు చేరుకునే ముందు నిందితులలో ఒకరు వాహనం దిగి.. టోల్ వద్ద పోలీసుల తనిఖీలు ఉన్నాయా లేవా అని నిర్ధారించుకున్న తర్వాత వాహనంలోని వ్యక్తులకు సమాచారం ఇస్తారు. టోల్‌ప్లాజాలో వాహనం నంబరు రికార్డు కాకుండా ఇతర వాహనం ఫాస్ట్ ట్యాగ్‌ను వినియోగిస్తున్నారు. ఇదే తరహాలో గతంలో మూడుసార్లు యూపీకి గంజాయిని తరలించినట్లు ప్రాథమిక విచారణలో నిందితులు వెల్లడించారు.

వావ్.. వేవ్!

- 36 అంతస్తుల హైరైజ్ ప్రాజెక్ట్
- 19వ అంతస్తులో స్కై బ్రిడ్జ్
- ప్రారంభించిన రాఘవ సంస్థ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ రాఘవ మరో అద్భుతమైన ప్రాజెక్ట్‌తో నగరవాసుల ముందుకొచ్చింది. కొల్లూరులో 8.27 ఎకరాలలో వేవ్ పేరుతో లగ్జరీ హైరైజ్ అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు గురువారం ప్రాజెక్ట్‌ను లాంచ్ చేశారు. 4 టవర్లు.. ఒక్కోటి 36 అంతస్తుల్లో ఉంటుంది. 19వ అంతస్తులో స్కై బ్రిడ్జ్ ఏర్పాటు ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత. దీంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సిటీ వ్యూ కనిపిస్తుంటుంది. 1,660 నుంచి 1,930 చదరపు అడుగుల మధ్య 3 బీహెచ్‌కే ఫ్లాట్ల విస్తీర్ణాలుంటాయి. జీ+4 అంతస్తులలో క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి అన్ని రకాల అత్యాధునిక వసతులుంటాయి.

30 సబ్ కమిటీలతో నుమాయిష్ నిర్వహణ ఏర్పాట్లు


వనం సత్యేందర్

అబిడ్స్: 83వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) నిర్వహణ కోసం 30 సబ్ కమిటీలతో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్యేందర్ తెలిపారు. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు 46 రోజుల పాటు నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కొనసాగే నుమాయిష్‌కు రాష్ట్రంలోనే కాక దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వివిధ ఉత్పత్తుల తయారీదారులు స్టాళ్లను ఏర్పాటు చేస్తారన్నారు. జనవరి 1న ప్రారంభంకానున్న ఈ ప్రదర్శనలో దాదాపు 2400 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..... స్టాళ్ల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయన్నారు. 30 మంది సబ్ కమిటీలు ఎగ్జిబిషన్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయన్నారు. దాదాపు 25 లక్షల మంది ఎగ్జిబిషన్‌ను సందర్శించవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాలకు చెందిన విద్యుత్, అటవీ శాఖ, పాడుపు సంఘాలు, జైళ్ల శాఖ, ఇరిగేషన్, కార్మికశాఖలతో పాటు పలు శాఖల స్టాళ్లను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పటిష్టమైన భద్రత కోసం పోలీసులతో పాటు వలంటీర్లు, ఇంటర్నల్ సెక్యూరిటీ, వాచ్ అండ్ వార్డు సభ్యులను నియమిస్తున్నామన్నారు. ఎగ్జిబిషన్ నుంచి వచ్చే ఆదాయంతో నగరంతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 20 విద్యాసంస్థలను నడుపుతున్నామని, ఆయా విద్యాసంస్థల్లో 30 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు ఆయన వివరించారు. ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకుల కోసం మెట్రోరైల్‌తో పాటు ఆర్టీసీ స్పెషల్ బస్సులను ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ప్రారంభానికి ముందే దాదాపు స్టాళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

మరో తటాకం మాయం!

- ఇటు హయత్‌నగర్, అటు అబ్దుల్లాపూర్‌మెట్
- రెండు మండలాలకు సరిహద్దులో హత్తికుంట
- సర్వే నంబర్ 19లో 8.23 ఎకరాలు.. మిగిలింది అర ఎకరమే



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ''ఇది హత్తిగూడ చెరువు. దీనికి ఒక వైపు హయత్‌నగర్, మరో వైపు అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలు విస్తరించి ఉన్నాయి. రెండు మండలాల సరిహద్దు గ్రామమైన ఈ హత్తిగూడ 19 సర్వే నంబర్‌లోని 8.23 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో 2 ఎకరాలు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కేటాయించగా, మిగిలిన 6.23 ఎకరాల విస్తీర్ణంలో కుంట ఉంది. చెరువును ఆనుకుని హయత్‌నగర్ మండలం సర్వే నంబర్ 98, 99 పట్టా భూములు ఉన్నాయి. ఎఫ్‌టీఎల్ భూముల్లో ఇప్పటికే వెంచర్ చేశారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు దానిలో మట్టిని నింపి...చెరువు ఆనవాళ్లు లేకుండా చేశారు. చెరువులోకి నీరు చేరకుండా కల్వర్టును మూసివేయడంతో ఆ పక్కనే ఉన్న కాలనీలు తరచూ నీట మునుగుతున్నాయి. ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులు గతంలో సర్వే చేసి, చెరువుకు హద్దులు నిర్ణయించినప్పటికీ..ఆ తర్వాత వచ్చిన అధికారులు దానిని పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం ఆ చెరువు పూర్తిగా కనుమరుగైంది''

''ఇదీ ఐటీకారిడార్‌లోని గౌలిదొడ్డిలో ఉన్న ఈద్గవానికుంట. సర్వే నంబర్ 71లో 5.30 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో ఇరిగేషన్‌శాఖతో పాటు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో కుంటకు రీస్టోరేషన్, సుందరీ కరణ పనులు చేపట్టారు.అయితే ఈ కుంటకు మరోవైపు(గోపన్‌పల్లి)ఆనుకుని సర్వే నంబర్లు 71/1, 72/2లలో శిఖం పట్టా భూములు ఉన్నాయి. వీరు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న పట్టా భూములతో పాటు కుంటను కూడా పూర్తిగా పూడ్చివేశారు. పూడ్చివేతను తొలగించేందుకు రూ.1.84 కోట్లు హుస్సేన్ సాగర్ లేక్ డివిజన్ ఈఈ పట్టాదారులకు నోటీసులు జారీ చేశారు. కానీ ఇప్పటికీ వ్యర్థాల తొలగింపు మొదలు కాలేదు''

కబ్జాదారుల చెరలో నీటివనరులు:

జిల్లాలో చిన్నా, పెద్ద అన్నీ కలిపి 2,132 చెరువులు, కుంటలు ఉండగా, వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. మెజార్టీ చెరువులు, కుంటలు నగరానికి ఆనుకుని ఔటర్ రింగ్‌రోడ్డుకు అటు ఇటుగా విస్తరించి ఉన్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయానికి తోడు ఐటీ పెట్టుబడులు వెల్లువెత్తుతుండటంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఫలితంగా కబ్జాదారుల కళ్లు చెరువులు, కుంటలపై పడ్డాయి. ఎఫ్‌టీఎల్, శిఖం పట్టా భూములను కొనుగోలు చేసి, వాటికి ఆనుకుని ప్రభుత్వ భూముల్లో విస్తరించి ఉన్న చెరువులు, కుంటలను కబ్జా పెట్టారు. ఫలితంగా ఒకప్పుడు నిత్యం నీటితో కళకళలాడిన ఆయా జలవనరులు ప్రస్తుతం కబ్జాదారుల చెరల్లో చిక్కి వట్టిపోయాయి. బహుళ అంతస్తుల భవనాలకు నెలవైయ్యాయి. నిర్మాణ వ్యర్థాలు, భారీ బండరాళ్లను తెచ్చి వాటిని పూడ్చి వేయడంతో చిన్న పాటి వర్షానికే వరదలు సమీప కాలనీలను ము ంచెత్తుతున్నాయి. చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినా..వాటిని కాపాడలేక పోతున్నాయి.

హత్తిగూడ చెరువు ఎఫ్‌టీఎల్ హద్దుల ఏర్పాటు



మన్సూరాబాద్: అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండల రెవెన్యూ అధికారులు హత్తిగూడ చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను గురువారం ఏర్పాటు చేశారు. హత్తిగూడ చెరువు కబ్జాకు గురవుతున్నదనే ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారులు స్పందించి హద్దులు ఏర్పాటు చేశారు. బఫర్ జోన్ ప్రాంతంలో జేసీబీ సహాయంతో ట్రెంచ్ తవ్వించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మోహన్ మృతదేహం

గన్‌ఫౌండ్రీ: ప్రేమికుల మధ్య తలెత్తిన వివాదం ప్రియుడి ఆత్మహత్యకు దారితీసిన సంఘటన గురువారం బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బేగంబజార్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన ఎం.మోహన్ (19)క్యాబ్ డ్రైవర్‌గా పని చేసేవాడు. అదే గ్రామానికి చెందిన యువతి కింగ్‌కోఠిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తోంది. వీరి ఇద్దరి మధ్య ఏర్పడిన స్నేహం ప్రేమకు దారితీసింది. ఇరు కుటుంబాల పెద్దలు పెళ్లికి అంగీకరించారు. ఈ నేపథ్యంలో మోహన్ ప్రియురాలిని తీసుకుని బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదాబ్ లాడ్జికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో సదరు యువతి కోపంతో గది నుంచి బయటికి వచ్చి రిసెప్షన్‌లో కూర్చుంది. దీంతో మోహన్ పలుమార్లు ఆమెను లోపలికి రావాలని బతిమాలినా రాకపోవడంతో మనస్తాపానికిలోనైన ఆతను గదిలోకి వెళ్లి ప్రియురాలి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత గదిలోకి వచ్చిన యువతి మోహన్‌ను చూసి లాడ్జి సిబ్బందికి సమాచారం అందించింది. వారు అతడిని కిందకు దించి కామినేని ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బేగంబజార్ సీఐ శంకర్ తెలిపారు.

అమలు సాధ్యం కాని హామీలు ప్రమాదకరం



పోల్కంపల్లి లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ జయప్రకాష్ నారాయణ, చిత్రంలో రజనీకాంత్

నాంపల్లి: ప్రజలకు అర్థం కాని ప్రజాస్వామ్యాన్ని ఈ దేశంలో జనంపై రుద్దారని, ఎన్నికల వ్యవస్థ దేశ ప్రజలకు పనికి వచ్చేది కాదని లోక్‌సత్తా కన్వీనర్ డాక్టర్ జయ ప్రకాష్ నారాయణ అన్నారు. రాజనీతి స్ట్రాటజీస్ (రాప్స్) సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో నిర్వహించిన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో డాక్టర్ జయప్రకాష్ నారాయణ మాట్లాడారు. రాజకీయాల్లో ఎన్నో నిరాశలు ఉన్నా... కొన్ని సానుకూల అంశాలు కూడా ఉన్నాయని, వాటివల్లే దేశంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ అభివృద్ధి రేటు ఇదే స్థాయిలో కొనసాగితే రానున్న 15 ఏళ్లలో అందరి జీవితాల్లో ఆర్థిక సుస్థిరత వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు మరో రెండు ప్రధాన హామీలు కూడా ఉన్నాయన్నారు. అందులో ఒకటి రుణమాఫీ కాగా మరొకటి దళిత బంధుగా పేర్కొన్నారు. ఎనిమిది గ్యారంటీల అమలుతో అదనంగా ఏటా రూ.1.2 లక్షల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఆరు గ్యారంటీలు ఎట్టి పరిస్థితుల్లో అమలయ్యే పరిస్థితి లేదన్నారు. సంక్షేమం అవసరమే అయినా అభివృద్ధిని మింగేసే సంక్షేమం దేశానికి, రాష్ట్రానికి ప్రమాదకరమని జనపక్షం వ్యవస్థాపకులు రజనీకాంత్ అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలే ఎక్కువ అనుకుంటే కాంగ్రెస్ పార్టీ అంతకు మించిన ఉచిత సంక్షేమ పథకాలు ప్రకటించి అధికారంలోకి వచ్చిందని, అవి నెరవేరే అవకాశం లేదన్నారు. ఇలాంటి అలవి కాని హామీల కారణంగా ప్రజాస్వామ్యం, ప్రజల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. రాజకీయాల్లో సంస్కరణలు, జనజీవన ప్రమాణాలు పెంపు కోసం జనపక్షం ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రధానిని ప్రత్యక్షంగా ఎన్నుకోవడం, ఎమ్మెల్యే, ఎంపీలు రెండుసార్లు కంటే ఎక్కువ పోటీ చేయరాదని, అధికార వికేంద్రీకరణ తదితర లక్ష్యాలతో ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను గ్రామానికి పది మంది చొప్పున నాయకులను తయారు చేయనున్నట్లు తెలిపారు. కేంద్రం లక్ష్యంగా, వ్యవస్థలో రాజ్యాంగ సవరణల ద్వారా మార్పు తెచ్చే దిశగా తమ పోరాటం ఉంటుందన్నారు. సమావేశానికి రెండు రాష్ట్రాల రాజనీతి స్ట్రాటజీస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఉద్యోగులు పాల్గొన్నారు. రాజనీతి స్ట్రాటజీస్ సహ వ్యవస్థాపకులు జగన్, తేజస్వి, సుచిరిండియా కిరణ్, ఐటీ సంస్థల ప్రతినిధులు పోల్కంపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు.


అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఎంఐఎం శాసనసభ్యులు


శాసనసభ ప్రవేశ ద్వారం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ప్రకాష్ గౌడ్, కేపీ వివేకానంద్, మర్రి రాజశేఖర్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి తదితరులు

లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం!

• ఓటరు నమోదుకు మరో అవకాశం • జనవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు • ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితా విడుదల

పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్నికల సంఘం ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) 2024 ప్రణాళిక విడుదల చేసింది. నమోదు, సవరణలకు అర్హులైన వారందరూ జనవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొంది.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ, ఖైరతాబాద్ అసెంబ్లీ ఎన్నికల అధికారిణి ప్రశాంతి

బంజారాహిల్స్: ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో అవకాశం కల్పించినట్లు ఖైరతాబాద్ అసెంబ్లీ ఎన్నికల ఆధికారిణి, జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి వెల్లడించారు. మంగళవారం జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఫిబ్రవరి 8న ప్రకటించే తుది జాబితాలో ఓటరుకు మరోసారి చోటు దక్కనుంది.

- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో అసెంబ్లీ ఎన్నికల అధికారులు కొత్త ఓటరు జాబితాపై దృష్టిసారించి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు.
- అప్పుడే పార్లమెంటు ఎన్నికల సందడి జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో కనిపిస్తున్నది. గడిచిన మూడు రోజుల నుంచి సంబంధిత అధికారులు కొత్త ఓటరు జాబితాపై కసరత్తు చేస్తున్నారు.
- 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చు.
- ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో కాకుండా వేర్వేరు చోట్ల ఓటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడితే అందరి ఓటు ఒకే చోట మార్చుకునే అవకాశం కూడా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కల్పించారు.
- నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు చాలా మంది ఓటర్లు ఇబ్బందులు పడిన నేపథ్యంలో ఒకే చోట కుటుంబ సభ్యులు అందరూ కలిసి వెళ్లి ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోనున్నారు.
- 18 ఏళ్లు నిండిన వారందరూ ఆన్‌లైన్‌లోకానీ, స్థానిక బీఎల్‌వో వద్దకు వెళ్లి ఫారం-6 నింపి వివరాలు అందజేయాలి.

జనవరి 6న ముసాయిదా ఓటరు జాబితా

- ఫొటో మార్పిడి, పేర్లలో తప్పులు, పుట్టిన తేదీ వివరాలు సరిచేసుకోవడం, పోలింగ్ కేంద్రం మార్చుకోవడానికి ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వీటిని పరిశీలించి జనవరి 6న ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. జనవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు ప్రకటించిన ముసాయిదాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తారు.
- శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు కూడా కొనసాగిస్తారు. వచ్చిన అభ్యంతరాలు, దరఖాస్తులను ఫిబ్రవరి 2 వరకు పరిశీలించి పరిష్కరిస్తారు.
- ఫిబ్రవరి 8న తుది జాబితా వెల్లడించనున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయనున్నారు.
- బీఎల్‌వోలు ఓటరు జాబితాలో చనిపోయిన వారి, రెండు చోట్ల ఓటు ఉన్న వారిని గుర్తించాలని అధికారులు మరోసారి ఆదేశించారు.
- ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో వినియోగించిన ఓటరు జాబితాలో మృతి చెందిన ఓటర్ల వివరాలు అలాగే ఉండటమే కాకుండా రెండు మూడు చోట్ల ఓటు ఉన్నట్లుగా తేలింది.

జూబ్లీహిల్స్ ఓటర్లు 3,85,265

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,85,265 మంది ఉన్నారు. పురుషులు 2,02,308, మహిళలు 1,82,937, ఇతరులు 20 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు.

ఖైరతాబాద్‌లో 2,96,014 మంది ఓటర్లు

ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,96,014 కాగా ఇందులో పురుషులు 1,53,968, మహిళలు 1,42,011, ఇతరులు 35 మంది ఉన్నారు. నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో తాజా ఓటరు జాబితా ఇదే కాగా ఇప్పుడు మరోసారి ఓటు హక్కు పొందేందుకు అవకాశం కల్పించారు.

అసెంబ్లీ స్పీకర్‌కు అభినందన



బంజారాహిల్స్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ కార్యవర్గం ఘనంగా సత్కరించింది. ఎఫ్ఎన్‌సీసీ సభ్యుడు అయిన ప్రసాద్ కుమార్ ఈ అత్యున్నత పదవికి ఎంపిక కావడంపట్ల సభ్యులు, కార్యవర్గం ఆనందం వ్యక్తం చేశారు. నిజాయితీపరుడైన ప్రసాద్ కుమార్ ఈ పదవితో మరింత సేవా కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. ఎన్నో ఏళ్లుగా ఎఫ్ఎన్‌సీసీతో తనకు అనుబంధం ఉందని ప్రసాద్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు ఆదిశేషగిరిరావు, సెక్రటరీ ముళ్లపూడి మోహన్, కాజా సూర్యనారాయణ, పెద్దిరాజు, ఇంద్రపాల్‌రెడ్డి, ఎ. గోపాల్ రావు, ఐ.వి.సోమరాజు తదితరులు ఉన్నారు.

ప్రముఖ నిర్మాత డీవీఎస్ రాజుకు ఘనంగా నివాళి



నివాళులర్పిస్తున్న మురళీమోహన్ తదితరులు

బంజారాహిల్స్: ప్రముఖ నిర్మాత, ఎఫ్ఎన్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత డీవీఎస్ రాజు 96వ జయంతి వేడుకలు ఎఫ్ఎన్‌సీసీలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నటుడు, నిర్మాత మురళీ మోహన్ డీవీఎస్.రాజు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఫిలింనగర్‌సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, నిర్మాతలు సి. కల్యాణ్, కె.ఎస్.రామారావు, జి. ఆదిశేషగిరిరావు, సెక్రటరీ ముళ్లపూడి మోహన్, డీవీఎస్ రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా గురువారం ప్రమాణ స్వీకారం చేసిన గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీలో అభినందిస్తున్న ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్‌లు

17 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అద్దంకి తిరుమల శ్రీకాంతాచార్యులు వెల్లడించారు. ఇందులో భాగంగా తిరుప్పావై ప్రవచనాలు, స్వామివారి ఆరాధన, తిరుప్పావై సేవాకాలం ఉంటాయన్నారు. రోజూ సాయంత్రం శ్రీ విష్ణుసహస్ర నామ స్తోత్రపారాయణం, గోవింద నామాలు, వేదపారాయణం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 23న తెల్లవారుజామున 4 గంటలకు వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారదర్శనం ఉంటుందని జనవరి 12న శ్రీ శ్రీనివాస కల్యాణం, శ్రీ గోదారంగనాథ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. వచ్చే నెల 14న భోగి, 15న మకర సంక్రాంతి వేడుకలు కూడా ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నామని భక్తులకు సకల ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు.

ఉప ముఖ్యమంత్రికి సన్మానం



లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ సారథ్యంలోని ప్రతినిధి బృందం అభినందించింది. గురువారం శ్రీకృష్ణ శాలువా పుష్పగుచ్ఛాలతో ఆత్మీయ సత్కారం చేశారు. ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రిగా ఉప ముఖ్యమంత్రిగా విశిష్ట సేవలు అందిస్తారని వ్యక్తం చేశారు. మాలమహానాడు నాయకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్‌లో నిర్మాణంలో ఉన్న మంచినీటి పైప్‌లైన్ పనులను గురువారం వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పరిశీలించారు. ఇప్పటికే ఇక్కడ సీవరేజీ పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయని త్వరితగతిన మంచినీటి పైప్‌లైన్ పనులు కూడా పూర్తి చేయాలని సూచించారు. పర్యటనలో జలమండలి మేనేజర్ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హుక్కా సెంటర్‌పై దాడి: సామగ్రి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న హుక్కా సామగ్రిని పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లోని ప్లాట్ నెం. 806 అస్మా ఎస్టేట్స్ టెర్రస్‌పై పది రోజుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న హుక్కా పార్లర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున హుక్కా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు పక్కా పథకంతో హుక్కా కేంద్రం కొనసాగుతున్న టెర్రస్‌పైకి చేరుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ 60 మందికిపైగా యువతీయువకులు హుక్కా పీలుస్తుండగా వీరందరినీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హైకోర్టు ఆర్డర్ ఉందంటూ కొంత కాలంగా ప్రధాన నిందితుడు జీషన్ అహ్మద్ అలియాస్ జీషన్(38) నిబంధనలు ఉల్లంఘించి హుక్కా సెంటర్ నడుపుతున్నాడు. హైదరాబాద్ టైమ్స్ కేఫ్ పేరుతో జీషన్ ఈ హుక్కా సెంటర్‌ను నడుపుతుండగా పోలీసులకు సమాచారం అందింది. దాడి చేసిన సమయంలో జీషన్‌తో పాటు ఆర్గనైజింగ్ మేనేజర్ రియాజ్ పరారయ్యాడు. ఫుడ్ సర్వీస్ మేనేజర్ పురానం సాయికృష్ణ చైతన్య, లిఫ్ట్ ఆపరేటర్ రౌత్ సాయి భరత్ ఫుడ్ సర్వీసింగ్ ఆర్డర్లీ జనార్దన్, హుక్కా సరఫరా చేస్తున్న షాబుద్దీన్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 28 హుక్కా పాట్స్, 30 హుక్కా పైపులు, 150 హుక్కా ఫిల్లర్లను స్వాధీనం చేసుకున్నారు. తెలిసిన వినియోగదారులను రప్పిస్తూ హుక్కా సరఫరా చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. జూబ్లీహిల్స్ ఎస్ఐ ఎంఎం. రాకేష్ ఈ సోదాలు నిర్వహించగా పోలీసులను వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్, ఏసీపీ హరిప్రసాద్ అభినందించారు.

సామాజిక సేవా రంగంలో బీబీజీకి ప్రశంసలు



అవార్డుతో బీబీజీ ప్రతినిధులు

బంజారాహిల్స్: చదువు ద్వారా బాలికలకు సాధికారత కల్పించాలన్న బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ నిబద్ధతకు గుర్తింపుగా బెస్ట్ గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్-ఇనిషియేటివ్ ఆఫ్ ద ఇయర్ అనే ప్రతిష్టాత్మక అవార్డుతో సత్కరించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులను గుర్తించడానికి తెలంగాణ బిజినెస్ అవార్డ్స్ సంస్థ ఈ అవార్డును అందించింది. అవార్డు అందుకున్న సందర్భంగా సంస్థ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ... 2019లో లాభాపేక్ష లేని సంస్థ స్థాపించి గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్యను విప్లవాత్మకంగా మార్చడానికి అంకితం చేశారన్నారు. తమ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కడం బాధ్యతను మరింత పెంచిందన్నారు. బీబీజీ బంగారుతల్లి పథకం ద్వారా 2040 నాటికి 20 లక్షల మంది బాలికలకు సాధికారత కల్పించాలనే ఉద్దేశంతో ముందుకు నడుస్తున్నామన్నారు.

పని చేస్తున్న సంస్థకే కుచ్చుటోపీ: ఏఎంపై చీటింగ్ కేసు

బంజారాహిల్స్: పని చేస్తున్న సంస్థకే కుచ్చుటోపీ పెట్టిన ఉద్యోగిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడలో లక్ష్మీ హుందాయ్ యూసుఫ్‌గూడ బ్రాంచీలో కొంత కాలంగా తేజావత్ నరేష్ అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. విలువైన ఆటోమొబైల్ స్పేర్‌పార్ట్స్‌ను తప్పుడు లెక్కలు చూపి హయత్‌నగర్‌కు పంపించినట్లుగా చూపించాడు. అయితే ఇటీవల నిర్వహించిన సంస్థ ఆడిట్‌లో రూ. 11.48 లక్షలు ఫ్రాడ్ జరిగినట్లుగా గుర్తించారు. ఇదే విషయాన్ని గత నెల 28న నరేష్‌ను ప్రశ్నించారు. ఈ నెల 6వ తేదీన మరోసారి ఈ మోసంపై నిలదీయగా అప్పటి నుంచి నరేష్‌తో పాటు ఆయనతో పని చేస్తున్న పి.జంగయ్య, ధనూరి రాజు కూడా విధులకు హాజరుకావడం లేదు. పథకం ప్రకారం విలువైన స్పేర్‌పార్ట్స్‌ను పక్కదోవపట్టించి రూ. 11.48 లక్షల మేర మోసం చేసిన నరేష్‌పై చర్యలు తీసుకోవాలంటూ లక్ష్మీ హుందాయ్ సర్వీస్ మేనేజర్ కేతరి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నరేష్‌పై ఐపీసీ సెక్షన 408, 420 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో మోసం: యువకుడిపై అట్రాసిటీ కేసు

బంజారాహిల్స్: పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్‌నగర్‌కు చెందిన యువతి(21) ఏడు నెలల క్రితం అదే ప్రాంతంలో అనపల్లి అవినాష్ రెడ్డి అనే యువకుడితో పరిచయంతో బోరబండ నర్సింహస్వామి ఆలయంలో పెళ్లి చేసుకుంది. వీరిద్దరూ ఎల్ఎన్‌నగర్‌లో గది అద్దెకు తీసుకొని ఉంటుండగా ఇటీవల కాలంలో అవినాష్‌రెడ్డి భార్యను తీవ్రంగా వేధించసాగాడు. రోజూ కొడుతుండేవాడు. చంపేస్తానని బెదిరిస్తుండేవాడు. తనను వదిలి ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని తాను మరో యువతిని పెళ్లి చేసుకుంటానని ఆమెను వదిలించుకోవడానికి ప్రయత్నిస్తూ కులం పేరుతో దూషిస్తూ అవమానిస్తున్నాడు. ఇదే విషయాన్ని అవినాష్‌రెడ్డి సోదరుని దృష్టికి తీసుకెళ్లగా తమకు ఆయనతో ఎలాంటి సంబంధం లేదని ఇప్పటికే ముగ్గురు యువతులు అవినాష్ వల్ల గర్భందాల్చారని చెప్పడంతో తాను మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 498(ఏ), అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటికలోనూ వ్యర్థాల డంపింగ్



శ్మశాన వాటికలో కుప్పలుగా పోసిన నిర్మాణ వ్యర్థాలు

ఫిలింనగర్: ఫిలింనగర్ కొత్త చెరువు పక్కన ఉన్న శ్మశానవాటికలో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా డంపింగ్ చేస్తున్నారు. గడచిన ఏడాదిగా ఈ శ్మశానవాటికలో ఇదే తంతు కొనసాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. శ్మశాన వాటిక ప్రహరీ కూలిపోవడంతో ఈ అక్రమ డంపింగ్‌లు జరుగుతున్నాయని సంబంధిత అధికారులు స్పందించి వెంటనే శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు ధైర్యంగా స్టేజీపై మాట్లాడే పోటీలు



స్పీక్ విత్ కాన్ఫిడెన్స్ కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యార్థులు

వెంకటేశ్వరకాలనీ: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, స్టేజి భయం లేకుండా చూడటమే లక్ష్యంగా బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని నందినగర్ ఖుష్బూ విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులకు గురువారం బస్తీలోని కమ్యూనిటీ హాల్‌లో స్పీక్ విత్ కాన్ఫిడెన్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. 1-5వ తరగతుల విద్యార్థులు వివిధ అంశాల మీద ప్రసంగాలు చేశారు. ధైర్యంగా ఏ అంశంపైన అయినా మాట్లాడేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌దేవి తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమకు నచ్చిన అంశాలను ఏ మాత్రం భయంలేకుండా ప్రసంగించి ఆహూతులను ఆకట్టుకున్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు నలుగురిలో ధైర్యంగా మాట్లాడగలుగుతారని వారు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంకర్‌లాల్



నియామకపత్రాన్ని అందుకుంటున్న శంకర్‌లాల్

హిమాయత్‌నగర్: ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోకు ఆకర్షితుడైన టీఆర్ఎస్‌కేవీ ఆటో యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శంకర్‌లాల్ తన పదవికి రాజీనామా చేసి ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్‌లో చేరారని రమావత్ శంకర్‌లాల్ తెలిపారు. గురువారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్ ఆయనకు కండువా కప్పి ఐఎన్‌టీయూసీలోకి ఆహ్వానించారు. శంకర్‌లాల్‌ను ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం శంకర్‌లాల్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. యూనియన్ నాయకులు భాస్కర్ రెడ్డి, విజయ్‌కుమార్, ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోద మల్లేష్ గౌడ్, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక విధానాలతో యునానీ మందులు తయారు చేయాలి: డాక్టర్ సెల్వమూర్తి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సెల్వమూర్తి తదితరులు

వెంగళరావునగర్: మారుతున్న సమాజంలో అధునాతన సాంకేతిక విద్యను, పరిజ్ఞానాన్ని జోడిస్తూ యునానీ మందులను తయారు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చత్తీస్‌గఢ్ అమిటీ యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ డబ్ల్యూ. సెల్వమూర్తి తెలిపారు. ఎర్రగడ్డ సీసీఆర్‌యూఎం (యునానీ కేంద్రీయ విద్యాలయంలో) గురువారం యునానీ మెడిసిన్‌లో ఇన్నోవేషన్, డిజైన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్‌లపై జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సెల్వమూర్తి మాట్లాడుతూ... యునానీ వైద్యాన్ని దేశంలోని ప్రజలందరికీ అందుబాటులోనికి తీసుకురావాలన్నదే ప్రధాన ఉద్దేశంగా సెమినార్‌ను నిర్వహించామన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్‌లు ఈ సందర్భంగా అవగాహన కుదుర్చుకున్నట్టు వెల్లడించారు. ఎంఓయూలు పరిశోధనా ప్రయత్నాలను బలోపేతం చేయడంలో, ఆరోగ్య సవాళ్లకు వినూత్న పరిష్కారాలను కనుగొనడంలో సహాయ పడతాయని చెప్పారు. ఈ మేరకు మానవునికి దీర్ఘకాలిక వ్యాధి అయిన బొల్లిని సమూలంగా తొలగించడంలో యునానీ మెడిసిన్ ఏ విధంగా ఉపయోగపడిందనే విషయాన్ని క్షేత్రస్థాయిలో ఉదాహరణల ద్వారా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. అంతకుముందు యునానీ మెడిసిన్ ఉపయోగాలు తెలియజేసే పుస్తకాన్ని, సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యునానీ కేంద్రీయ విద్యాలయం ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ యూనిస్ ఇఫ్తికార్ మున్షి, డాక్టర్ ఖమర్ ఉద్దీన డాక్టర్ మహ్మద్ నవాబ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజైన్ (ఐఐటీ-ఢిల్లీ) ప్రతినిధి హర్షిత్ జైన్, నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ ఎస్.గ్లోరీ స్వరూప, ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీకాంత్ శర్మ, కె.సూర్యప్రకాశ్, డాక్టర్ గజాలా జావెద్, శరత్ ముత్యాల తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని గౌతంనగర్ బస్తీలో భవన నిర్మాణ కార్మికుల లేబర్ కార్డు ఉన్న సభ్యులను గురువారం ప్రభుత్వ ఆస్పత్రుల ల్యాబ్ టెక్నీషియన్లు పరీక్షలు నిర్వహించారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆస్పత్రికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్లు జ్యోతి, ఖలేద ఇక్కడున్న సుమారు 50 మంది మహిళలకు రక్తపరీక్షలు నిర్వహించారు. మూడు రోజుల్లో ఈ పరీక్షల రిపోర్టులు వస్తాయని వాటికి అనుగుణంగా సంబంధిత ఆస్పత్రులకు సిఫారసులు చేస్తారని అవసరమైన వారికి మందులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి పరీక్షల నిమిత్తం రక్త నమూనాలను సేకరించారు.

తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

పంజగుట్ట: శబరిమలలో తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులు మంచినీరు, ఆహారం, వైద్య సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేరళ ప్రభుత్వంతో మాట్లాడి అయ్యప్ప భక్తులను కాపాడాలని కోరారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్లు ఎన్.బుచ్చిరెడ్డి గురుస్వామి, బాలకృష్ణ గురుస్వామి, రాధాకృష్ణ, ప్రేమ్ గాంధీ మాట్లాడుతూ... కేరళ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ సంవత్సరం అయ్యప్ప భక్తులు ఇబ్బంది పడుతూ దర్శనం కోసం క్యూలైన్‌లో చిక్కుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఎరుమేలి నుంచి పంబాకు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించక పోవడంవల్ల అయ్యప్ప స్వాముల వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయన్నారు. దీంతో మంచినీరు, ఆహారం లేక వాహనాల్లోనే స్వాములు నరకయాతనకు గురవుతున్నారన్నారు. పరిమితికి మించిన దర్శనం టోకెన్లు ఇవ్వడం వల్ల తీవ్రమైన రద్దీ కారణంగా పంబా నుంచి సన్నిధానం వెళ్లేందుకు అయ్యప్ప దర్శనం కోసం క్యూలైన్‌లో గంటల తరబడి చిక్కుకుని వేలాదిగా అయ్యప్ప భక్తులు నీరు, ఆహారం, వైద్య సదుపాయం లేక తొక్కిసలాటలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని శబరి యాత్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ ధార్మిక సంఘాలు మంచినీరు, ఆహారం అందిస్తామని స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నా కేరళ ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒక ప్రత్యేక బృందాన్ని శబరికి పంపించి సహాయక చర్యలు చేపట్టాలని, ప్రత్యేక బస్సులు, రైళ్లు ఏర్పాటు చేసి ప్రతి భక్తుడినీ క్షేమంగా తీసుకురావాలని సూచించారు. అయ్యప్ప భక్తులు రమణ, ఈశ్వర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన వడ్డెర సంఘం నేతలు



స్పీకర్‌ను సత్కరిస్తున్న వెంకటేష్ తదితరులు

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను జాతీయ వడ్డెర సంఘం ప్రతినిధి బృందం శుభాకాంక్షలు తెలిపింది. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్, కోశాధికారి బత్తుల లక్ష్మీకాంతయ్య, నాయకులు మధు, తిరుమలేశ్ తదితరులు స్పీకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు.

వైద్యరంగంలో ఏపీ నంబర్ వన్

దేశంలోనే ఏపీ ఆస్పత్రులకు అత్యధికంగా 3,161 కాయకల్ప అవార్డులు

సాక్షి, అమరావతి: ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు, వైద్యుల అందుబాటు, శానిటేషన్, ఇతర సదుపాయాల కల్పనపై సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం తొలినుంచీ ప్రత్యేక దృష్టి పెడుతూ వస్తోంది. ఇందులో భాగంగా నాడు–నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖల్లో సమూల మార్పులు తీసుకొచ్చింది. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్వచ్ఛత, పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి. దేశంలోనే కాయకల్ప గుర్తింపు కలిగిన అత్యధిక ఆస్పత్రులు ఏపీలోనే ఉండటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ విషయాన్ని ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ పార్లమెంట్‌లో వెల్లడించింది. 2022–23లో దేశవ్యాప్తంగా 20,336 ప్రభుత్వ ఆస్పత్రులకు ఈ అవార్డులను కేటాయించారు. ఇందులో 3,161 ఆస్పత్రులకు అవార్డులు పొందిన ఆంధ్రప్రదేశ్ దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. 2,619 ఆస్పత్రులతో తమిళనాడు రెండో స్థానంలో, 2,414 ఆస్పత్రులతో ఒడిశా మూడో స్థానంలో నిలిచాయి. తెలంగాణలో 734, కర్ణాటకలో 371, కేరళలో ఆస్పత్రులకు మాత్రమే అవార్డులు లభించాయి. ఇదిలా ఉండగా ఆస్పత్రుల్లో జాతీయ స్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటించే విభాగంలోనూ ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. 2022–23లో దేశవ్యాప్తంగా 2,041 ఆస్పత్రులకు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాష్) లభించగా.. ఇందులో 18 శాతం ఆస్పత్రులు ఏపీ నుంచి ఉన్నాయి.

23న తిరుమలలో 'అఖండ పారాయణం'

తిరుమల: డిసెంబర్ 23న వైకుంఠ ఏకాదశి, గీతా జయంతిని పురస్కరించుకుని తిరుమల నాదనీరాజనం వేదికపై సంపూర్ణ భగవద్గీత అఖండ పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భగవద్గీతలోని 18 అధ్యాయాల్లో 700 శ్లోకాలను పారాయణం చేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. ఇందులో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద వర్సిటీ అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యాయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత వర్సిటీకి చెందిన శాస్త్రీయ పండితులు, టీటీడీ వేదపండితులు, శ్రీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు పాల్గొంటారు.

ఆరోగ్య ఉద్యానం!

పలాస 'వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి'లో అత్యున్నత వైద్య సేవలు: ఏపీ సీఎం జగన్

- రూ.700 కోట్లతో ఉద్దానానికి సురక్షిత మంచినీరు
- ఉచితంగా మందులు, పెంచిన పింఛన్లతో కిడ్నీ బాధితులకు ఆర్థిక చేయూత
- ఇదీ జగన్‌కు ఉన్న కమిట్‌మెంట్..
- ఉద్దానం కిడ్నీ సమస్యలపై గత పాలకుల తీవ్ర నిర్లక్ష్యం



శ్రీకాకుళం జిల్లా మకరాపురంలో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు స్వరూపాన్ని పరిశీలిస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉత్తరాంధ్రలో కిడ్నీ వ్యాధుల బాధితులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పలాసలో కొత్తగా నెలకొల్పిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలసి పని చేస్తాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతాన్ని దశాబ్దాలుగా వేధిస్తున్న కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తూ రూ.700 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును కంచిలి మండలం మకరాంపురంలో సీఎం జగన్ గురువారం తొలుత ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం రూ.85 కోట్లతో పలాసలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ బాలుర వసతి గృహాన్ని వర్చ్యువల్‌గా ఆరంభించారు. నూతన పారిశ్రామికవాడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలాస రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు.

మాట నిలబెట్టుకున్న మీ బిడ్డ..

2018 డిసెంబర్ 30న ఇదే పలాసలో మాటిచ్చా. దేవుడి దయతో, మీ అందరికి చల్లని దీవెనలతో మన ప్రభుత్వం ఏర్పడ్డాక ఇక్కడే 200 పడకలతో కిడ్నీ రీసెర్చ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తెస్తా మని చెప్పా. కిడ్నీ సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా అడుగులు పడతాయని కూడా చెప్పా. 2019 సెప్టెంబర్‌లో రూ.85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రిని మంజూరు చేశాం. ఉద్దానం ప్రాంతానికి సురక్షిత మంచి నీటిని తెచ్చేందుకు హిరమండలం రిజర్వాయర్ నుంచి పైపులైన్లు వేసి ఇంటింటికి తాగునీరు అందించేందుకు 2020 సెప్టెంబర్‌లో సుజలధార పథకం మంజూరు చేశాం.

ఫిబ్రవరిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందించేలా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఇక్కడి కిడ్నీ రీసెర్చ్, సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి పని చేస్తుంది. ఈ ఆస్పత్రిలో డయాలసిస్ బెడ్లు, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగంలో ఐసీయూ బెడ్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ ఫిబ్రవరిలోనే ఇక్కడ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ (మూత్రపిండాల మార్పిడి చికిత్స) కూడా జరుగుతుంది. అత్యాధునిక సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, యూరాలజీకి అవసరమైన హోల్మియం లేజర్, యూరో డైనమిక్ మిషన్ లాంటి సదుపాయాలన్నీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఎక్కడికో పరుగెత్తాల్సిన అవసరం లేకుండా మన ప్రాంతంలోనే బ్రహ్మాండమైన వైద్యం అందుబాటులోకి వచ్చే పరిస్థితి ఈ రోజు పలాసలో ఉంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులు, బాధిత కుటుంబాలు ఎలా జీవిస్తున్నాయి? డయాలసిస్ కోసం ఎంత ఖర్చు అవుతోంది? వాటిని భరించలేక వారంతా ఎలా ఇబ్బందులు పడుతున్నారో తెలిసిన ప్రభుత్వంగా మీ బిడ్డ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పెన్షన్ పెంచాడు. రూ.2,500 మాత్రమే ఉన్న పెన్షన్‌ను మీ బిడ్డ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకంగా రూ.10 వేలకు పెంచాడు.

శాశ్వత పరిష్కారం దిశగా..

ఉద్దానం ప్రాంతంలో అసలు కిడ్నీ సమస్యలు ఎందుకొస్తున్నాయి? మూల కారణం ఏమిటని తెలుసుకొనేందుకు మీ బిడ్డ ఆరాటపడ్డాడు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐసీఎంఆర్‌తో పాటు జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేపట్టింది. 4 దశల్లో సాగే ఈ అధ్యయనంలో ఇప్పటికే మూడు దశలు పూర్తయ్యాయి. ఉద్దానంలో ఒక్క కిడ్నీ ఆస్పత్రితోనే సరిపుచ్చకుండా సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎవరి ఊహకూ అందని విధంగా రూ.700 కోట్లు ఖర్చు చేసి మరీ హిరమండలం నుంచి పైపుల ద్వారా నీళ్లు తెచ్చి ఈ ప్రాంతానికి మంచి చేసేలా అడుగులు వేశాం. ఇదీ మీపట్ల మీ జగన్‌కు ఉన్న కమిట్‌మెంట్. ఈ కమిట్‌మెంటే గత పాలకులకు, మనకు మధ్య తేడాను చూపిస్తుంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏపీలో అవ్వాతాతల పింఛను రూ.3వేలకు పెంపు

తుది ఆమోదం కోసం నేటి కేబినెట్ సమావేశం ముందుకు..

సాక్షి, అమరావతి: అవ్వాతాతలతో పాటు వితంతు, ఒంటరి మహిళ, వివిధ రకాల చేతి వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించనుంది. వీరికి ప్రతినెలా ఇచ్చే సామాజిక పింఛను మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనల తుది ఆమోదం ఫైలు శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముందుకు రానుంది. నిజానికి.. 2024 జనవరి నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.3,000కు పెంచనున్నట్లు సీఎం నెలన్నర క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా పింఛన్ల పంపిణీ కోసం రూ.1,800 కోట్లకు పైగా ఖర్చుచేస్తుండగా.. జనవరి నుంచి జరిగే పెంపు అనంతరం అది రూ.2,000 కోట్లకు పెరిగే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ డిసెంబరులో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 65,33,781 మంది లబ్ధిదారులు పింఛన్లు పొందారు.

ఏఏజీగా తేరా రజనీకాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం ఆ బాధ్యతలను తప్పించే వరకు ఆయన ఈ పోస్టులో కొనసాగుతారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రజనీకాంత్ అత్యంత సన్నిహితుడు. గత ప్రభుత్వ హయాంలో అనేక అంశాలపై రేవంత్‌రెడ్డి హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసి న్యాయపోరాటం చేశారు. రేవంత్ తరఫున రజనీకాంత్ ఆ వ్యాజ్యాల్లో వాదనలు వినిపించారు. ముఖ్యమైన కేసులన్నీ కూడా రజనీకాంత్‌తో చర్చించేవారు. రజినీకాంత్ 45 ఏళ్లకే అదనపు ఏజీగా అవకాశం దక్కింది. తెలంగాణ, ఏపీ, ఉమ్మడి హైకోర్టులలో చూసినా అతిపిన్న వయసులో ఏఏజీ బాధ్యతలు చేపడుతున్న న్యాయవాదిగా తేరా రికార్డు కెక్కనున్నారు. తెలంగాణ హైకోర్టు ఏర్పడిన తర్వాత రెండవ ఏఏజీగా వ్యవహరించనున్నారు. రజనీకాంత్ స్వస్థలం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పిన్నఊర. ఉస్మానియా వర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. 2004లో న్యాయవాదిగా హైకోర్టులో ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి ఏపీలో 200లకు పైగా, తెలంగాణ హైకోర్టులో 300పైగా కేసులు వాదించారు. హైకోర్టులో ఏపీ జెన్‌కో స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2019లో హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యదర్శిగా గెలిచారు. పలు ట్రిబ్యునళ్ల తరఫున న్యాయవాదిగా కూడా వ్యవహరించారు.

జీఓ 87 అమలుపై స్టే ఇవ్వలేం

- విశ్వబలిజ కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు భూ కేటాయింపుపై హైకోర్టు విచారణ
- కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కుల సంఘాలకు తక్కువ ధరకు భూ కేటాయింపుపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రెవెన్యూ భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి, భూ పరిపాలన చీఫ్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌లతో పాటు విశ్వబలిజ కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ అభ్యంతరాలపై నాలుగువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణ వాయిదా వేసింది. భూకేటాయింపు జీఓపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం విశ్వబలిజ కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని సర్వే నంబర్ 41/40లో 6.35 ఎకరాలను రూ.100 చొప్పున (ఎకరం) కేటాయిస్తూ 2023, ఆగస్టు 2న రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 87ను జారీ చేసింది. దాదాపు రూ.100 కోట్లు విలువచేసే ఎకరం భూమిని రూ.100 చొప్పున కేటాయించారంటూ హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, మానవహక్కుల కార్యకర్త సుంకర నరేశ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అత్యంత విలువైన భూమిని చౌకగా కేటాయించడం సరికాదని పిటిషనర్ తరఫు న్యాయవాది శశికిరణ్ వాదించారు. జీఓ అమలును నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని కోరారు. ఆలిండియా వెలమ సంఘానికి ఖానామెట్‌లో 5 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓపై ఇదే హైకోర్టు స్టే ఇచ్చిందని, ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశించిందన్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూములకు సంరక్షణగా మాత్రమే ఉంటుందని, అటువంటి భూములను అన్నివిధాలా పరిరక్షించాలని, కుల ప్రాతిపదికన భూ కేటాయింపు సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధమని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులు వాదన వినకుండా స్టే ఇవ్వలేమని చెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

విశాఖ ఇండస్ ఆస్పత్రిలో భారీ అగ్నిప్రమాదం

దాబాగార్డెన్స్(విశాఖ): జగదాంబ జంక్షన్ సమీపంలోని ఇండస్ హాస్పటల్లో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పోలీసులు, అగ్నిమాపక, జీవీఎంసీ సిబ్బంది చేపట్టిన ముమ్మర సహాయక చర్యలతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే కొంతమేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఆస్పత్రి రెండో అంతస్తులో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన జరిగినట్టు అధికారులు చెబుతున్నారు. మండే స్వభావం గల నైట్రస్ ఆక్సైడ్ లీక్ అయినట్టు ప్రాథమిక అంచనా వేసినట్టు ఆర్డీవో తెలిపారు. మిగిలిన అంతస్తులకు మంటలు, పొగ వ్యాపించకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. విచారణ అనంతరం సీఎం జగన్‌కు నివేదిక పంపనున్నట్టు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రి సిబ్బందితో పాటు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం.. చికిత్స పొందుతున్న పేషెంట్లను సమీపంలోని మెడికవర్, విజేత ఆస్పత్రులకు తరలించారు. 30 మందిని విజేత ఆస్పత్రికి, 17 మందిని మెడికవర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఇద్దరు వెంటిలేటర్లపై ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

నగర వార్తలు

ఇంటి వద్దనే ఎల్పీజీ ఈ-కేవైసీ



సాక్షి,సిటీబ్యూరో: ఇంటి గుమ్మం వద్దనే వంట గ్యాస్ వినియోగదారుడి ఈ-కేవైసీ పూర్తి చేయనున్నట్లు తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్లూరి జగన్ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డెలివరీ బాయ్ సిలిండర్ డెలివరీ కోసం ఇంటికి వచ్చినప్పుడు ఈ-కేవైసీ పూర్తి చేయవచ్చన్నారు. వంట గ్యాస్ వినియోగదారులు తమ ఎల్పీజీ కనెక్షన్ ఈ కే వైసీ కోసం ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీలో భాగంగా రూ. 500 పొందేందుకు ఈ-కేవైసీ డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలన్నది కేవలం పుకార్లు మాత్రమేనని, దానిని నమ్మవద్దన్నారు. రూ. 500కు గ్యాస్ సిలిండ్ సంబంధించి ఎలాంటి విధి విధానాలు అందలేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం చమురు మార్కెటింగ్ కంపెనీల ద్వారా వినియోగదారుల ఇంటి వద్దకే వెళ్లి ఈ-కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించిందన్నారు. వినియోగదారులు ఆందోళన చెందవద్దని, ఏజెన్సీల వద్దకు ఉరుకులు పరుగులు తీసీ బారులు తీయవద్దన్నారు.

బోధనారంగంలో సత్తాచాటిన జేహెచ్‌పీఎస్

బంజారాహిల్స్: ఉపాధ్యాయుల కృషి, పట్టుదలతో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ మరోసారి బోధనారంగంలో తన సత్తాను చాటి అవార్డులను సొంతం చేసుకుంది. మోస్ట్ ట్రస్టెడ్ స్కూల్‌గా ప్రతిష్టాత్మక టైమ్స్ స్కూల్స్ ర్యాంకింగ్స్‌లో ఈ అవార్డును అందుకుంది. స్కూల్ సీనియర్ ప్రిన్సిపాల్ ఎం. వరలక్ష్మి, ప్రిన్సిపాల్ కాంచనవల్లి, ప్రాథమిక ప్రధానోపాధ్యాయురాలు విధు మోహన్ తదితరులు ఈ అవార్డును అందుకున్న సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను అభినందించారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా విద్యార్థులకు నాణ్యమైన బోధన కొనసాగించినందుకు ఫలితంగా ఈ అవార్డు దక్కిందని వారు తెలిపారు. ఉత్తమ సీబీఎస్‌ఈ కర్క్యులమ్ పాఠశాల అవార్డును కూడా ఈ పాఠశాల అందుకుంది.




అవార్డు అందుకుంటున్న జేహెచ్‌పీఎస్ సీనియర్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి

చలి.. వణికిస్తోంది!

గ్రేటర్‌లో భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

- పెరుగుతున్న నిమోనియా, ఆస్తమా కేసులు
- ఇబ్బందుల్లో హృద్రోగులు, కీళ్లనొప్పుల బాధితులు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. రాత్రి చలిగాలులకు సిటిజన్లు గజగజ వణికిపోతున్నారు. ఉదయం తొమ్మిది గంటల తర్వాత కూడా దుప్పటి ముసుగు నుంచి బయటికి రావడం లేదు. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న అనూహ్య మార్పులతో శరీరంపై పగుళ్లు ఏర్పడుతున్నాయి. అనేక మంది దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్నారు. ఊపిరాడక ఇబ్బంది పడుతున్నారు.

ప్రస్తుతం నల్లకుంట ఫీవర్, నిలోఫర్ చిన్న పిల్లల ఆస్పత్రులు సహా నగరంలోని ఏ ఆస్పత్రిలోకి తొంగి చూసినా నిమోనియా, ఆస్తమా బాధితులే దర్శనమిస్తున్నారు. గురువారం గరిష్ఠంగా 27.5 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కనిష్ఠంగా 15.5 సెంటిగ్రేడ్‌లు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి దక్షిణాది వైపు శీతల గాలులు వీస్తుండటంతో వృద్ధులతో పాటు ఉదయాన్నే పాఠశాలలకు వెళ్లే చిన్నారులు చలి ధాటికి తట్టుకోలేకపోతున్నారు. చలి కారణంగా దగ్గు, జలుబు, జ్వరం బారిన పడుతున్నారు.

పొంచి ఉన్న ఫ్లూ..

చలిగాలుల్లో ఫ్లూ కారక వైరస్‌లు విజృంభిస్తుంటాయి. ఇప్పటికే ఆస్తమాతో బాధపడుతున్న వారు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు విధిగా ముక్కుకు మాస్కులు ధరించాలి. లేదంటే స్వైన్‌ఫ్లూ, కోవిడ్ కారక వైరస్‌ల బారిన పడే ప్రమాదం లేకపోలేదు. చలి ధాటికి హృద్రోగుల్లో సమస్యలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. సాధ్యమైనంత వరకు ఈ హృద్రోగ బాధితులు తెల్లవారుజామున బయటికి రాకపోవడమే ఉత్తమం. వీరు సూర్యోదయం తర్వాతే వాకింగ్ కోసం బయటికి రావాలి. చలికాలంలో వీరు వీలైనంత వరకు ఇండోర్ (యోగా) ఎక్సర్‌సైజ్‌లు చేయడం ఉత్తమం. చలికి చర్మంపై పగుళ్లు ఏర్పడుతుంటాయి. కాళ్లు, చేతులు, ముఖంపై పగుళ్లు ఏర్పడి, మానసికంగా చికాకు కలిగిస్తుంటాయి. జుట్టు రాలుతుంది. చుండ్రు వంటి సమస్యలు తలెత్తుతాయి. రాత్రి పడుకునే ముందు చర్మానికి లోషన్లు రాయడం వల్ల పగుళ్లను నివారించొచ్చు. చన్నీటి స్నానం, షాంపూ వాడకాన్ని నివారించడం వల్ల తలలో చుండ్రు సమస్యను జయించవచ్చు. ఇప్పటికే కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ఈ సీజన్‌లో మరింత ఇబ్బంది పడే ప్రమాదం లేకపోలేదు. వీరు వాకింగ్ చేయడం వల్ల ఈ సమస్యను అధిగమించొచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

గోరువెచ్చని నూనెతో మర్దన

చలికాలంలో జఠరాగ్ని పెరుగుతుంది. దీంతో ఆకలి ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయం ఎక్కువ కావడం కూడా ఇందుకు మరో కారణం. అందుకే ఉదయాన్నే బాగా ఆకలేస్తుంటుంది. తగినంత ఆహారం తీసుకోవాలి. ఈ కాలంలో ఆహారాన్ని తగ్గిస్తే వాత సంబంధమైన జబ్బులు వస్తాయి. చలిని తట్టుకొనేందుకు శరీరానికి గోరువెచ్చని నూనెలతో మర్దన చేసుకోవాలి. ఇందుకోసం ప్రత్యేకంగా ఆయుర్వేద తైలాలు లభిస్తాయి. ఇంటి వాతావరణాన్ని వెచ్చగా ఉంచుకొనేందుకు సాంబ్రాణి వంటి వాటితో ధూపం వేసుకోవాలి. నారింజ, బత్తాయి వంటి ఫలాలు తీసుకోవాలి. ఆహారంలో గోధుమ, మినుములతో చేసిన పదార్థాలు, పాల ఉత్పత్తులు ఉంటే మంచిది. ఆస్తమా బాధితులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వెచ్చదనాన్నిచ్చే దుప్పట్లతో శరీరాన్ని కప్పి ఉంచుకోవాలి. చిన్న పిల్లలకు ఎలర్జీలు రాకుండా వ్యాధి నిరోధక ఔషధాలను వాడాలి.

– డాక్టర్ సుభిన్, ఆయుర్వేద వైద్య నిపుణులు, సికింద్రాబాద్

'గాంధీ' ఫుడ్.. వెరీ గుడ్

గాంధీ ఆస్పత్రిలో అత్యాధునిక డైట్ కిచెన్

- రోగులకు న్యూట్రిషన్ ఫుడ్
- గంటలో మూడువేల మందికి ఆహారం రెడీ



గాంధీ డైట్ కిచెన్ భవనం

గాంధీ ఆస్పత్రి: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మందులు, వైద్యసేవలు ఎంత అవసరమో.. బలవర్ధకమైన పౌష్టికాహారం కూడా అంతే అవసరమని వైద్యనిపుణులు చెబుతుంటారు. ఈ మేరకు పేరొందిన ప్రభుత్వ దవాఖానాల్లో ఇన్‌పేషంట్లుగా చికిత్స పొందుతున్న రోగులకు ఉచితంగా ఆహారం అందించేందుకు డైట్ కిచెన్లను ఏర్పాటు చేశారు. తెలంగాణ వైద్యప్రదాయిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ సరఫరా చేసేందుకు రూ. 2.70 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక డైట్ కిచెన్ ఇటీవల అందుబాటులోకి వచ్చింది. సుమారు 90 నిమిషాల వ్యవధిలో అన్నం, కూరలు, గుడ్లు, పాలు తదితర ఆహార పదార్థాలను తయారుచేసే గ్యాస్, కరెంట్‌తో పనిచేసే ఆధునిక స్టీమ్ బాయిలర్ ఆటోక్లీన్ సిస్టం ఇక్కడ ఏర్పాటు చేశారు. బియ్యం, కూరగాయలు, గుడ్లు, పాలు వంటివి నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజీ, డీప్‌ఫ్రీజర్లు, స్టీమ్ సిస్టం, గ్‌బాయిలర్లు వంటి నూతన యంత్రాలతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ దవాఖానాల్లో ఎక్కడా లేనటువంటి ఆధునిక డైట్ కిచెన్‌ను అందుబాటులోకి వచ్చింది.

రోజుకు 2 వేల మందికి..

గాంధీ ఆస్పత్రి ఇన్‌పేషెంట్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతోపాటు విధి నిర్వహణలో ఉన్న వైద్యులతో కలిసి రోజుకు సుమారు రెండు వేల మందికి మూడు పూటలా ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాలను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఆక్సిజన్, వెంటిలేటర్‌పై ఉన్న రోగులకు లిక్విడ్ డైట్‌ను ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు.

పౌష్టికాహారంతో త్వరితగతిన స్వస్థత



మెరుగైన వైద్యసేవలు, అవసరమైన మందులతోపాటు సమపాళ్లలో పౌష్టికాహారం అందిస్తే రోగులు త్వరతగతిన కోలుకుంటారు. డైట్ చార్జీలు రెట్టింపు చేయడంతో నాణ్యమైన ఆహారాన్ని నిరుపేద రోగులకు అందిస్తున్నాం. ప్రతినెలా డైట్ కమిటీ సమావేశంలో ఆయా అంశాలపై చర్చించి పలు సలహాలు, సూచనల అందిస్తాం. న్యూట్రిషనల్ కేర్ సర్వీసెస్‌తో రికవరీ రేట్ పెరిగింది. డైట్ కిచెన్ నూతన భవనం అందుబాటులోకి రావడంతో మరింత మెరుగైన సేవలు అందించగలుగుతున్నాం.

– ప్రొఫెసర్ రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

రోగి ఆరోగ్యస్థితికి అనుగుణంగా డైట్



చికిత్స పొందుతున్న రోగి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా ఆహారపదార్థాలను అందిస్తాం. ట్రీటింగ్ డాక్టర్ కేస్‌షీట్‌లో ఎటువంటి డైట్ ఇవ్వాల్లో వివరంగా రాస్తారు, దాని ప్రకారం జనరల్, లిక్విడ్, హైప్రోటీన్ డైట్‌లను సరఫరా చేస్తాం.

– సిద్ధల్ల రమేష్, చీఫ్ డైటీషియన్

రైతుల నుంచే నేరుగా కూరగాయలు కొనుగోలు



రోగులకు అందించే బియ్యం, ఆహారపదార్థాలు, కూరగాయలను నేరుగా రైతుల నుంచే కొనుగోలు చేస్తున్నాం. కూరగాయలను రన్నింగ్‌వాటర్‌లో పరిశుభ్రం చేసి కోల్డ్‌స్టోరేజీలో భద్రపరుస్తున్నాం. డైట్ కిచెన్‌లో సుమారు 35 మంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు.

– రవికుమార్, డైట్ కాంట్రాక్టర్

గోవా సీఎంకు ఐఎస్‌బీ నివేదిక అందజేత



ఐఎస్‌బీ నివేదికను అందిస్తున్న భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిశోధనా బృందం

రాయదుర్గం: గోవాలో 'పాఠశాల విద్య నాణ్యత విశ్లేషణ' అనే అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌కు గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) రూపొందించిన నివేదికను గురువారం అందించింది. ఐఎస్‌బీలోని భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీకి చెందిన పరిశోధకుల బృందం గోవాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాస్థితిని విశ్లేషించింది. గోవా ప్రభుత్వం, ఐఎస్‌బీ మధ్య సహకారంలో భాగంగా భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీకి చెందిన పరిశోధనా బృందం పాఠశాల విద్య నాణ్యత విశ్లేషణ అంశంపై ప్రత్యేక నివేదికను అందించింది. పాఠశాల విద్యార్థుల నైపుణ్యాల పెంపుదల కోసం నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌ఎస్‌క్యూఎఫ్) కింద అప్రెంటిస్‌షిప్ ప్రాముఖ్యతను నివేదికలో పేర్కొన్నారు.పాఠశాల విద్య ప్రస్తుత స్థితి గతులు, విద్యార్థులలో సామాజిక–ఆర్థిక వ్యత్యాసాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత విధానాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను నివేదిక విశ్లేషించింది. గోవా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను మెరుగుపరిచే మార్గాలను కూడా నివేదిక సూచిస్తుంది. కార్యక్రమంలో భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డైరెక్టర్ డాక్టర్ ఆరుషిజైన్, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధనాబృందం, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలిండియా క్రాఫ్ట్ మేళా

మాదాపూర్: ఆలిండియా క్రాఫ్ట్ మేళా నగరవాసులను ఆకట్టుకుంటోందని శిల్పారామం జనరల్ మేనేజర్ అంజయ్య పేర్కొన్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో గురువారం ఆలిండియా క్రాఫ్ట్ మేళాకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తకళాకారుల ప్రయోజనార్థం భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, నేషనల్ జూట్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో అలిండియా క్రాఫ్ట్ మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ కర్ణాటక, మధ్యప్రదేశ్, త్రిపుర, రాజస్థాన్, వెస్ట్‌బెంగాల్‌కి చెందిన శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ సందర్శకులను ఆకట్టుకునేందుకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడించిన శిల్పారామం జనరల్ మేనేజర్ అంజయ్య

లింగంపల్లి నుంచి దేవగిరి ఎక్స్‌ప్రెస్ షురూ



శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి దేవగిరి ఎక్స్‌ప్రెస్ గురువారం ప్రారంభించారు. చత్రపతి శివాజీ మహరాజ్ టెర్నినల్ (ముంబాయి)కు స్టేషన్ మాస్టర్ రాజు జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి రోజు లింగంపల్లి స్టేషన్ నుంచి 12.25 గంటలకు ప్రారంభమై సికింద్రాబాద్, నిజామాబాద్, పూర్ణ జంక్షన్, జాల్నా, ఔరంగబాద్, మన్మాడ్ జంక్షన్, కల్యాణ్ మీదుగా చత్రఫతి శివాజీ మహరాజ్ టెర్నినల్ కు వెళ్తుంది. అంతకు ముందు సికింద్రాబాద్ నుంచి బయలుదేరే దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభం కావడంతో ఈ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

ఫ్యాషన్

సంప్రదాయ వేడుకలకు గ్రాండ్‌గా తయారవ్వాలంటే అతివలు ఎంచుకునే మొదటి ఎంపిక లంగా ఓణీ లేదా గాగ్రా చోలీ అవుతుంది. ఎంబ్రాయిడరీ లాంటి రిచ్ డిజైన్స్ లేవు అనుకునేవారు రీసెంట్‌గా ఆకట్టుకుంటున్న డిజిటల్ ప్రింట్ డిజైన్స్‌ని ఎంపిక చేసుకోవచ్చు. పురాణ గాథలు, ఫ్లోరల్, గ్రామీణ వాతావరణం నింపుకున్న డిజిటల్ డిజైన్స్ రిచ్‌లుక్‌తో అట్రాక్ట్ చేస్తున్నాయి.

డిజిటల్ మెరుపులు





మెటీరియల్

సంప్రదాయ వేడుకలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ కళగా సొంతం చేసుకోవాలనుకునేవారు ఈ డిజిటల్ ప్రింట్ డిజైన్స్‌ను ఎంచుకోవచ్చు. వీటిలో మెటీరియల్, డిజైన్ బట్టి ధరలు వేల రూపాయల నుంచి మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. రెడీ టు వేర్‌గానూ ఉన్న ఈ డిజైన్స్ అమ్మాయిలను, అమ్మలనూ ఆకట్టుకుంటున్నాయి.

కలంకారీ ప్రింట్స్

చందేరీ ఫ్యాబ్రిక్‌పైన పెన్ కలంకారీ మాత్రమే కాదు కలంకారీ ప్రింట్స్ కూడా కొత్త ఊపిరి పోసుకుంటున్నాయి. హ్యాండ్‌మేడ్ చేయించుకోవడానికి టైమ్ పడుతుంది అనుకునే వారు రెడీ టు వేర్‌గా ఉన్న కలంకారీ లెహంగా చోలీ డిజైన్స్‌ను ఎంచుకోవచ్చు.

పట్టుపైనా...

పట్టు లెహంగాలు ఎప్పుడూ రిచ్ లుక్‌ని ఇస్తాయి. అయితే, వీటిని మరింత గ్రాండ్‌గా తీర్చిదిద్దడానికి డిజిటల్ ప్రింట్స్ సందడి చేస్తున్నాయి. దుపట్టా, బ్లౌజ్, లెహంగా లు కొత్త లుక్‌తో మెరిసిపోతున్నాయి. సంప్రదాయ వివాహ వేడుకలు, పండుగల రోజుల్లో ఇవి కొత్త ప్రత్యేకతను నింపుకుంటున్నాయి.

వంటిల్లు

ఈ క్రిస్టమస్‌కు సులభంగా... త్వరగా చేసుకోదగిన రుచికరమైన కుకీస్ ఈ వారం

రంగు రంగుల రుచులు


క్రిస్టమస్ సాఫ్ట్ కుకీస్



కావలసినవి: మైదా – మూడున్నర కప్పులు; వంటసోడా – టీస్పూను; ఉప్పు – అర టీస్పూను; పంచదార – ఒకటిన్నర కప్పులు; బటర్ – కప్పు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – రెండు టీ స్పూన్లు.

తయారీ: ● మైదా, వంటసోడా, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● బటర్‌లో పంచదార వేసి క్రీమ్‌లా మారేంత వరకు బీటర్‌తో కలపాలి. తరువాత ఈ క్రీమ్‌ను రెండు గంటలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత బటర్ క్రీమ్‌లో గుడ్లసొన, వెనీలా ఎసెన్స్, మైదా మిశ్రమం వేసి ముద్దగా కలుపుకోవాలి ● పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత పిండి ముద్దను రొట్టెల్లా వత్తుకోవాలి ● ఈ రొట్టెను క్రిస్టమస్ ట్రీ, స్టార్స్, బొమ్మల ఆకారంలో కట్ చేసి బేకింగ్ ట్రేలో పెట్టాలి. కుకీస్ ఆకారాన్ని బట్టి ఫుడ్ కలర్ వేసుకోవచ్చు ● ఈ బేకింగ్ ట్రేను 400 డిగ్రీల ఫారిన్ హీట్ వద్ద పదినిమిషాలు బేక్ చేస్తే ఎంతో రుచికరమైన క్రిస్టమస్ సాఫ్ట్ కుకీస్ రెడీ.

స్నీకర్ డూడుల్ కుకీస్



కావలసినవి: మైదా – మూడు కప్పులు; టార్టారిక్ యాసిడ్ – రెండు టీస్పూన్లు; కోషర్ సాల్ట్ – టీస్పూను; వంటసోడా – ముప్పావు టీస్పూను; బటర్ –కప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; వెనీలా ఎసెన్స్– టీస్పూను; దాల్చినచెక్క పొడి – టేబుల్ స్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో మైదా, టార్టారిక్ యాసిడ్, వంటసోడా వేసి కలపాలి ● అన్నీ కలిసిన తరువాత బటర్, ఒకటింబావు కప్పుల పంచదార వేసి మెషిన్ మిక్సర్‌తో కలపాలి ● మిశ్రమం క్రీమ్‌లా మారిన తరువాత వెనీలా ఎసెన్స్ వేసి కలిపి రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి ● మిగిలిన పంచదారలో దాల్చినచెక్క పొడి వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి ● గంట తర్వాత రిఫ్రిజిరేటర్‌నుంచి తీసిన మిశ్రమాన్ని రెండు టేబుల్ స్పూన్ల చొప్పున తీసుకుని బాల్స్‌లా చేసి దాల్చినచెక్క పొడి అద్ది బేకింగ్ ట్రేలో పెట్టాలి ● కుకీస్ అన్నీ తయారయ్యాక.. బేకింగ్ ట్రేని 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద, ఇరవై నిమిషాలు బేక్ చేస్తే స్నీకర్ డూడుల్ కుకీస్ రెడీ.

ఇటాలియన్ పీచ్ కుకీస్



కావలసినవి: మైదా – మూడున్నర కప్పులు; వంటసోడా – టేబుల్ స్పూను; కోషర్ సాల్ట్ – పావు టీస్పూను; బటర్ – అరకప్పు; పంచదార – రెండు కప్పులు; గుడ్లు – రెండు కప్పులు; వెనీలా ఎసెన్స్ – రెండు టీస్పూన్లు; పాలు – కప్పు; ఎరుపు, పసుపు ఫుడ్ కలర్ – నాలుగు చుక్కలు (ఒక్కోటి రెండు చుక్కలు). పీచ్ బటర్ క్రీమ్: బటర్ – పావు కప్పు; వెనీలా ఎసెన్స్ – అర టీస్పూను; కోషర్ సాల్ట్ – చిటికెడు; పంచదార పొడి – కప్పు; పీచ్ ప్యూరీ – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● ఒక గిన్నెలో వంటసోడా, ఉప్పు వేసి కలపాలి ● దీనిలో బటర్, కప్పు పంచదార వేసి క్రీమ్‌లా మారేంత వరకు హ్యాండ్ మిక్సర్‌తో కలపాలి. తరువాత క్రీమ్‌ను పక్కన పెట్టుకోవాలి ● మిక్సర్‌ను తక్కువ స్పీడ్‌లో పెట్టి గుడ్ల సొన, వెనీలా ఎసెన్స్ వేసి రెండు నిమిషాలు బీట్ చేసుకోవాలి ● తరువాత మైదా, బటర్ మిశ్రమం అరకప్పు పాలు పోసి అన్నీ చక్కగా కలిసేంత వరకు బీట్ చేయాలి ● ఇప్పుడు ఈ మిశ్రమాన్ని స్కూప్ పరిమాణంలో తీసుకుని గుండ్రని బాల్స్‌లా చేసి పైన కొద్దిగా వత్తి పీచ్ ఫ్రూట్ ఆకారంలోకి తీసుకు రావాలి ● ఇలా అన్ని కుకీస్ రెడీ అయిన తరువాత అవెన్‌లో పెట్టి 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేయాలి ● పీచ్ క్రీమ్‌కోసం తీసుకున్న బటర్, వెనీలా ఎసెన్స్, కోషర్ సాల్ట్ లనుగిన్నెలో వేసి హ్యాండ్ మిక్సర్‌తో కలపాలి ● ఇవన్నీ చక్కగా కలిపిన తరువాత మిక్సర్ స్పీడు తగ్గించి పంచదార పొడి, పీచ్ ప్యూరీవేసి మీడియం హై లో నిమిషం పాటు మిక్సర్‌తో కలపాలి ● మిగిలిన అరకప్పు పాలను రెండు సగాలుగా చేసి రెండు వేర్వేరు గిన్నెల్లో పోయాలి. ఒకదానిలో ఎరుపు, మరో దానిలో పసుపు ఫుడ్ కలర్ వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. మరోగిన్నెలో మిగిలిన పంచదారను పెట్టుకోవాలి ● కుకీస్ బేక్ అయిన తరువాత..వేడిగా ఉన్నప్పుడే కుకీస్ మధ్యలో చిన్న గాటు పెట్టి.. మధ్యలో పీచ్‌క్రీమ్‌ను వేసి శాండ్‌విచ్‌లా కొద్దిగా వత్తాలి ● ఇప్పుడు కుకీకి ఒకవైపు ఎరు రంగు కలపిన పాలు, మరోవైపు పసుపు రంగు కలపిన పాలు అద్దాలి. చివరిగా పంచదార అద్దితే ఇటాలియన్ పీచ్ కుకీస్ రెడీ.

గ్రీన్ కేక్ మిక్స్ కుకీస్



కావలసినవి: వెనీలా కేక్ మిక్స్ – మూడు కప్పులు; నూనె – ముప్పావు కప్పు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – అరటీస్పూను; గ్రీన్ ఫుడ్ కలర్ – టీస్పూను(జెల్); పంచదార పొడి – ముప్పావు కప్పు; హార్ట్ షేప్ క్యాండీస్ – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● కేక్ మిక్స్,నూనె, గుడ్ల సొన, వెనీలా ఎసెన్స్‌ను, గ్రీన్‌ఫుడ్ కలర్‌ను ఒక గిన్నెలో వేసి ముద్దలా కలపాలి. తరువాత రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండి ముద్దను బయటకు తీసి స్కూప్ పరిమాణంలో పిండిని తీసుకుని ఉండలు చేయాలి ● ఈ ఉండలను పంచదారపొడిలో ముంచి కోటింగ్‌లా అద్దాలి ● తరువాత ఉండలను బేకింగ్ ట్రేలో పెట్టి, కుకీ షేప్ వచ్చేలా వత్తుకోవాలి ● కుకీ మధ్యలో హార్ట్ ఆకారంలో ఉన్న క్యాండీని పెట్టి బేకింగ్ ట్రేని అవెన్‌లో పెట్టాలి ● 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేస్తే గ్రీన్ కేక్ మిక్స్ కుకీస్ రెడీ.

సుగర్ కుకీస్



కావలసినవి: బటర్ – పావు కప్పు; క్రీమ్ చీజ్ – పావుకప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – ఒకటిన్నర టీస్పూన్లు; బాదం ఎసెన్స్ – పావు టీస్పూను; మైదా – రెండున్నర కప్పులు; కార్న్‌స్టార్చ్ – టేబుల్ స్పూను; వంటసోడా – టీస్పూను; ఉప్పు – పావు టీస్పూను; ఎరుపు, పచ్చరంగు కలిపిన పంచదార –గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● ఒక పెద్దగిన్నెలో బటర్, క్రీమ్ చీజ్, పంచదార, గుడ్లు, వెనీలా, బాదం ఎసెన్స్ వేసి హ్యాండ్ మిక్సర్‌తో ఐదు నిమిషాలపాటు కలపాలి ● తరువాత మైదా, కార్న్ స్టార్చ్, వంటసోడా, ఉప్పు వేసి పిండి ముద్దలా కలపాలి ● ఈ పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత తీసి చిన్నచిన్న ఉండలుగా చేసి బేకింగ్ ట్రేలో పెట్టాలి ● ఫోర్క్ సాయంతో ఉండపైన ఇంటూ ఆకారంలో ముద్ర పడేటట్లు వత్తాలి ● ఇలా అన్నిటినీ వత్తుకున్నాక ఎరుపు, పచ్చరంగు పంచదారను ఈ కుకీస్ పైన చల్లాలి ● ఇప్పుడు బేకింగ్ ట్రేని అవెన్‌లో పెట్టి 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేస్తే సుగర్ కుకీస్ రెడీ.

మీ బద్ధకం అమ్మకు భారమే

చలికాలం



చలికాలం ముసుగు తన్ని పడుకుంటే
ఎంత బాగుణ్ను.
బెడ్ దగ్గరకు పొగలు గక్కే టీ వస్తే
ఎంత బాగుణ్ను.
టిఫిన్లూ, సూప్‌లు,
సాయంత్రం ఉడకబెట్టిన పల్లీలు...
ఎంత బాగుణ్ను.
అన్నట్టు రగ్గులు, బొంతలు
భలే శుభ్రంగా, పొడిగా ఉండాలండోయ్.
చలికాలం ఎవరికీ పని చేయబుద్ధేయని కాలం.
కాని అమ్మకు తప్పుతుందా?
అమ్మ వెచ్చని రగ్గు కప్పుకుని టీవీ చూస్తూ
'టీ తెండి' అని అరిస్తే ఒకరోజైనా
ఇస్తారా ఎవరైనా?
చలికాలంలో ఇంటి సభ్యులు ఏం చేయాలి?

స్కూల్ టైమ్ మారదు. ఉదయం 8 లోపు బస్సొచ్చి ఆగుతుంది. పిల్లలకు బాక్స్ కట్టివ్వడమూ తప్పదు. ఏడున్నరకంతా కట్టాల్సిందే. టిఫిన్ తినిపించాల్సిందే. ఎంత చలి ఉన్నా, ఎంత మంచు కమ్ముకున్నా, ఎంత బద్ధకంగా ఉన్నా, ఎంత ముసుగుతన్ని నిద్రపోవాలని ఉన్నా అమ్మకు తప్పుతుందా? అమ్మ లేవకుండా ఉంటుందా? వంట గదిలో వెళ్లకుండా ఉంటుందా? నాన్న అర గంట లేటుగా లేవొచ్చు. వాకింగ్ ఎగ్గొట్టి అమ్మ ఇచ్చిన టీని చప్పరిస్తూ పేపర్‌ను చదువుతూ ఉండొచ్చు. కాని అమ్మ మాత్రం అదే వంట చేయాల్సిందే. రోజువారీ అంట్లు, బట్టల ఉతుకుడు చూడాల్సిందే. ఆమెకు ఇంట్లో నుంచి ఎలాంటి సాయం అందుతున్నదో ఆలోచించామా ఎప్పుడైనా?

బద్ధకమైన కాలం ఇది

చలికాలం బద్ధకం కాలం. తలుపులు కిటికీలు మూసుకుని అరచేతులు రుద్దుకుంటూ కూచోమని చెప్పే కాలం. బబ్బుంటే బాగుండు అనిపించే కాలం. అమ్మకు 'ఈ పూట ఎవరైనా వంట చేసి పెడితే బాగుండు' అనిపించినా అలా చేసేవారు ఎవరు? 'రోజూ వండుతున్నావ్ కదా ఇవాళ బజారు నుంచి వేడి ఇడ్లీ తెస్తానులే' అని బండి తాళం అందుకునే నాన్నలు ఎందరు? పాలల్లో కొన్ని చాకోస్ వేసివ్వు చాలు అనే పిల్లలు, బ్రెడ్ ఆమ్లేట్ చేసుకుని తింటాలే అనే భర్తలు ఉన్న ఇల్లు ఇల్లాలి శ్రమను గుర్తించే ఇల్లు. 'కాసేపు పడుకోలే' అని లేచి పేపర్లు లోపల పడేసి, పాలు ఫ్రిజ్‌లో పెట్టి, ఒక ప్యాకెట్ గిన్నెలో వేడి చేసి, కాఫీ కలిపి భార్యను లేపితే ఎంత బాగుంటుంది. మగవాళ్లు బట్టలు ఎలాగూ ఉతకరు. 'చెమ్మగా ఉన్నాయి' అని విసుక్కునే బదులు కనీసం ఎండ తగిలే తీగ దాకానో, డాబా మీదనో తీసుకెళ్లి ఆరేసే సాయం చేయరు. ఇలాంటి సమయంలో 'బట్టలు ఆరేయడం' అనే చిన్న పని కూడా చాలా పెద్ద సాయం కిందకు వస్తుంది.ఈ రోజుల్లో ప్రత్యామ్నాయ టిఫిన్లు, ఇన్‌స్టంట్ టిఫిన్లు ఎన్నో మార్కెట్‌లో ఉన్నాయి. యూట్యూబ్‌లో కొడితే వందలాది వీడియోలు ఉన్నాయి. తెచ్చిపెట్టే స్విగ్గి, జొమాటోలు ఉన్నాయి. ఈ శీతాకాలంలో ఉదయపు వంట చెర నుంచి అమ్మకు ఏ విధంగా ఉపశమనం ఇవ్వొచ్చో తప్పక ఆలోచించాలి.

అమ్మకు కావాలి వెచ్చని దుస్తులు

సాధారణంగా ఇళ్లల్లో నాన్నకు హాఫ్ స్వెటర్లు ఉంటాయి. ఎప్పుడూ వేసుకునే ఉంటాడు. అమ్మకు మాత్రం ఎందుకనో స్వెటర్ ఉండదు. కొని తేవాలని ఎవరికీ అనిపించదు. చాలా ఇళ్లల్లో అమ్మలు పాతబడిన స్వెటర్లతోనే తిరుగుతూ ఉంటారు ఈ సీజన్లలో. ఒక రంగురంగుల కొత్త స్వెటర్ కొనుక్కోవాలని వారికి ఉంటుంది. ఉద్యోగం చేస్తున్నా, గృహిణి అయినా తాను కొనుక్కునే చొరవకు ఎప్పుడూ అమ్మ దూరంగానే ఉంటుంది. స్వెటర్ లేకుండానే చలికాలం గడిపేస్తుంది. ఆమెకు స్వెటర్, సాక్సులు, స్కార్ఫ్‌లు కావాలి. ఉన్నాయా గమనించండి. ఆమె అడగదు. తెచ్చి పెట్టండి. శీతాకాలంలో స్త్రీలు తమ శరీరం గురించి ఆలోచన చేస్తారు. చర్మాన్ని, శిరోజాల్ని కాపాడుకోవడానికి వారికి కొన్ని వస్తువులు అవసరం. క్రీములు, నూనెలు, సబ్బులు... ఏర్పాటు చేయాలి. చర్మ సమస్యలు కొందరిలో రావచ్చు. వాటిని చిట్కాలతో సరిపుచ్చుతూ బాధ పడాల్సిన పని లేదు. వైద్యుల దగ్గరకు వెళ్లాలి. తీసుకువెళ్లాలి. ఇక ఇంట్లో గర్భిణీ స్త్రీలు ఉంటే చలికాలం మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. రోజువారీ చాకిరీ నుంచి దాదాపుగా తప్పించాలి.

ఇంట్లో పెద్దవారు ఉంటే?

అమ్మమ్మో, నానమ్మో ఇంట్లో ఉంటే వారి గురించి ఇల్లంతా మరింత శ్రద్ధ పెట్టాలి. మంచి షాల్, రగ్గు వారికి ఏర్పాటు చేయాలి. నేలకు పాదాలు తాకి జిల్లు మనకుండా ఇంట్లో తిరగడానికి మంచి స్లిప్పర్లు ఇవ్వాలి. స్లిప్పర్లలోనే తిరగమని చెప్పాలి. చలికి ఆకలి ఎక్కువ. పెద్దవారు పసిపిల్లల్లా మారి నోటికి హితంగా వేడివేడిగా అడుగుతారు. వారికి ఏదో ఒకటి చేసి పెట్టాలి. ఆ పనిలో కూడా అమ్మకు భర్త, పిల్లలు ఏదో ఒక మేరకు సాయం చేయాలి. వారికి వెచ్చని గది కేటాయించాలి. లేదా ఇంట్లోని వెచ్చని ప్రదేశమైనా.

శుభ్రత అందరిదీ

శీతాకాలం ఇల్లు మబ్బుగా ఉంటుంది. ఇటు పుల్ల అటు పెట్టబుద్ధి కాదు. కాని ప్రయత్నం చేసి ఇల్లు ప్రతి రోజూ సర్దుకునే పడుకోవాలి. హాల్లో బెడ్‌రూముల్లో కిచెన్‌లో కుటుంబ సభ్యులంతా నిద్రకు ముందు వీలైనంత శుభ్రంగా, సర్ది పడుకుంటే ఉదయాన్నే అమ్మ లేచినప్పుడు చిందర వందర లేకుండా పనిలో పడబుద్ధి అవుతుంది. పక్క బట్టలు మడవడం కూడా కొంతమంది చేయరు. అలాంటి వారిని తప్పక గాడిలో పెట్టాలి. చలికాలం అమ్మకి పని తేలిక చేద్దాం. చలికాలాన్ని ఎంజాయ్ చేసేలా చూద్దాం.

● ముగ్గు-ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడుచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో



పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

జంప్ డౌన్ సమ్‌వన్స్ థ్రోట్

ఆగ్రహంగా స్పందించే సందర్భంలో ఉపయోగించే మాట... జంప్ డౌన్ సమ్‌వన్స్ థ్రోట్.
ఉదా: ఐ మేడ్ ది మైల్డెస్ట్ ఆఫ్ క్రిటిసిజమ్స్ అండ్ హీ జంప్‌డ్ డౌన్ మై థ్రోట్



జంప్ ఔట్ ఆఫ్ మై స్కిన్

ఊహించని విధంగా భయపెట్టే సంఘటన జరిగినప్పుడు వాడే మాట... జంప్ ఔట్ ఆఫ్ మై స్కిన్.
ఉదా: ది నాయిస్ మేడ్ మీ జంప్ ఔట్ ఆఫ్ మై స్కిన్

మృత్యుగీతం

● గేమింగ్

ఫ్రీ-టు-ప్లే రోల్‌ప్లేయింగ్ గేమ్ ఏ డేట్ విత్ డెత్. ఈ గేమ్‌లో ప్లేయర్ సాధారణ వ్యక్తి. ఈ సాధారణ వ్యక్తి ఎన్నోసార్లు అసాధారణ పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. మృత్యువు బారి నుంచి తప్పించుకున్న సందర్భాలు ఎన్నో. ప్లేయర్స్‌ను సంతోష పెట్టే ఫీచర్స్ ఎన్నో ఈ గేమ్‌లో ఉన్నాయి. అందులో ఒకటి... శూన్యం నుంచి అవతార్‌ను సృష్టించే ఫీచర్. వినోదం, ఒళ్లు గగుర్పొడిచే భయం మిళితమైన ఆట ఇది.




డెవలపర్స్: టు అండ్ ఈ హాఫ్ స్టూడియోస్ జానర్స్: ఇండి గేమ్, సిమ్యులేషన్ వీడియో గేమ్, ఫ్రీ-టు-ప్లే
ప్లాట్‌ఫామ్స్: మ్యాక్‌ఓఎస్, మైక్రోసాఫ్ట్ విండోస్

● సక్సెస్ స్టోరీ

మెటామ్యాన్

వచ్చిన 'ఐడియా'కు ఒక రూపం ఇచ్చి లాభదాయక కంపెనీగా నిర్మించడం అనేది అంత సులభం కాదు. దారి కనిపించినట్లుగానే ఉంటుంది. గమ్యం చేరడం మాత్రం సులువు కాదు. ఎంటర్‌ప్రెన్యూర్ కలలు కనే యువతరం తమకు వచ్చిన ఐడియాకు సంబంధించి అన్ని కోణాల్లో హోంవర్క్ చేస్తే సూపర్ సక్సెస్ సాధించవచ్చని నిరూపించింది బెంగళూరుకు చెందిన 'మెటామ్యాన్' స్టార్టప్. 'మన దేశంలో పురుషులకు జువెలరీ బ్రాండ్స్‌కు సంబంధించి తక్కువ ఆప్షన్స్ ఉన్నాయి' అనే మాట బాలీవుడ్ నటుడు సునీల్ షెట్టి నోట విన్న తరువాత అనీల్ షెట్టీ తన స్నేహితుడు హర్ష్ మస్కరతో కలిసి 'మెటా మ్యాన్' పేరుతో డిజైన్-ఓరియెంటెడ్ 'డైరెక్ట్-టు-కన్స్యూమర్ బ్రాండ్' (డీ2సీ)కి శ్రీకారం చుట్టాడు. ప్రారంభించిన ఆరు నెలలోనే ఈ బ్రాండ్ సూపర్ డూపర్ హిట్ అయింది...


అనీల్ షెట్టి



లండన్‌కు చెందిన మార్కెట్ రిసెర్చ్ కంపెనీ 'యూరోమానిటర్ ఇంటర్నేషనల్' అంచనా ప్రకారం మెన్ జువెలరీకి సంబంధించి ఇండియా థర్డ్-లార్జెస్ట్ మార్కెట్‌గా ఎదగనుంది. 'మెటామ్యాన్'కు ముందు సునీల్ షెట్టితో కలిసి మాట్లాడాడు అనీల్. ఈ ఆలోచన నచ్చడంతో కంపెనీ ఫౌండింగ్ మెంటర్, ఇన్వెస్టర్‌గా ఉండడానికి ముందుకు వచ్చాడు సునీల్ షెట్టి. హిప్-హప్ జువెలరీ ధరించడం అనేది ఇండియాలో బలపడుతున్న ట్రెండ్ అయినప్పటికీ ఏవో కొన్ని తప్ప తగినన్నీ ఆప్షన్స్ లేవు. ఈ లోటును భర్తీ చేయడానికి 'మెటామ్యాన్'తో ముందుకు వచ్చి సక్సెస్ అయింది.

ట్రెండ్‌తో పాటు బడ్జెట్‌ను కూడా దృష్టిలో పెట్టుకొని అందుబాటు ధరల్లో బ్రాస్‌లెట్స్, చైన్స్, రింగ్స్....మొదలైన వాటిని డిజైన్ చేయించారు. సందర్భానికి తగినట్లుగా డైలీ ఆఫీస్ వియర్, క్యాజువల్ వియర్, స్పోర్ట్స్ వియర్, ట్రావెల్ వియర్....మొదలైన వాటిని డిజైన్ చేయించారు.

'మెటామెన్' పీసెస్‌లు ఫిల్మ్‌ఫేర్, లైఫ్‌స్టైల్ ఏసియాలాంటి మ్యాగజైన్‌లలో కనిపించడంతో వాటికి మరింత ప్రాచుర్యం వచ్చింది. ఈ కంపెనీ ఏంజెల్ ఇన్వెస్టర్ జాబితాలో సునీల్ షెట్టితో పాటు నిఖిల్ కామత్ (జెరోధ), కేఎల్ రాహుల్ (ఇండియన్ క్రికెటర్), ఆశిష్ (బుక్‌మై షో), ప్రశాంత్ ప్రకాష్ (యాక్సెల్ పార్ట్నర్స్), సుజీత్ కుమార్ (ఉడాన్), హర్షిల్ మాథుర్, శశాంక్ కుమార్ (రేజర్‌పే) చేరారు.

రాబోయే ఆరు నెలల కాలంలో రెండు వందల కొత్త ప్రాడక్ట్స్ డిజైన్ చేయడానికి రెడీ అయింది మెటామ్యాన్. 2024లో దుబాయ్, ఇండోనేషియా, సింగపూర్, ఆస్ట్రేలియాలలో తమ బ్రాండ్‌ను విస్తరించే పనిలో ఉంది.

అనీల్ షెట్టికి ఫ్యాషన్ నుంచి పాలిటిక్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వరకు ఎన్నో రంగాలపై ఆసక్తి ఉంది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనే కల ఉంది. తన కలను నిజం చేసుకునే దారిని వెదుక్కునే క్రమంలో అనీల్‌కు సునీల్ షెట్టి మాటలు దారి చూపించాయి. పురుషుల యాక్సెసరీస్, జువెలరీ మార్కెట్‌లో గెలుపు జెండా ఎగరేసేలా చేశాయి.

'ఆసియాలోని లీడింగ్ జెన్ జెడ్ జువెలరీ బ్రాండ్‌గా ఎదగాలనేది మా లక్ష్యం' అంటున్నాడు 'మెటామ్యాన్' కో-ఫౌండర్ అనీల్ శెట్టి.

యూరేక మూమెంట్

యూరేక మూమెంట్ అనేది ఏ వ్యక్తికి అయినా ఏదో ఒక సమయంలో వస్తుంది. తల్లి నెక్లెస్‌ను మెడలో ధరించిన సునీల్ షెట్టిని చూసిన తరువాత నాకు ఐడియా వచ్చింది. మెన్ జువెలరీ అనేది మన దేశంలో వినూత్న కాన్సెప్ట్. ఐడియా కొత్తగా ఉన్నంత మాత్రాన సక్సెస్ కావాలని లేదు. 360 డిగ్రీ కోణంలో ఆలోచించి మంచి, చెడులపై ఒక అవగాహనకు వచ్చాం. ఫ్యాషన్ జువెలరీ ధరించాలనే ఆసక్తి పురుషులకు ఉన్నప్పటికీ అట్రాక్టివ్, క్వాలిటీ డిజైన్‌లు వారికి కనిపించడం లేదు. ఈ లోటును పూరించేలా మా జువెలరీని డిజైన్ చేసి సక్సెస్ సాధించాం.
– అనీల్ షెట్టి, మెటామ్యాన్, కో-ఫౌండర్



ఫ్లెక్సిబుల్ మొబైల్ హోల్డర్

బ్రాండ్: CQLEK కలర్: బ్లాక్; మెటీరియల్: ఏబీఎస్ ప్లాస్టిక్, ఫోమ్ ప్యాగింగ్ కంపాటబుల్: స్మార్ట్‌ఫోన్ డివైజెస్
● ఆల్ మొబైల్ ఫోన్స్ సైజ్ అప్ టూ: 7 ఇంచ్.
● లైట్ వెయిట్, రొటేటబుల్, నాన్-స్లిప్, స్క్రాచ్ రెసిస్టెంట్, ఫోల్డబుల్

● మ్యూజిక్ వరల్డ్

బిల్‌బోర్డ్ టాప్ సింగర్


వోలివియ రోడ్రిగో

అమెరికన్ సింగర్, సాంగ్‌రైటర్, నటి వోలివియ రోడ్రిగో డెబ్యూ సింగిల్ 'డ్రైవర్స్ లైసెన్స్'తో సంగీతప్రపంచంలో తనదైన ముద్ర వేసింది. వోలివియకు స్ట్రాంగ్ యంగ్ ఫ్యాన్ బేస్ ఉంది. ఇరవై సంవత్సరాల రోడ్రిగోకు యూత్ పల్స్ తెలుసు. 'పాట అనేది పక్షిలాంటిది. అది ఎప్పుడు వచ్చి మన భుజం మీద వాలుతుందో తెలియదు. ఇవ్వాళ ఎలాగైనా సరే ఒక పాట చేసేయాలి అని కూర్చొని విఫలమైన సందర్భాలు ఎన్నో. టూరింగ్, రైటింగ్, రికార్డింగ్‌లను ఇష్టపడే రోడ్రిగో టూర్‌లో ఉన్నప్పుడు రాయకూడదు అనుకుంటుంది. కాని అందమైన జలపాతాన్ని చూస్తున్నప్పుడో, చిరుగాలి సితార సంగీతం వినిపించినప్పుడో ఒక పాట అప్పటికప్పుడే పుట్టవచ్చు!

'పాటలు రాసే, పాడే నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడూ మెరుగుపరుచుకోవాలి. ప్రతి రోజూ మనకు ఏమీ తెలియని ఒక కొత్త రోజే' అంటున్న వోలివియ రోడ్రిగో బిల్‌బోర్డ్ గ్రేటెస్ట్ పాప్ స్టార్స్ 2023 జాబితాలో చోటు సంపాదించింది.

● అవును... ఇది నిజమే!

● 'జిమ్నాస్టిక్స్' అనేది పురాతన గ్రీకు పదం 'జిమ్నాజీన్' నుంచి పుట్టింది. దీని అర్థం నగ్నంగా వ్యాయామం చేయడం. యువకులకు యుద్ధ విద్యలలో శిక్షణ ఇచ్చే విధానం 'జిమ్నాజీన్' కాలక్రమంలో ఎన్నో మార్పులకు లోనైంది.

● ఐస్‌ల్యాండ్‌లో క్రిస్మస్ పండగ కానుకలుగా పుస్తకాలను ఒకరికి ఒకరు పంచుకునే సంప్రదాయం ఉంది. ఈ సంప్రదాయాన్ని 'ది క్రిస్మస్ బుక్ ఫ్లడ్' అంటారు. ఇతర దేశాలతో పోల్చితే సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు ప్రచురణ కర్తలు అత్యధిక సంఖ్యలో పుస్తకాలు అమ్ముతారు కాబట్టి దీనికి 'ది క్రిస్మస్ బుక్ ఫ్లడ్' అని పేరు వచ్చింది.



● 'బే క్యాట్' అనేది అత్యంత అరుదైన పిల్లి జాతి. ఇవి ఆగ్నేయ ఆసియాలోని బోర్నియో ద్వీపంలో మాత్రమే నివసిస్తాయి. అటవీ నిర్మూలన వల్ల వీటి సంఖ్య విపరీతంగా తగ్గి ప్రమాదపు అంచున ఉన్నాయి. అంతరించి పోతున్న జాతుల జాబితాలో వీటిని చేర్చారు.

● టెక్.. టాక్

ఇన్‌ఫినిక్స్ స్మార్ట్ 8 హెచ్‌డీ



సైజ్: 6.6 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 90 హెచ్‌జడ్
ర్యామ్: 3 జీబి
స్టోరేజ్: 64జీబి
బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్
కలర్స్: టింబర్ బ్లాక్, క్రిస్టల్ గ్రీన్, గెలాక్సీ వైట్

వాట్సాప్ సెండ్ వాయిస్ మెసేజెస్

ఒకసారి విన్న తరువాత మాయం అయ్యే 'సెండ్ వాయిస్ మెసేజెస్' ఫీచర్ గురించి ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ ప్రకటించింది. ఫోటోలు, వీడియోలకు సంబంధించి వాట్సాప్‌లో అందుబాటులో ఉన్న 'వ్యూ వన్స్'కు ఇది అదనపు చేర్పు. క్రెడిట్ కార్డు వివరాలను ఇతరులతో పంచుకునే సందర్భంలో, సెన్సిటివ్ మ్యాటర్‌కు సంబంధించి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఈ ఆడియో మెసేజ్‌లు ఫోటోలు, వీడియోలను చూడడానికి అనుగుణంగా ఉంటాయి. 'వన్-టైమ్' ఐకాన్‌తో మార్క్ చేయబడి ఉంటాయి. ఫోటో, వీడియో, ఆడియో మెసేజ్ వచ్చిన తర్వాత 14 రోజుల్లో దాన్ని ఓపెన్ చేయాల్సి ఉంటుంది. లేకపోతే మెసేజ్ గడువు ముగుస్తుంది.




గూగుల్ మెసేజెస్‌లో ఎడిట్ ఫీచర్

Google Messages

పాపులర్ మెసేజింగ్ యాప్ 'గూగుల్ మెసేజెస్'లో వాట్సాప్‌లో ఉండే 'ఎడిట్' ఫీచర్ తరహా ఫీచర్ రానుంది. ఈ ఫీచర్ ద్వారా యూజర్‌లు పంపిన మెసేజ్‌లను ఎడిట్ చేయవచ్చు. ఐ ఇమేజ్, వాట్సాప్‌లలో ఎడిట్ ఫీచర్‌కు టైమ్ లిమిట్ ఉన్నట్లు దీనిలో ఉంటుందా? రిసీవర్‌కు ఎడిట్ హిస్టరీ చూసే అవకాశం ఉంటుందా? ఐ ఇమేజెస్, వాట్సాప్‌లోలాగా సెంట్ చేసిన మెసేజ్‌లను డిలీట్ చేసే అవకాశం ఉందా? అనేది తెలియదు. 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' స్టేజీలో ఉన్న ఈ ఫీచర్ ఎప్పుడు అందుబాటులోకి రానుందో కంపెనీ తెలియజేయలేదు.

గ్యాంగ్‌స్టర్ రాక్షస రాజా

రానా హీరోగా తేజ దర్శకత్వంలో వచ్చిన 'నేనే రాజు నేనే మంత్రి' (2017) సూపర్ హిట్ అయిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ కాంబినేషన్‌లో రెండో చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. రానా పుట్టినరోజు (డిసెంబర్ 14) సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ని 'రాక్షస రాజా'గా ప్రకటించి, రానా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''ఇప్పటివరకూ చూడని క్రైమ్ వరల్డ్‌ని ఆవిష్కరిస్తూ ఇంటెన్స్ ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామాల సమ్మేళనంతో ఈ చిత్రం ఉంటుంది. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రూపొందించనున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఓ అద్భుతమైన అనుభూతికి గురి చేస్తుంది. గ్రిప్పింగ్ కథనం, వండర్‌ఫుల్ విజువల్స్‌తో 'రాక్షస రాజా' తెలుగు పరిశ్రమలో కొత్త బెంచ్ మార్క్‌ను సెట్ చేయడానికి రెడీ అవుతోంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● రానా


సెట్‌లో స్టార్ట్

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా ఫిల్మ్ 'మట్కా'. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. కరుణ కుమార్ దర్శకత్వంలో ఈ పాన్ ఇండియన్ చిత్రాన్ని విజయేందర్ రెడ్డి తీగల, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్నారు. వైజాగ్ నేపథ్యంలో సాగే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. ''యావత్ దేశాన్ని కదిలించిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా 'మట్కా'ను తెరకెక్కిస్తున్నాం. ఇందులో వరుణ్ తేజ్ నాలుగు విభిన్నమైన గెటప్స్‌లో కనిపిస్తారు. ఈ సినిమా కథాంశం ప్రధానంగా 1958-1982ల మధ్య జరుగుతుంది. అందుకుని 1950, 1980 నాటి పరిస్థితులను రీ క్రియేట్ చేస్తున్నాం. అలా రీ క్రియేట్ చేసిన ఓ భారీ సెట్‌లోనే 'మట్కా' షూటింగ్ జరుగుతోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.


● వరుణ్ తేజ్

శబ్దంతో థ్రిల్

దాదాపు పదిహేనేళ్లకు హీరో ఆది పినిశెట్టి-డైరెక్టర్ అరివళగన్-మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌ల కాంబినేషన్ కుదిరింది. గతంలో ఈ ముగ్గురి కాంబినేషన్‌లో వచ్చిన సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'ఈరమ్' (2009) మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. తెలుగులో 'వైశాలి'గా విడుదలైంది. ఇక తాజాగా వీరి కాంబోలో తెలుగు, తమిళ ద్విభాషా చిత్రంగా 'శబ్దం' తెరకెక్కుతోంది. ఇది కూడా సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ కావడం విశేషం. 7ఎ ఫిలింస్ శివ, ఆల్ఫా ఫ్రేమ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని హీరో నాని విడుదల చేశారు. ''ఈ 'శబ్దం'లో శబ్దానికి సంబంధించి ప్రత్యేక సన్నివేశాలు ఉంటాయి. ఇంటర్వెల్ సీక్వెన్స్ కోసమే రూ. 2 కోట్లతో 120 ఏళ్ల నాటి లైబ్రరీ సెట్‌ను నిర్మించాం. ఈ సినిమా కోసం తమన్ ప్రత్యేకమైన సౌండ్ ఎఫెక్ట్స్, ఆర్‌ఆర్ చేయడానికి హంగేరీకి వెళ్లాలని ప్లాన్ చేస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రానికి కెమెరా: అరుణ్ పద్మనాభన్, సహనిర్మాత: భానుప్రియ శివ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్. బాలకుమార్.


● ఆది పినిశెట్టి

నా ఎనిమిదేళ్ల కల నెరవేరింది
– దర్శకుడు అను ప్రసాద్



విరాజ్ అశ్విన్, పూజితా పొన్నడ జంటగా అను ప్రసాద్ దర్శకత్వంలో నిరీష్ తిరువీధుల నిర్మించిన చిత్రం 'జోరుగా హుషారుగా..'. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్లతో అను ప్రసాద్ మాట్లాడుతూ– ''తూర్పుగోదావరిలోని పెద్దాపురం స్వస్థలం. సినిమాలపై ఆసక్తితో ఇండస్ట్రీకి వచ్చాను. జూనియర్ ఆర్టిస్టు, లైట్‌మేన్‌గా చేశాను. ఎడిటింగ్‌లో నైపుణ్యం ఉంది. నా దర్శకత్వంలో వచ్చిన షార్ట్ ఫిల్మ్ చూసి, నిరీష్‌గారు చాన్స్ ఇచ్చారు. అలా దర్శకుడ్ని కావాలనుకున్న నా ఎనిమిదేళ్ల కల 'జోరుగా హుషారుగా'తో నెరవేరింది. నా మిత్రుడి జీవితంలో జరిగిన ఓ ఘటన ఆధారంగా ఈ సినిమా కథ రాశాను. ఓ గ్రామం నుంచి పట్నానికి వచ్చిన సంతోష్ (విరాజ్ పాత్ర) జీవితంలో జరిగన ఓ ఘటన అతని జీవితాన్ని ఏ విధంగా మార్చింది? తన కుటుంబాన్ని సంతోష్ ఏ విధంగా కాపాడుకున్నాడు? అన్నది ఈ సినిమా. మంచి హాస్యం, భావోద్వేగం, సంగీతం ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.


● ప్రీతీ ముకుందన్

కన్నప్పలో కథానాయికగా..

కన్నప్పలో భాగమయ్యారు ప్రీతీ ముకుందన్. శివ భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'కన్నప్ప'. విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న ఈ సినిమాకు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. ప్రభాస్, మోహన్‌బాబు, బ్రహ్మానందం, మోహన్‌లాల్, శివరాజ్ కుమార్, శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ న్యూజిల్యాండ్‌లో జరుగుతోందని సమాచారం. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ప్రీతీ ముకుందన్‌ను ఎంపిక చేసినట్లు గురువారం చిత్ర యూనిట్ వెల్లడించింది. ''ప్రీతికి ఇది తొలి సినిమా. 'కన్నప్ప' సినిమాలోని హీరోయిన్ పాత్రకు ఆమె సరిగ్గా సరిపోతుంది. నాట్య కళలో ప్రీతికి ప్రావీణ్యం ఉంది. 'కన్నప్ప'లో ఆమె పాత్రకు కొన్ని యాక్షన్ సన్నివేశాలు కూడా ఉన్నాయి'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది.

నిజాయితీగా శ్రమిస్తే సక్సెస్ గ్యారంటీ
– దర్శకుడు శివ నిర్వాణ

'సత్యం' రాజేశ్, మేఘా చౌదరి హీరో హీరోయిన్లుగా, ఎస్తేర్ ఓ కీలక పాత్ర చేసిన చిత్రం 'టెనెంట్'. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ వేడుకలో దర్శకుడు శివ నిర్వాణ, నిర్మాత సాహు గారపాటి, నటుడు 'సుడిగాలి' సుధీర్ అతిథులుగా హాజరై 'టెనెంట్' ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''సినీ పరిశ్రమను నమ్ముకుని నిజాయితీగా శ్రమిస్తే ఆలస్యమైనా సక్సెస్ తప్పకుండా వస్తుందనడానికి నిదర్శనం 'సత్యం' రాజేశ్, 'సుడిగాలి' సుధీర్. ఈ ఇద్దరూ కష్టపడి హీరోలుగా నిరూపించుకున్నారు. యుగంధర్ ప్రతిభ గల వ్యక్తి'' అన్నారు శివ నిర్వాణ. ''ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు సాహు గారపాటి. ''సత్యం' రాజేశ్‌గారు వరుస హిట్స్ సాధించడం ఆనందంగా ఉంది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుంది'' అన్నారు 'సుడిగాలి' సుధీర్. ''ఈ సినిమా కథలోని ఎమోషన్స్‌కు ఆడియన్స్ కనెక్ట్ అవుతారు'' అన్నారు 'సత్యం' రాజేశ్.


● చంద్రశేఖర్, సాహు గారపాటి, శివ నిర్వాణ, యుగంధర్, రాజేశ్, మేఘ, సుధీర్

ఆ భయం లేదు!
– ఖుషీ రవి



''లాక్‌డౌన్ తర్వాత ప్రేక్షకులు వినోదాన్ని ఆస్వాదించే విధానం మారింది. కథ, నటీనటుల పాత్రల్లో కొత్తదనం ఉంటేనే చూస్తున్నారు. అందుకే ప్రయోగాత్మక, కొత్త తరహా పాత్రలే చేయాలనుకుంటున్నాను. కథ నచ్చి, అందులో నా పాత్ర బలంగా ఉంటే గ్లామరస్ పాత్రలు చేయడానికి కూడా రెడీ'' అన్నారు ఖుషీ రవి. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా సాయికిరణ్ దైదా దర్శకత్వంలో యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన హారర్ చిత్రం 'పిండం'. ఈ చిత్రం ఈ నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఖుషీ రవి మాట్లాడుతూ– ''నటిగా కన్నడంలో 'దియా' నా తొలి చిత్రం. ఆ చిత్రం తర్వాత పెళ్లి చేసుకున్నాను. నాకో పాప ఉంది. ఇక 'పిండం' సినిమా విషయానికి వస్తే... ఈ సినిమాలో నేను మేరీ పాత్రలో నటించాను. కథ రీత్యా ఇద్దరు కుమార్తెలు నాకు. మూడో ప్రసవం కోసం గర్భిణిని. కెరీర్ ప్రారంభంలోనే తల్లి పాత్ర చేస్తే నా కెరీర్ ఏమౌతుందోననే భయం, అభద్రతాభావం నాకు లేవు. నా మరో చిత్రం 'రుద్ర'లో ట్రాన్స్‌జెండర్ పాత్ర చేస్తున్నాను. సవాల్ అనిపించే పాత్రలు చేయడం నాకు ఇష్టం'' అని చెప్పుకొచ్చారు.

సరికొత్త దళారి


● షకలక శంకర్, రాజీవ్ కనకాల

రాజీవ్ కనకాల, 'షకలక' శంకర్ ప్రధాన పాత్రల్లో శ్రీతేజ్, అక్సా ఖాన్, రూపిక కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'దళారి'. కాచిడి గోపాల్‌రెడ్డి దర్శకత్వంలో ఎడవెల్లి వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాజీవ్ కనకాల మాట్లాడుతూ– ''ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది'' అన్నారు. ''దళారి'ని రెండు భాగాలుగా తీశాం. ఇప్పుడు తొలి భాగం రిలీ జవుతోంది. ఇందులో మంచి కథ, యాక్షన్ ఉన్నాయి. ఈ సినిమా క్లైమాక్స్ బాగా వచ్చింది'' అన్నారు 'షకలక' శంకర్. ''ఒక ఊరిలోని వెంకట్ రెడ్డి అనే వ్యక్తి జీవితాన్ని ప్రేరణగా తీసుకుని ఈ సినిమా కథ చేశాం'' అన్నారు కాచిడి గోపాల్‌రెడ్డి. ''త్వరలోనే దళారి 2' చేస్తాం'' అన్నారు వెంకట్ రెడ్డి.

నేల మీద నేను ఉన్నా...


● సోహైల్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవీ హీరో హీరోయిన్లుగా రూపొందిన గ్రామీణ ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వంలో గోనాల్ వెంకటేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ చిత్రం నుంచి 'నేల మీద నేను ఉన్నా..' అంటూ సాగే ఫాస్ట్ మాస్ బీట్ సాంగ్‌ను బిగ్ బాస్ ఫేమ్ సోహైల్ విడుదల చేశారు. కొల్లి చైతన్య స్వరపరచిన ఈ పాటను వసంత్ వెంకట్ బాలా రాయగా వీఎం మహాలింగం, ఎంఎం మానసి ఆలపించారు.

నాలుగు కథలతో...


● మహేశ్, స్పందన

యడ్లపల్లి మహేశ్, స్పందన సోమన, కేశవ, రాజశేఖర్, చాందిని, సుదర్శన్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'కరెన్సీ నగర్'. వెన్నెల కుమార్ పోతేపల్లి దర్శకత్వంలో ముక్కాముల అప్పారావు, డా. కోడూరు గోపాలకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ''ఈ చిత్రంలో డబ్బుకీ, మనిషికీ ఉన్న సంబంధాన్ని వెన్నెల కుమార్ చక్కగా చూపించారు. నాలుగు కథలతో ఈ చిత్రం సాగుతుంది'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్

శుక్రవారం
15-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
930	256
70,514	21,183

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	14,805	▲	75
డోజోన్స్	37,268	▲	178
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,649	▲	101
డాక్స్	16,752	▼	14
షాంఘై	2,959	▼	10
నికాయ్	32,686	▼	240

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
62,396	▲ 1,195
బంగారం (99.5 స్వచ్ఛత)	
62,146	▲ 1,190
వెండి (కేజీ)	
73,993	▲ 3,095

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.90	83.92
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.24	106.80
€	యూరో	ఎస్‌బీఐ	89.83	92.19
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.67	57.96
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.12	57.06
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.38	63.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	21.89
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.56	12.63

'డో జోన్స్ సస్టెయినబిలిటీ' సూచీలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తాజాగా 2023కి గాను స్టాండర్డ్ అండ్ పూర్ డో జోన్స్ సస్టెయినబిలిటీ వరల్డ్ ఇండెక్స్ (డీజేఎస్‌ఐ వరల్డ్)లో చోటు దక్కించుకుంది. ఈ గుర్తింపు దక్కించుకున్న తొలి భారతీయ ఫార్మా కంపెనీ తమదేనని సంస్థ తెలిపింది. డీజేఎస్‌ఐ వరల్డ్‌లో కొత్తగా చోటు సాధించడంతో పాటు వరుసగా ఎనిమిదో సంవత్సరంలోనూ డీజేఎస్‌ఐ వర్ధమాన మార్కెట్ల (డీజేఎస్‌ఐ ఈఎం) సూచీలోనూ డాక్టర్ రెడ్డీస్ తన స్థానాన్ని పదిలపర్చుకుంది. మరోవైపు, అంతర్జాతీయ సస్టెయినబిలిటీ రేటింగ్స్ ఏజెన్సీ ఎకోవాడిస్ నుంచి 'గోల్డ్ మెడల్' హోదాను అందుకున్నట్లు సంస్థ తెలిపింది. 100 మార్కులకు గాను 70 మార్కులు దక్కించుకుంది. పర్యావరణ అనుకూల విధానాలతో పాటు పేషంట్లు, ఉద్యోగులు, గవర్నెన్స్ తదితర అంశాల్లో అత్యుత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, ముందుకు సాగుతున్నట్లు ఈ సందర్భంగా కంపెనీ కో–చైర్మన్ జీవీ ప్రసాద్ తెలిపారు.

బీ న్యూ స్టోర్లలో రియల్‌మీ సీ67 5జీ స్మార్ట్ ఫోన్

హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్ బీ న్యూ మొబైల్స్–ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో రియల్‌మీ సీ67 5జీ స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో 150కి పైగా బీ న్యూ షోరూంల్లో ఈ మోడల్ ఫోన్ లభిస్తుంది. హైదరాబాద్ మాదాపూర్‌లోని స్టోర్‌లో జరిగిన సమావేశంలో రియల్‌మీ సీ67 5జీ ఫీచర్లు, ఆఫర్ల గురించి సంస్థ సీఎండీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నిఖిలేష్, ఎండీ సాయి నితేష్‌లు వెల్లడించారు.



ఈ స్మార్ట్ ఫోన్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 12జీబీ+ 256 జీబీ వేరియంట్ ధర రూ.52,999 కాగా.. 6జీబీ+ 128 వేరియంట్ ధర 14,999గా ఉంది. బజాజ్, హెచ్‌డీబీ, హెచ్‌డీఎఫ్‌సీ, టీవీఎస్, క్రెడిట్, బీనా, ఐడీఎఫ్‌సీ, క్లైవర్‌పే ద్వారా నెలవారీ వాయిదాలతో రియల్‌మీ సీ67 5జీ ఫోన్ పొందవచ్చన్నారు. కస్టమర్లంతా బీ న్యూ స్టోర్లను సందర్శించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ ప్రతినిధులు కోరారు.

మార్కెట్‌కు 'ఫెడ్' జోష్..

- ఇంట్రాడే, ముగింపులో కొత్త రికార్డుల నమోదు
- కలిసొచ్చిన ఎఫ్‌ఐఐల వరుస కొనుగోళ్లు
- ఐటీ, ఫైనాన్స్, రియల్టీ, బ్యాంకింగ్ షేర్ల ర్యాలీ
- ఆల్ టైం హైకి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వరుసగా మూడో సారి కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడంతో పాటు వచ్చే ఏడాదిలో మూడు సార్లు వడ్డీరేట్ల కోత ఉండొచ్చని సంకేతాలివ్వడంతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్ ఒక శాతానికి పైగా ర్యాలీ చేసింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగడం, క్రూడాయిల్ ధరలు దిగిరావడం సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. ఫలితంగా ఐటీ, టెక్, టెలికం, ఫైనాన్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్, నిఫ్టీలు తాజాగా సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. సెన్సెక్స్ 930 పాయింట్లు పెరిగి 70,514 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 256 పాయింట్లు లాభపడి 21,183 వద్ద నిలిచింది. ఈ ముగింపులు సూచీలకు జీవితకాల గరిష్ట స్థాయిలు కావడం విశేషం.

ఇంట్రాడేలోనూ ఆల్‌టైం నమోదు

ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు అందిపుచ్చుకున్న స్టాక్ సూచీలు ఉదయం భారీ లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 561 పాయింట్లు పెరిగి 70,146 వద్ద, నిఫ్టీ 184 పాయింట్లు బలపడి 21,110 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఒక్క కన్జూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రోజంతా స్థిరమైన లాభాల్లో కదలాడాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 1018 పాయింట్లు ఎగసి 70,602 వద్ద, నిఫ్టీ 285 పాయింట్లు బలపడి 21,211 వద్ద ఆల్‌టైం గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి.

''ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సరళతర ద్రవ్య విధాన అమలు యోచన వ్యాఖ్యలతో బాండ్ల నుంచి పెట్టుబడులు ఒక్కసారిగా ఈక్విటీల్లోకి మళ్లాయి. అందుకు సంకేతంగా అమెరికా బాండ్లపై రాబడులు అనూహ్యంగా 4% క్షీణించడం ఇన్వెస్టర్లకు మరింత విశ్వాసాన్నిచ్చింది. భారత జీడీపీ అవుట్‌లుక్ అంచనా పెంపు, ద్రవ్యోల్బణాన్ని లక్షిత స్థాయి(5.4%)కి కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ నిర్ణయం తీసుకోవడం వంటి అంశాలు స్టాక్ సూచీలను సరికొత్త శిఖరాలకు చేర్చాయి. ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదు, వచ్చే ఏడాది ద్వితీయార్థం నుంచి ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే ఆశావహ అంచనాలతో స్టాక్ మార్కెట్ మరికొంత కాలం ర్యాలీ చేయొచ్చు'' అని మెహ్తా ఈక్విటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే తెలిపారు.

- సూచీల రికార్డు ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.3.83 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ జీవితకాల గరిష్టం రూ.351.19 లక్షల కోట్లకు చేరింది.
- ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాలు దేశీయ ఐటీ కంపెనీల షేర్లకు కలిసొచ్చింది. రుణ వ్యయాలు, ద్రవ్యోల్బణం తగ్గితే అమెరికా క్లయింట్లు చేసే ఐటీ కేటాయింపులు పెరుగుతాయి. దిగ్గజ ఐటీ ఇన్ఫోసిస్ 4%, టీసీఎస్ 2%, హెచ్‌సీఎల్‌టెక్ 3%, టెక్ మహీంద్రా, విప్రో 3.50%, కోఫోర్జ్ 6%, ఎల్‌అండ్‌టీ 3.50% చొప్పున లాభపడ్డాయి.

పసిడి, వెండి దూకుడు

- ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ డౌన్
- ఫెడ్ వడ్డీ రేట్లు యథాతథం

న్యూయార్క్: ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచేందుకే మరోసారి కట్టుబడటంతో అటు స్టాక్స్, ఇటు పసిడి, వెండి, చమురు జంప్ చేశాయి. వరుసగా మూడోసారి యథాతథ పాలసీ అమలుకే ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) నిర్ణయించింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 5.25–5.5 శాతం వద్దే కొనసాగనున్నాయి. వడ్డీ రేట్లకు కీలకమైన ద్రవ్యోల్బణం (సీపీఐ) ఫెడ్ లక్ష్యమైన 2 శాతానికిపైనే కొనసాగుతోంది. నవంబర్ నెలకు 3.1 శాతానికి చేరింది. అయితే యూఎస్ ఆర్థిక వ్యవస్థ మూడో త్రైమాసికంలో చూపిన వృద్ధి వీడి బలహీనపడుతున్న సంకేతాలు వెలువడుతున్నట్లు ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ అభిప్రాయపడ్డారు. వెరసి వచ్చే ఏడాది(2024) కనీసం మూడుసార్లు వడ్డీ రేట్ల తగ్గింపు చర్యలుండవచ్చన్న అంచనాలు బలపడ్డాయి. ఫెడ్ రేట్లు 4.5–4.75కు దిగిరావచ్చని అంచనా. తాజా అంచనాల ప్రకారం 2023లో 2.6 శాతం వృద్ధి చూపేవీలున్న ఎకానమీ 2024లో 1.4 శాతానికి పరిమితం కావచ్చు. ద్రవ్యోల్బణం 2.4 శాతానికి తగ్గే వీలుంది. ఈ నేపథ్యంలో యూఎస్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లు, పసిడి, వెండి భారీగా ర్యాలీ చేశాయి. మరోపక్క ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ 2.2 శాతం తగ్గి 3.95 శాతానికి చేరాయి.

కమోడిటీలు జూమ్

న్యూయార్క్ కామెక్స్‌లో పసిడి ఔన్స్(31.1 గ్రాములు) 3 శాతం జంప్‌చేసి 2,055 డాలర్లకు చేరింది. వెండి ఔన్స్ 6.3 శాతం దూసుకెళ్లి 24.36 డాలర్లను అధిగమించింది. ఇక లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు 3.6 శాతం ఎగసి 76.9 డాలర్లకు, నైమెక్స్‌లో డబ్ల్యూటీఐ చమురు 3.8 శాతం బలపడి 72 డాలర్లను తాకింది. యూఎస్ స్టాక్ ఇండెక్స్ డోజోన్స్ బుధవారం 500 పాయింట్లు పుంజుకోగా.. గురువారం సెన్సెక్స్ 930 పాయింట్లు దూసుకెళ్లింది.

నవంబర్‌లో ఆహార ధరల భారం

- 'మైనస్' నుంచి 'ప్లస్'లోకి టోకు ధరలు
- 0.26 శాతంగా నమోదు



న్యూఢిల్లీ: ఏడు నెలల పాటు 'క్షీణత'లో (ప్రతి ద్రవ్యోల్బణం) ఉన్న టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం నవంబర్‌లో 'ప్లస్'లోకి మారింది. ఎనిమిది నెలల గరిష్ట స్థాయిలో 0.25%గా నమోదయ్యింది. ఆహార ఉత్పత్తులు ప్రత్యేకించి ఉల్లి, కూరగాయల ధరల తీవ్రత దీనికి ప్రధాన కారణం. ఏప్రిల్‌లో ప్రతి ద్రవ్యోల్బణం బాటకు మారిన టోకు ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో మైనస్ 0.52%గా నమోదయ్యింది. మార్చిలో టోకు ద్రవ్యోల్బణం 1.41%. ''2023 నవంబర్‌లో ద్రవ్యోల్బణానికి ప్రధానంగా ఆహార ఉత్పత్తులు, ఖనిజాలు, యంత్రాలు, పరికరాలు, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఆప్టికల్ ఉత్పత్తులు, మోటారు వాహనాలు, ఇతర రవాణా పరికరాలు, తయారీ మొదలైన వాటి ధరల పెరుగుదల కారణం'' అని వాణిజ్య పరిశ్రమల శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

విస్తరణ బాటలో కియా ఇండియా

సోనెట్ ఎస్‌యూవీ లేటెస్ట్ వెర్షన్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ: దక్షిణ కొరియా ఆటోమొబైల్ సంస్థ కియా భారత్‌లో తమ ఉత్పత్తి, సేల్స్ నెట్‌వర్క్, ఉత్పత్తుల శ్రేణిని వచ్చే ఏడాది మరింతగా విస్తరించే యోచనలో ఉంది. కొత్తగా మరో 100 సేల్స్ అవుట్‌లెట్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు స్థాపిత ఉత్పత్తి సామర్థ్యాన్ని లక్ష యూనిట్ల మేర పెంచుకోనుంది. కాంపాక్ట్ ఎస్‌యూవీ సోనెట్ లేటెస్ట్ వెర్షన్‌ను గురువారం అంతర్జాతీయంగా ఆవిష్కరించిన నేపథ్యంలో కియా ఇండియా ఎండీ టే–జిన్ పార్క్ ఈ విషయాలు తెలిపారు. కంపెనీకి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్లాంటుకు ఏటా 3.4 లక్షల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంది. 429 సేల్స్ అవుట్‌లెట్స్ ఉన్నాయి. వచ్చే ఏడాది కార్నివాల్ ఎంపీవీ కొత్త వెర్షన్‌ను భారత్‌లో ప్రవేశపెట్టనున్నట్లు పార్క్ తెలిపారు. ఆ తర్వాత సెల్టోస్ కన్నా పెద్ద మోడల్స్‌ను కూడా తీసుకొచ్చే యోచనలో ఉన్నట్లు చెప్పారు. 2025లో స్థానికంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీని పెద్ద ఎత్తున ప్రారంభించాక ఏటా కొత్త మోడల్స్‌ను ప్రవేశపెడతామని ఆయన పేర్కొన్నారు. 2030 నాటికి భారత ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లో 15–17 శాతం వాటాను దక్కించుకోవాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు.

మరిన్ని నగరాలకు ఫ్రెష్‌బస్ సర్వీసులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పూర్తి ఎలక్ట్రిక్ బస్సులతో ఇంటర్‌సిటీ సర్వీసులు నిర్వహించే ఫ్రెష్‌బస్ త్వరలో మరిన్ని నగరాలకు విస్తరించనుంది. వచ్చే 3–6 నెలల్లో విజయవాడ నుంచి విశాఖపట్నం, తిరుపతికి, హైదరాబాద్–రాజమండ్రి తదితర రూట్లలో సర్వీసులు ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో సుధాకర్ రెడ్డి చిర్రా తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్–విజయవాడ, బెంగళూరు–తిరుపతి మధ్య దాదాపు 40 సర్వీసులు నడుస్తున్నట్లు వివరించారు. ఇప్పుడు 20 బస్సులు ఉన్నాయని, 2025 మార్చి నాటికి వీటిని 170కి, 2027 నాటికి 1,000కి పెంచుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యకలాపాల విస్తరణ కోసం రూ. 100 కోట్లు సమీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు దాదాపు రూ. 23.5 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు వివరించారు. ఆర్‌టీసీతో పోలిస్తే 25 శాతం తక్కువకే తమ సర్వీసులను అందిస్తున్నట్లు సుధాకర్ రెడ్డి చెప్పారు. బస్ టికెటింగ్ ప్లాట్‌ఫాం అభిబస్‌ను ఇక్సిగో సంస్థకు విక్రయించిన అనంతరం సుధాకర్ రెడ్డి ఫ్రెష్‌బస్‌ను ప్రారంభించారు.

సాక్షి స్పోర్ట్స్



నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్

వచ్చే ఏడాది ఐపీఎల్ టి20 టోర్నీలో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని ఫ్రాంచైజీ గురువారం ప్రకటించింది. 2023 ఐపీఎల్ సీజన్‌లో అయ్యర్ నాయకత్వంలో నైట్‌రైడర్స్ బరిలోకి దిగాల్సింది. అయితే వెన్ను నొప్పి కారణంగా అయ్యర్ మొత్తం ఐపీఎల్ టోర్నీకి దూరమయ్యాడు. దాంతో అతని స్థానంలో నితీశ్ రాణా జట్టుకు సారథిగా వ్యవహరించాడు. వచ్చే సీజన్‌లో నితీశ్ రాణా జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఉంటాడు.

క్వార్టర్స్‌లో సుమీత్–సిక్కి రెడ్డి జోడీ

ఒడిశా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సుమీత్ రెడ్డి–సిక్కి రెడ్డి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. కటక్‌లో గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సుమీత్–సిక్కి ద్వయం 21–14, 17–21, 21–14తో అశ్విని పొన్నప్ప–రోహన్ కపూర్ (భారత్) జంటపై విజయం సాధించింది.



మన మహిళలు అదుర్స్

- తొలి రోజే భారత్ 410/7
- శుభ, జెమీమా, యస్తిక భాటియా, దీప్తి శర్మ అర్ధసెంచరీలు
- ఇంగ్లండ్‌తో ఏకైక టెస్టు

ముంబై: రెండేళ్ల విరామం తర్వాత టెస్టు మ్యాచ్ బరిలోకి దిగిన భారత మహిళల జట్టు అంచనాలకు మించి రాణించింది. ఇంగ్లండ్‌తో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల ఏకైక టెస్టులో మన బ్యాటర్లంతా ఒకరితో మరొకరు పోటీ పడి పరుగులు సాధించడంతో తొలి రోజే రికార్డు స్కోరు నమోదైంది. ఆట ముగిసే సమయానికి భారత్ 94 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 410 పరుగులు చేసింది. మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో ఒకే రోజు నమోదైన పరుగుల జాబితాను చూస్తే ఇది రెండో అత్యధిక స్కోరు కావడం విశేషం. శుభ సతీశ్ (76 బంతుల్లో 69; 13 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (99 బంతుల్లో 68;), యస్తిక భాటియా (88 బంతుల్లో 66; 10 ఫోర్లు, 1 సిక్స్), దీప్తి శర్మ (95 బంతుల్లో 60 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (81 బంతుల్లో 49; 6 ఫోర్లు) త్రుటిలో ఆ అవకాశం చేజార్చుకుంది. ప్రస్తుతం దీప్తితో పాటు పూజ వస్త్రకర్ (4 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉంది. డీవై పాటిల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. భారత్ తరఫున ముగ్గురు ప్లేయర్లు జెమీమా, రేణుకా సింగ్, శుభ సతీశ్ ఈ మ్యాచ్‌తో టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేశారు. వీరిలో శుభకు ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్ కూడా. ఓపెనర్లు షఫాలీ వర్మ (19), స్మృతి మంధాన (17) తక్కువ వ్యవధిలో వెనుదిరిగినా, ఆ తర్వాత భారత బ్యాటర్లు క్రీజ్‌లో పట్టుదలగా నిలబడ్డారు. కుదురుకున్న తర్వాత వేగంగా పరుగులు సాధించారు. మూడు భారీ భాగస్వామ్యాలతో జట్టును నడిపించారు. శుభ, రోడ్రిగ్స్ మూడో వికెట్‌కు 115 పరుగులు... యస్తిక, హర్మన్ ఐదో వికెట్‌కు 116 పరుగులు జోడించగా... దీప్తి, స్నేహ్ రాణా (73 బంతుల్లో 30; 5 ఫోర్లు) ఏడో వికెట్‌కు 92 పరుగులు జత చేయడం విశేషం.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: స్మృతి (బి) బెల్ 17; షఫాలీ (బి) క్రాస్ 19; శుభ (సి) సివర్ (బి) ఎకెల్‌స్టోన్ 69; జెమీమా (బి) బెల్ 68; హర్మన్‌ప్రీత్ (రనౌట్) 49; యస్తిక (సి) బెల్ (బి) డీన్ 66; దీప్తి (బ్యాటింగ్) 60; స్నేహ్ రాణా (బి) సివర్ 30; పూజ (బ్యాటింగ్) 4; ఎక్స్‌ట్రాలు 28; **మొత్తం (94 ఓవర్లలో 7 వికెట్లకు) 410. వికెట్ల పతనం:** 1–25, 2–47, 3–162, 4–190, 5–306, 6–313, 7–405. **బౌలింగ్:** కేట్ క్రాస్ 14–0–64–1, లారెన్ బెల్ 15–1–64–2, నాట్ సివర్ 11–4–25–1, లారెన్ 15–1–84–0, చార్లీ డీన్ 17–1–62–1, సోఫీ ఎకెల్‌స్టోన్ 22–4–85–1.

2 మహిళల టెస్టు క్రికెట్‌లో ఒకేరోజు సాధించిన అత్యధిక పరుగుల జాబితాలో భారత జట్టు రెండో స్థానం (410)లో నిలిచింది. 1935లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ ఒకే రోజు 431 పరుగులు సాధించింది. సొంతగడ్డపై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కూడా.

దీపక్ హుడా 180... 'విజయ్ హజారే' ఫైనల్లో రాజస్తాన్

రాజ్‌కోట్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో రాజస్తాన్ జట్టు ఫైనల్ చేరింది. కర్ణాటకతో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో రాజస్తాన్ ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. కర్ణాటక నిర్దేశించిన 283 పరుగుల లక్ష్యాన్ని రాజస్తాన్ 43.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ దీపక్ హుడా (128 బంతుల్లో 180; 19 ఫోర్లు, 5 సిక్స్‌లు) భారీ సెంచరీతో రాజస్తాన్‌ను ఒంటిచేత్తో గెలిపించాడు. కరణ్ లాంబా (73 నాటౌట్; 7 ఫోర్లు)తో కలిసి దీపక్ నాలుగో వికెట్‌కు 255 పరుగులు జోడించడం విశేషం. అంతకుముందు కర్ణాటక 50 ఓవర్లలో 8 వికెట్లకు 282 పరుగులు చేసింది. శనివారం జరిగే ఫైనల్లో హరియాణాతో రాజస్తాన్ తలపడుతుంది.

సూర్య సూపర్ సెంచరీ

- చివరి టి20లో భారత్ ఘన విజయం
- 106 పరుగులతో దక్షిణాఫ్రికా చిత్తు
- కుల్దీప్ యాదవ్‌కు 5 వికెట్లు
- 1–1తో సమంగా ముగిసిన సిరీస్
- ఆదివారం తొలి వన్డే


సూర్య


కుల్దీప్

జొహన్నెస్‌బర్గ్: వాండరర్స్ మైదానంలో భారత్ విజయహాసం చేసింది. గత మ్యాచ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటూ భారీ విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో భారత్ 106 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఫామ్‌లో ఉన్న కెప్టెన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (56 బంతుల్లో 100; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) మెరుపు శతకంతో చెలరేగాడు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (41 బంతుల్లో 60; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా రాణించాడు. అంతర్జాతీయ టి20ల్లో నాలుగో సెంచరీ సాధించిన సూర్య... రోహిత్ శర్మ, గ్లెన్ మ్యాక్స్‌వెల్‌లతో సమంగా నిలిచాడు. అనంతరం ఛేదనలో దక్షిణాఫ్రికా ఏ దశలోనూ ప్రభావం చూపలేకపోయింది. చివరకు ఆ జట్టు 13.5 ఓవర్లలోనే 95 పరుగులకే కుప్పకూలింది. డేవిడ్ మిల్లర్ (25 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా, మార్క్‌రమ్ (25) ఫర్వాలేదనిపించాడు. భారత స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (5/17) తన కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనతో ప్రత్యర్థిని పడగొట్టాడు. తొలి టి20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా... తాజా ఫలితంతో 1–1తో టి20 సిరీస్ సమంగా ముగిసింది. ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం తొలి మ్యాచ్ జరుగుతుంది.

సూర్య సిక్సర్ల జోరు...

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు సరైన ఆరంభం లభించలేదు. గిల్ (12), తిలక్ వర్మ (0)లను వరుస బంతుల్లో కేశవ్ మహరాజ్ అవుట్ చేశాడు. అయితే మరో ఎండ్‌లో యశస్వి మాత్రం దూకుడు కనబరుస్తూ మార్క్‌రమ్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. నాలుగో స్థానంలో వచ్చిన సూర్య తనదైన శైలిలో ఆరంభం నుంచి విరుచుకుపడటంతో స్కోరు వేగంగా దూసుకుపోయింది. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 62 పరుగులకు చేరింది. మధ్యలో కొంత నెమ్మదించిన యశస్వి 34 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం ఫెలుక్వాయో ఓవర్లో సూర్య చెలరేగిపోయాడు. వరుసగా 6, 4, 6, 6 కొట్టిన అతను 32 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. మూడో వికెట్‌కు సూర్యతో 70 బంతుల్లోనే 112 పరుగులు జోడించిన అనంతరం యశస్వి వెనుదిరిగాడు. రింకూ సింగ్ (14) ఈసారి ప్రభావం చూపలేకపోగా, జితేశ్ (4), జడేజా (4) విఫలమయ్యారు. మరోవైపు సూర్య మాత్రం తన జోరు కొనసాగించాడు. బర్గర్ ఓవర్లో వరుస బంతుల్లో 4, 6, 4 బాదిన అతను షమ్సీ ఓవర్లోనూ 4, 6 కొట్టాడు. 55 బంతుల్లో సూర్య సెంచరీ పూర్తి కాగా, 20వ ఓవర్లో భారత్ 3 వికెట్లు కోల్పోయింది. చివరి 4 ఓవర్లలో టీమిండియాను కట్టడి చేయడంలో సఫలమైన సఫారీ టీమ్ 40 పరుగులే ఇచ్చింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) హెన్‌డ్రిక్స్ (బి) షమ్సీ 60; గిల్ (ఎల్బీ) (బి) మహరాజ్ 8; తిలక్ (సి) మార్క్‌రమ్ (బి) మహరాజ్ 0; సూర్యకుమార్ (సి) బ్రీట్‌కే (బి) విలియమ్స్ 100; రింకూ (సి) (సబ్) స్టబ్స్ (బి) బర్గర్ 14; జితేశ్ (హిట్‌వికెట్) (బి) విలియమ్స్ 4; జడేజా (రనౌట్) 4; అర్ష్‌దీప్ (నాటౌట్) 0; సిరాజ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1–29, 2–29, 3–141, 4–188, 5–194, 6–199, 7–199. **బౌలింగ్:** బర్గర్ 4–0–39–1, మార్క్‌రమ్ 1–0–15–0, కేశవ్ మహరాజ్ 4–0–26–2, విలియమ్స్ 4–0–46–2, ఫెలుక్వాయో 3–0–33–0, షమ్సీ 4–0–38–1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెన్‌డ్రిక్స్ (రనౌట్) 8; బ్రీట్‌కే (బి) ముకేశ్ 14; మార్క్‌రమ్ (సి) యశస్వి (బి) జడేజా 25; క్లాసెన్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 5; మిల్లర్ (బి) కుల్దీప్ 35; ఫెరీరా (బి) కుల్దీప్ 12; ఫెలుక్వాయో (సి) అండ్ (బి) జడేజా 0; మహరాజ్ (బి) కుల్దీప్ 1; బర్గర్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 1; విలియమ్స్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; షమ్సీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (13.5 ఓవర్లలో ఆలౌట్) 95. వికెట్ల పతనం:** 1–4, 2–23, 3–42, 4–42, 5–75, 6–82, 7–89, 8–89, 9–94, 10–95. **బౌలింగ్:** సిరాజ్ 3–1–13–0, ముకేశ్ 2–0–21–1, అర్ష్‌దీప్ 2–0–13–1, జడేజా 3–0–25–2, తిలక్ 1–0–4–0, కుల్దీప్ 2.5–0–17–5.



భారత జట్టుకు నిరాశ

సెమీస్‌లో జర్మనీ చేతిలో ఓటమి

కౌలాలంపూర్: మూడోసారి జూనియర్ పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్ టైటిల్ సాధించాలనుకున్న భారత జట్టుకు నిరాశ ఎదురైంది. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన జర్మనీ జట్టుతో గురువారం జరిగిన సెమీఫైనల్లో యువ భారత్ 1–4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత జట్టుకు సుదీప్ చిర్మాకో (11వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. జర్మనీ జట్టు తరఫున బెన్ హాస్‌బాష్ (8వ ని.లో, 30+వ ని.లో) రెండు గోల్స్ చేయగా... పాల్ గ్లాండర్ (41వ ని.లో), ఫ్లోరియన్ స్పెర్లింగ్ (58వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఈ గెలుపుతో జర్మనీ జట్టు తొమ్మిదోసారి ఈ మెగా ఈవెంట్‌లో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. భారత జట్టుకు సెమీఫైనల్లో ఏకంగా 12 పెనాల్టీ కార్నర్‌లు వచ్చినా ఒక్క దానిని కూడా సద్వినియోగం చేసుకోకుండా మూల్యం చెల్లించుకుంది.

డేవిడ్ వార్నర్ సెంచరీ



పెర్త్: టెస్టు కెరీర్‌లో చివరి సిరీస్ బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ అదరగొట్టాడు. పాకిస్తాన్‌తో గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో వార్నర్ (211 బంతుల్లో 164; 16 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో సత్తా చాటాడు. టెస్టుల్లో చాలా కాలంగా ఫామ్‌లో లేకపోయినా 'వీడ్కోలు సిరీస్' ఇవ్వడంపై వచ్చిన విమర్శలకు వార్నర్ తన 26వ సెంచరీతో సమాధానమిచ్చాడు. వార్నర్ జోరుతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 84 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 346 పరుగులు సాధించింది. ఉస్మాన్ ఖ్వాజా (41), హెడ్ (40), స్మిత్ (31) ఫర్వాలేదనిపించగా... మార్ష్ (15 బ్యాటింగ్), కేరీ (14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఈ ఇన్నింగ్స్‌తో హేడెన్ (8625), మైకేల్ క్లార్క్ (8643)లను దాటిన వార్నర్ ఆస్ట్రేలియా తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఐదో స్థానానికి (8651) చేరాడు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


PRESENTING
THE FIRST AND BIGGEST
OUTLET MALL IN HYDERABAD
నేడే
గొప్ప ప్రారంభం
VALUE ZONE HYPER MART
VZ HYPER MART
VALUE ZONE
*Images shown above are indicative only. Color or Model may differ from the pictures shown
*Conditions Apply
doocreative.com
VALUEZONEHYPERMART
VALUEZONE LOCATION
GRAND INAUGURATION
TODAY AT 11.00 AM BY
SRI NANDAMURI
BALAKRISHNA GARU
VALUE ZONE
HYPER MART
@PATANCHERU
FASHION
FOR MEN, WOMEN & KIDS
UPTO 50% OFF
100+
NATIONAL & INTERNATIONAL BRANDS
GROCERIES
5000+ VALUE DEALS...
1+1 OFFERS ON 200+ PRODUCTS
FURNISHING
FOOTWEAR &
LUGGAGE
UPTO 70% OFF
MOBILE
ACCESSORIES
UPTO 80% OFF
Fashion for Men, Women & Kids | Footwear | Groceries | Furnishing | Luggage | Food Court | Accessories | Kids Play Zone (Free)
Ample Parking Space